మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న ప్రజావాణి దిన పత్రిక మరియు ప్రజావాణి చానల్ నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
(కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత)
Ph:9440032006

| రాజన్న సిరిసిల్ల | గురువారం | 10.09.2026 | సంపుటి : 01 | సంచిక : 252 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | THURSDAY | 10.09.2026 | Volume : 01 | Issue :252 | Pages : 12 | Cost : 2/- |




## 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో
# కుట్ర..

బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారు
స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదు
ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తాం
అందరినీ శిక్షించేలా పూర్తిస్థాయి విచారణ
కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్,

మిగతా2లో...



## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన

మిగతా2లో...

## ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

సెప్టెంబర్ 11న ఫొటో సహిత ఓటర్ల జాబితా ప్రదర్శన
15వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా రూపకల్పన




## స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..
# నోటీసు ఎలా ఇస్తారు?

- గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



# గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

● పోలీసుల దాడిపై గవర్నరుకు బీఆర్ఎస్ ఫిర్యాదు ● కాంగ్రెస్ సర్కార్‌పై, హామీలపై ఫిర్యాదుల వెల్లువ ● 1000 రోజులు గడిచినా హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ● రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై వైఫల్యం ● మా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారు: కేటీఆర్



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు కలిశారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అనుచిత ప్రవర్తనపై, శాంతిభద్రతలు, ఇతర అంశాలపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల గురించి కూడా గవర్నర్‌కు వివరంగా తెలిపామని కేటీఆర్ తెలిపారు. వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని అరచేతిలో స్వర్గం చూపారని, కానీ ప్రభుత్వంలోకి వచ్చి వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు కింద గతంలో రూ.73 వేల కోట్లు ఇస్తే.. ఇప్పుడు యూరియా ఇవ్వట్లేదని తెలిపామని, రైతు

మిగతా2లో...



## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

- రాష్ట్ర మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు

**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో బుధవారం మరో కీలక మలుపు చోటుచేసుకుంది. సొంత పార్టీకి చెందిన కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ తోటి మహిళా సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా ఆమె

మిగతా2లో...

## శాసనసభ నుంచి బీఆర్ఎస్
# ఎమ్మెల్యేల సస్పెన్షన్

- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై వేటు
- సభ్యుల సస్పెన్షన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు
- సస్పెన్షన్ వేటుకు స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆమోదం
- సెషన్ మొత్తం సస్పెండ్ చేసిన శాసనసభ స్పీకర్



**హైదారాబాద్,సెప్టెంబర్ 9 :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం

మిగతా2లో...

## యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ
# రద్దు చేయం

● ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్ ● రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు ● సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం.. ● శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం




## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న
# ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

ప్రత్యేక ఆహ్వానం పలికిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
సానుకూలంగా స్పందించిన ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్
తెలంగాణ బియ్యం ఎగుమతుల విస్తరణకు సానుకూల స్పందన
మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాల కొనుగోలుపైనా ఆసక్తి
అంతర్జాతీయ విపణిలో తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత అవకాశాలు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 :** తెలంగాణను ప్రపంచ పెట్టుబడులు, వ్యవసాయ వాణిజ్యం, పారిశ్రామిక అవకాశాలకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపే లక్ష్యంతో 2026 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక లి"తెలంగాణ రైజింగ్ సమ్మిట్"లికు హాజరుకావాల్సిందిగా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్‌ను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు. న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్

మిగతా2లో...



# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర..

(మొదటి పేజీ తరువాయి)

ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నామని, డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని స్పష్టం చేశారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ చేస్తామని, క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధీకరణ చేశారని, ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో మీటింగ్ పెట్టిన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండొచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా నిలదీశారు. సభాపతికి క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించాయని గుర్తు చేశారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నాం. కుట్రలు చేసిన వారిని, అమలు చేసిన వారిని కోర్టు ముందు దోషులుగా నిలబెడతాం. అంటరానితనం ఘటనపై విచారణ అధికారిగా విజయ్‌కుమార్‌ను నియమిస్తున్నాం. విచారణాధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియామిస్తున్నాం. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపై కూడా విచారణ చేపడుతున్నాం. డ్యూటీలో ఉన్న వారిపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తాం. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారు, అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటాం. కుట్రధారులు, పాత్రధారులు అందరినీ శిక్షించేలా విచారణ జరుగుతుంది. క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుస ఘటనలపై విచారణ జరిపిస్తామని అన్నారు. దళిత సభాపతిని అవమానించినందుకు అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని, స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని సీఎం పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడ డప్పు మోగించి వాళ్ల నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదు, దాడి చేయలేదని స్పష్టం చేశారు.

# గవర్నర్‌కు దాడిపై ఆధారాలు చూపాం

(మొదటి పేజీ తరువాయి)

బీమా ఎగ్గొట్టి రైతులకు ధీమా లేకుండా చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో వివరించామని పేర్కొన్నారు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చామని, వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు ఆధారాలు చూపాం. సబితపై పోలీసుల దాడి, అవమానంపై గవర్నర్‌కు ఆధారాలు సమర్పించాం. సునీత చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడంపై ఆధారాలు సమర్పించాం. మాపై దాడులు చేసి మాపైనే కేసులు పెట్టారని గవర్నర్‌కు వివరించాం. దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు కాలేదు. పార్లమెంటుకు రాహుల్‌గాంధీ వెళ్లినట్లే మేమూ నల్ల టీషర్టులు వేసుకుని వచ్చాం. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందలపై సస్పెన్షన్ వేటు పడింది. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. భాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి.

పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కానున్న ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ కార్యదర్శి ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ ఉదయం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, ఉత్పాదక సామర్థ్యం, ఎగుమతి అవకాశాలను ఆయనకు వివరించడంతోపాటు తెలంగాణ రైజింగ్ సమ్మిట్ లక్ష్యాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులను భారీగా పెంచడం, ఇరు ప్రాంతాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం, దీర్ఘకాలిక వాణిజ్య భాగస్వామ్యాన్ని నెలకొల్పడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ నుంచి పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న నాణ్యమైన మాంస ఉత్పత్తులు, అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విత్తనాల కొనుగోలుపైనా శ్రీ ఫ్రాన్సిస్కో పి. టియు లారెల్ జూనియర్ ఆసక్తి వ్యక్తం చేశారని తెలిపారు.

# సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోసేశారు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాకు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను వారి పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా దురుసుగా ప్రవర్తించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. తమ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, తాజాగా మంత్రి సీతక్క చేసిన ఆరోపణల ఈ వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. మరోవైపు, విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి అభియోగాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై పోలీసులు ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు.

# ఏపీలో స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఖరారుకు షెడ్యూల్ విడుదల

**అమరావతి,సెప్టెంబర్ 9 :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికలకు సంబంధించి ఫొటోలతో కూడిన పూర్తిస్థాయి ఓటర్ల జాబితాలను తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎటువంటి లోపాలకు తావులేకుండా పక్కాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

# స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా..నోటీసు ఎలా ఇస్తారు?

**హైదరాబాద్:సెప్టెంబర్ 9 :**
జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనల్లో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి గ్రేటర్ నొయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీచేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా.. వాటిని ఉల్లంఘించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పుబట్టింది. 'ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా ఇస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ ఓ మేజిస్ట్రేట్‌కు అలా చేయడానికి ఎంత ధైర్యం?' అని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మండిపడింది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9 :** దేశంలోని ఏడు కీలక రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశమైన క్యాబినెట్ కీలక రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఇందులో తెలంగాణలో ఒక ప్రాజెక్టుకు, ఏపీలో ఒక ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడిం చారు. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బిలాస్‌పూర్-కాంతి నగరాలను కలుపుతూ ఈ ప్రాజెక్టులు ఉండనున్నాయి. ఇప్పటికే మూడు రైల్వే లైన్లు ఉన్న పలు ప్రాంతాల్లో నాలుగో లైన్ ఏర్పాటుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటికే రూ. 2,000 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, మరో 5,000 కిలోమీటర్ల పనులు జరుగుతున్నాయని, వీటికి ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. అలాగే, మరో 4,000 కిలోమీటర్ల మేర పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నామన్నారు. తెలంగాణకు సంబంధించి ఒక ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇది ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల పొడవైన నాలుగో లైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. దీని విలువ రూ. 2,419 కోట్లుగా ప్రభుత్వం నిర్ధరించింది. ఏపీకి సంబంధించి అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3,4 లైన్ల నిర్మాణం జరగనుంది. మొత్తంగా దక్షిణాదికి సంబంధించి తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్రం అంగీకరించింది.

# యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయం

**హైదరాబాద్,సెప్టెంబర్ 9 :** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా, అవసరమైన మేరకు అందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. యాప్ అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, భవిష్యత్‌లో రైతులకు మరింత సులభంగా, సమర్థవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఈ రోజు శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు యూరియా సరఫరా, యాప్ ద్వారా బుకింగ్, కౌలు రైతుల ఇబ్బందులు, సొసైటీలకు యూరియా రవాణా చార్జీలు, సాంకేతిక సమస్యలు తదితర అంశాలను ప్రస్తావించారు. వాటిపై మంత్రి సమగ్రంగా వివరణ ఇచ్చారు. గతంలో ఆధార్ ఆధారంగా ఎరువుల పంపిణీ జరిగేదని మంత్రి తెలిపారు. అయితే సబ్సిడీపై లభించే ఎరువులు భూమిని వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకే అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఎరువుల అక్రమ తరలింపు, బ్లాక్‌మార్కెటింగ్, అవసరానికి మించి నిల్వ చేసుకోవడం వంటి సమస్యలను అరికట్టడంతో పాటు, రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా చేయడమే యాప్ తీసుకురావడానికి ప్రధాన ఉద్దేశమని వివరించారు. పారదర్శకంగా, అవసరమైన మేరకు సబ్సిడీ యూరియా నిజమైన రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రబీ 2025-26లో 'యూరియా బుకింగ్ యాప్'ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణలో అమలు చేసిన ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో దీని ఆధారంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడానికి 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 04.06.2026న ప్రవేశపెట్టిన యాప్‌ను తెలంగాణలో సెప్టెంబర్ 2, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అమలు చేసిన యూరియా యాప్ స్థానంలో ప్రస్తుతం యాప్ ద్వారా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. కొత్త యాప్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సమయంలో అక్కడక్కడా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తిన విషయం వాస్తవమేనని మంత్రి అన్నారు. అయితే అవి వ్యవస్థలో శాశ్వతమైన లోపాలు కావని, సాంకేతిక కారణాలతో ఏర్పడిన సమస్యలని తెలిపారు. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక బృందం మరియు మా అధికారులు యాప్ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. రాబోయే పంట కాలాల్లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా సేవలు అందించేందుకు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులు ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల డీలర్లు, రిటైల్ ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్ల సహకారంతో రైతులకు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. రైతు గుర్తింపు, వెరిఫికేషన్‌కు లోబడి ఈ సహాయం అందిస్తారని చెప్పారు. గిడ్డంగుల నుంచి రిటైల్ విక్రయ కేంద్రాలకు ఎరువులను తరలించడానికి పట్టే సమయం, రసీదుల లెక్కింపు, స్టాక్ బదిలీ నమోదులు, e-POS సింక్రొనైజేషన్, నెట్‌వర్క్ కనెక్టివిటీ వంటి కారణాలతో కొన్ని సందర్భాల్లో డిజిటల్ స్టాక్, భౌతిక స్టాక్ మధ్య తాత్కాలిక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాల వారీగా స్టాక్ తనిఖీలు నిర్వహించాలని, డిజిటల్ రికార్డులు మరియు భౌతిక నిల్వలను క్రమం తప్పకుండా సరిపోల్చాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని చెప్పారు.

# రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా జె.శివప్రసాద్ ఎంపిక

● రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జె. శివప్రసాద్



**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 09 ప్రజా వాణి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జె శివ ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కి, అలాగే తన ఎంపికకు పూర్తి సహకారం అందించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు కి రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు ఎ.క్రిష్ణ మోహన్ కి, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో తాను చేసిన సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తనను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా నియమించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సంచాలకులు కృష్ణమోహన్, జిల్లా చైర్మన్ వడ్డే వెంకట్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం ఉమ్మడి జిల్లా గ్రంథాలయ అధికారులకు, సిబ్బందికి కూడా కృతజ్ఞతలు తెలిపారు

# కుష్టు వ్యాధి అవగాహన పోస్టర్స్ విడుదల చేసిన డి యం ఎచ్ ఓ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు.



**అనంత పురం సెప్టెంబర్ 09 ప్రజా వాణి** జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 తేదీ నుండి 24వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెనింగ్ కార్యక్రమం నిర్వహించడం లో భాగంగా ప్రజల అవగాహన కోసం పోస్టర్స్ , పాంప్లెట్స్ ను జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తన కార్యాలయంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్ టి బి కార్యక్రమ అధికారి డాక్టర్ బి జయలక్ష్మి ప్రోగ్రామ్ అధికారులతో కలిసి విడుదల చేశారు,ఈ సందర్భంగా డి యం ఎచ్ ఓ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించడం కోసం వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది చేత ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలు ఉన్న అనుమానిత కేసులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపి వైద్యుల చేత వ్యాధి నిర్ధారింపజేసి వెంటనే ఉచితంగా ఎం డి టి మందులను అందించడం జరుగుతుందని తద్వారా వ్యాధి ని నివారించవచ్చని అలాగే కుష్టు వ్యాధి వల్ల కలిగే అంగవైకల్యం ను కూడా నిర్మూలించవచ్చని తెలియజేశారు.కావున జిల్లాలోని వైద్య సిబ్బంది 11వ తేదీ నుండి 24వ తేదీ వరకు ప్రతిరోజు మీ మీ ప్రాంతాల్లో ప్రతి ఇంటిని సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వైద్యం అందించాలని,అలాగే వైద్య సిబ్బందికి వైద్య అధికారులుశిక్షణ ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు,ఈ కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి,పారామెడికల్ అధికారి నాగన్న, డిపిఎమ్ఓ లు రామదాస్ ,తిప్పేస్వామి పాల్గొన్నారు

# జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి జె శివప్రసాద్ కు సన్మానం చేసిన ఉద్యోగులు



**అనంత పురం సెప్టెంబర్ 09 ప్రజా వాణి** రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వులు జీ ఓ ఆర్ టి .నెంబర్. 159 మేరకు ఆంధ్రప్రదేశ్ లోని 13 మంది జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శులలో ఒకరిని ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ పరిషత్ సభ్యునిగా నియమించాల్సి ఉండగా అందులో అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి అయిన శివ ప్రసాద్ ని ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ పరిషత్ మెంబెర్ గా నియమించడం పట్ల అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్ గ్రంధాలయ సంస్థ ఉద్యోగుల సంఘ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు పి కమ్మన్న, ప్రతాప్ రెడ్డి, రవికుమార్ నాయుడు, రామాంజినేయులు, ఏ ఎమ్ శ్రీపతి,జయరాం, గోవిందు, ఖాజామోడీన్ కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ ఆర్ ఎస్ రాజు, రామాంజినమ్మ, కిరణ్, జీవన మొదలగు వారు ఘనంగా సన్మానించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తీరుపై భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు

● స్పీకర్‌ను దూషించిన వారి సభ్యత్వం రద్దు చేయాలి
● నాచారం సర్కిల్‌లోని డివిజన్లల్లో ఆందోళనలు





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 9 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. దళితుడైన స్పీకర్‌ను ఎలా దూషిస్తారంటూ ప్రశ్నించారు. కేసులు నమోదు చేయడం, సభ నుంచి సస్పెషన్ చేయడం కాదు ఏకంగా సభ్యత్వాన్నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పిలుపు మేరకు నాచారం, మల్లాపూర్, శక్తిసాయినగర్, హెచ్ఎంటీనగర్, హెచ్‌బీకాలనీ డివిజన్లల్లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ పట్ల వ్యవహరించిన తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టారు. దళితుడైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్ల దురుసుగా, అమార్యదగా, దుర్భాషలాడిన ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌కుమార్‌రెడ్డిల సభ్యత్వాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కేవలం ఈ సెషన్ సమావేశాలకు మాత్రమే రాకుండా సస్పెండ్ చేయడం సరైన చర్య కాదన్నారు. దీనికి పూర్తి బాధ్యత కేటీఆర్, హరీష్‌రావునే వహించాలన్నారు. కార్యక్రమంలో నాచారం,HMT కాలనీ,మల్లాపూర్,శక్తిసాయి నగర్ కాలనీ,HB కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కాడెద్దుల కష్టానికి కృతజ్ఞతగా.. పొలాల అమావాస్య

● రైతు--పశువు--ప్రకృతి అనుబంధానికి ప్రతీకగా కొనసాగుతున్న సంప్రదాయం







**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజావాణి:**తెలంగాణ పల్లె సంస్కృతిలో పొలాల అమావాస్యకు ప్రత్యేక స్థానం ఉంది. శ్రావణ మాసం ముగింపు అమావాస్య రోజున జరుపుకునే ఈ పండుగను పలు ప్రాంతాల్లో పొలాల పండుగ, ఎడ్ల పండుగ, కాడెద్దుల పండుగ, బసవన్న పండుగ పేర్లతో పిలుస్తారు. ఏడాది పొడవునా రైతుకు వ్యవసాయ పనుల్లో అండగా నిలిచే కాడెద్దులను పూజించి, వాటి పట్ల కృతజ్ఞత చాటుకోవడం ఈ పండుగ ప్రధాన ఉద్దేశం.

**రైతు జీవితంలో విడదీయరాని బంధం**

విత్తనం వేసే దశ నుంచి దుక్కి దున్నడం, పంటను తరలించడం వరకు ఒకప్పుడు ఎద్దులే రైతుకు ప్రధాన ఆధారం. ఎండా, వానా లెక్కచేయకుండా రైతుతో కలిసి శ్రమించిన ఎద్దులను కుటుంబ సభ్యులుగా భావించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. అందుకే సంవత్సరానికి ఒక్కరోజైనా వాటికి విశ్రాంతినిచ్చి ప్రత్యేకంగా పూజించడం ఆనవాయితీగా మారింది.

**ముస్తాబయ్యే బసవన్నలు**

పండుగ సందర్భంగా రైతులు ఎద్దులకు స్నానం చేయించి, కొమ్ములకు రంగులు వేసి, పూలు, రంగురంగుల వస్త్రాలతో అలంకరిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఎద్దులను శివుడి వాహనమైన నందిగా భావించి పూజించడం సంప్రదాయంగా వస్తోంది.

**బూరెలు.. పండుగ ప్రత్యేకత**

పొలాల అమావాస్య సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రత్యేక పిండి వంటకాలు తయారు చేస్తారు. ముఖ్యంగా బూరెలు లేదా పురన్‌పోలీని నైవేద్యంగా సమర్పించే ఆచారం ఉంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోనూ ఈ పండుగను వైభవంగా నిర్వహిస్తారు.

**కాలం మారినా.. ఆచారం మారలేదు**

వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఆధునిక యంత్రాలు విస్తరించినప్పటికీ పొలాల అమావాస్య ప్రాధాన్యం తగ్గలేదు. యాంత్రీకరణతో ఎద్దుల వినియోగం తగ్గినా, రైతు జీవితంలో వాటి పాత్రను గుర్తుచేసుకునే పండుగగా ఇది కొనసాగుతోంది. రైతు, పశువు, భూమి, ప్రకృతి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ మరోసారి చాటిచెబుతోంది.

**సంతాన క్షేమానికీ ప్రత్యేక పూజలు**

పొలాల అమావాస్యకు మరో ఆధ్యాత్మిక ప్రాధాన్యత కూడా ఉంది. కొన్ని తెలుగు ప్రాంతాల్లో మహిళలు పోలాంబ వ్రతం పేరుతో సంతాన క్షేమం, పిల్లల ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం పూజలు నిర్వహిస్తారు. ప్రాంతానుసారం ఆచారాలు, పూజా విధానాల్లో మార్పులు కనిపిస్తాయి.

**పల్లె జీవనానికి అద్దం పట్టే పండుగ**

పొలాల అమావాస్య కేవలం ఓ పండుగ మాత్రమే కాదు.. రైతు తనతో పాటు పొలంలో శ్రమించిన జీవిని గుర్తు చేసుకునే కృతజ్ఞతా వేడుక. ప్రకృతిని గౌరవించడం, పశువులను కుటుంబ సభ్యులుగా చూడడం, వ్యవసాయ సంస్కృతిని భావితరాలకు అందించడం వంటి విలువలను ఈ పండుగ ప్రతిబింబిస్తుంది. ఆధునికత ఎంత పెరిగినా పల్లె మట్టితో ముడిపడిన ఈ సంప్రదాయం తరతరాలకు కొనసాగాలని గ్రామీణులు కోరుతున్నారు.

# లద్నూరులో బస్సు సౌకర్యం కోసం కల్పించాలని విద్యార్థుల ధర్నా

■ స్థానిక ప్రజా ప్రతినిధుల సంపూర్ణ మద్దతు
■ స్పందించని జనగామ డిపో మేనేజర్
■ రెండు రోజుల్లో సమస్య పరిష్కరించపోతే... నిరంతర ధర్నా
■ ఎస్సై ఆసిఫ్ హామీతో ధర్నా విరమించిన విద్యార్థులు





**మద్దూరు సెప్టెంబర్9, ప్రజా వాణి,**మండలంలోని లద్నూరు నుండి ప్రతి రోజు జనగామ జిల్లా కేంద్రానికి విద్యా కోసం 30 మంది విద్యార్థులు బస్సులో ప్రయాణం చేసే విద్యార్థులకు జనగామ అర్ టి సి అధికారులు శాపంగా మారీ విద్యార్థుల జీవితాలతో చెలగటమడుతున్నారు.దీంతోబుదవారం లద్నూరు గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు గ్రామ ఉప సర్పంచ్ బెడద శివ కుమార్, ఎబివిపి నాయకుడు సోగాల మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ముందు రోడ్డుపై రెండు గంటల పాటు బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉప సర్పంచ్ శివ కుమార్, ఎబివిపి నాయకుడు సోగాల మనోజ్ కుమార్, వార్డు సభ్యులు పూల శరత్ కుమార్ లు మాట్లాడుతూ ఎప్పటినుండో మద్దూరు, లద్నూరు, మీదుగా బచ్చన్నపేట నుండి జనగామ వెళ్ళే బస్సు విద్యార్థుల కళాశాలకు సరైనా సమయంకు వెళ్ళేవారు. గత మూడు రోజుల క్రితం జనగామ డిపో అధికారులు తమ ఇష్టారాజ్యంగా బస్సు వేళలు మార్చి బచ్చన్నపేట నుండి ఆలేరు ద్వారా హైదరాబాద్ వెళు ఉండడంతో విద్యార్థులు బచ్చన్నపేటలో దిగి జనగామకు వెళ్ళే బస్సు కోసం గంటల తరబడి వేచి ఉండడంతో విద్యార్థులు కొన్ని క్లాసులు హాజరు కాలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న మద్దూరు ఎస్సై మహమ్మద్ ఆసీఫ్ హుస్నాబాద్ ఏసిపి సదానందం, జనగామ అర్ టి సి అధికారులతో సంప్రదింపులు జరిపి రెండు రోజుల్లో యధావిధిగా జనగామ వరకు వెళ్లేందుకు చర్యలు తీసుకునేవిధంగా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. విద్యార్థుల ధర్నాకు సంపూర్ణ మద్దతు తెలిపిన రేబర్తి పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి,గ్రామ ఉప సర్పంచ్ శివ కుమార్, మాజీ సర్పంచులు రామడుగు బాల్ రాజ్, జీడికంటి సుదర్శన్, దాసరి పద్మా రెడ్డి,సురేష్, వార్డు సభ్యులు పూల శరత్ కుమార్, మంజుల గోవింద్,ఎబివిపి నాయకుడు సోగాల మనోజ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

● 20 లీటర్ల గుడుంబా స్వాధీనం
● మత్తు రహిత సమాజం కోసం కృషి చేయాలి
● ఎల్.రవీందర్ గార్ల బయ్యారం సిఐ





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 09(ప్రజా వాణి )**సమాజానికి యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారిన గంజాయి,గుడుంబా,మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి మత్తు రహిత సమాజం కోసం బాధ్యతతో కృషి చేయాలని గార్ల బయ్యారం సిఐ ఎల్. రవీందర్ అన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు బుధవారం గార్ల పోలీసులు సీతంపేట గ్రామంలో గుడుంబా స్థావరాలు పై విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ,మత్తు రహిత సమాజం కోసం మీ ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసిన గంజాయి విక్రయిస్తున్నా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.గుడుంబా తయారీ,విక్రయాలను పూరి స్థాయిలో అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని,300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈకార్యక్రమంలో గార్ల ఎస్సై బి. సాయికుమార్,బయ్యారం ఎస్సై ప్రశాంత్ బాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళిత, గిరిజన రాజకీయ నేతలను అవమానిస్తే ఊరుకోం

■ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన గా తాత మధు దిష్టిబొమ్మ దహనం
■ ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్
■ హనుమకొండ జిల్లా బ్యూరో నవీన్



**హనుమకొండ:** దళిత, గిరిజన రాజకీయ నాయకులను అవమానించేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ హెచ్చరించారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై, ఆయన తల్లిపై ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ.. దళిత ప్రజాప్రతినిధులను కక్షపూరితంగా అవమానించడం దారుణమన్నారు. దళితులకు రాజకీయంగా ఉన్నత పదవులు లభిస్తే కొంతమంది అగ్రవర్ణ రాజకీయ నాయకులు ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.తాత మధును రాజకీయంగా బహిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన నాయకులపై కక్షపూరితంగా వ్యవహరించే వారిపై ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయాలని, దళితులు, గిరిజనులను కించపరిచేలా మాట్లాడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలను పోలీసులు సీరియస్‌గా తీసుకుని మరోసారి జాతి, కులం పేరుతో అవమానకర వ్యాఖ్యలు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ దళిత, గిరిజన ప్రజాప్రతినిధులను అవమానిస్తే సహించేది లేదని నరేష్ స్పష్టం చేశారు. దళిత, గిరిజన నాయకుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు ఇప్ప భరత్, నిశాంత్, ఆదిత్య, కిరణ్, సాయి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బస్టాండ్‌లో గీజర్ వల్ల భవనంలో పొగలు

- ఏసీ, ఫర్నిచర్ రూమ్ దగ్ధం.. ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం.
- ఎలాంటి ప్రాణానష్టం జరగపోవడం తో ఊపిరిపిల్చుకున్న వైనం.
- సోప్ తయారీ కేంద్రంలో తగిన భద్రత ప్రాణాలు ఉన్నాయా..?
- అధికారులు స్పందించి వివరాలు వెల్లడించాలని ప్రజల డిమాండ్.





**రాజన్న సిరిసిల్ల, ప్రజావాణి**సిరిసిల్ల కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఓ భవనంలో గీజర్ కారణంగా మంటలు చెలరేగి ఏసీ, ఫర్నిచర్ ఉన్న గది పూర్తిగా దగ్ధమైన ఘటన కలకలం రేపింది. గది నుంచి భారీగా పొగలు వెలువడటంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

**సోప్ తయారీ కేంద్రం ఉందన్న అనుమానాలు.. భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు**

అయితే ప్రమాదం జరిగిన భవనంలో సోప్ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారన్న సమాచారం, అనుమానాలు స్థానికుల్లో మరిన్ని ప్రశ్నలకు తావిస్తున్నాయి. ఒకవేళ నిజంగానే అక్కడ తయారీ యూనిట్ కొనసాగుతున్నట్లయితే దానికి సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా...? ప్రమాదకర పదార్థాల నిల్వ, వినియోగానికి నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా...? అనే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

**రెసిడెన్షియల్ భవనమా.. కమర్షియల్ వినియోగమా?**

భవనాన్ని ఏ ఉద్దేశంతో నిర్మించారు? రెసిడెన్షియల్ అనుమతులతో నిర్మించి కమర్షియల్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారా? లేక పూర్తిస్థాయి కమర్షియల్ అనుమతులు ఉన్నాయా? అన్నది తేలాల్సి ఉంది. ప్రత్యేకంగా సోప్ తయారీ యూనిట్ ఉన్నట్లయితే మున్సిపల్, ఫైర్ సేఫ్టీ, పరిశ్రమలు తదితర శాఖల అనుమతులు తప్పనిసరిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**లైన్‌లోకి రాని మున్సిపల్ కమిషనర్.. స్పందన ఎక్కడ?**

ఈ ఘటనపై భవన వినియోగం, అనుమతులు, సోప్ తయారీ కేంద్రం నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై వివరణ కోరేందుకు మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లభించలేదని సమాచారం. ప్రమాదం జరిగిన భవనంపై ఇన్ని అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ అధికారుల మౌనం పలు సందేహాలకు దారితీస్తోంది.

**అధికారులు వెంటనే విచారణ చేపట్టాలి**

ప్రమాదం జరిగిన భవనానికి సంబంధించిన బిల్డింగ్ పర్మిషన్, ఆక్యుపెన్సీ, రెసిడెన్షియల్/కమర్షియల్ వినియోగం, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్, సోప్ తయారీ యూనిట్‌కు ఉన్న అనుమతులు తదితర అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల భద్రతకు సంబంధించిన అంశంలో నిర్లక్ష్యానికి తావులేకుండా మున్సిపల్ అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను వెల్లడించాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పాత తండాలో ఘనంగా కాళోజీ జయంతి



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం పాత తండాలో తెలంగాణ భాషా దినోత్సవం పురస్కరించుకొని ధిక్కారస్వరం కాళోజీ నారాయణరావు జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక సర్పంచి ఇస్లావత్ నరేష్ ఆధ్వర్యాన గ్రామపంచాయతీలో ఉద్యమ కలం వీరుడు కాళన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగినా ఎక్కడ అక్రమం జరిగినా కాళోజి నారాయణరావు మాటల తూటాలతో ఎదిరించేవాడు అన్నార గేయ కవితలతో దుమారం లేపి దుమారం లేపి తోక ముడిచేలా తీవ్రంగా వ్యతిరేకించే వారన్నారు. తెలంగాణ సాధన కోసం ఆసాంతం పోరాడిన గొప్ప ఉద్యమ కవి కాళోజీ నారాయణరావని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి గడ్డి అశోక్,వార్డు సభ్యులు ఇస్లావతు శ్రీధర్, బానోతు కౌసల్య,బాధావతు అరుణ,గ్రామ పెద్దలు బాదావత్ బిచ్చ,ఏఎన్ఎం మల్లికాంబ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన స్తంభం పడి రోజులు గడుస్తున్నా పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు.

- ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీస్తున్న స్థానికులు.



**హుజూర్నగర్ సెప్టెంబర్ 9 (ప్రజావాణి)** హుజూర్నగర్ నుండి మట్టపల్లి మెయిన్ రోడ్డు పెదవీడు సుల్తాన్ పురం మధ్యలో రోడ్డు పక్కన గత వారం క్రితం రెండు స్తంభాలు విరిగి పడ్డాయి. స్తంభాలు విరిగిపడి వారం గడుస్తున్నా కూడా విద్యుత్ శాఖ అధికారులు కనీసం వాటిని పక్కకు తీసే ప్రయత్నం చేయకపోగా, వైర్లను కట్ చేసి స్తంభాన్ని అలాగే ఉంచేశారు. ఎవరైనా వాహనదారులకు ఆ స్తంభం తగిలి ప్రమాదానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం గురించి కరెంట్ శాఖ మఠంపల్లి ఏఈ ని చరవాణి ద్వారా సంప్రదించగా స్తంభం తీయాలంటే ఇంకా సమయం పడుతుంది, కాంట్రాక్టర్ బిజీగా ఉన్నాడు, ఆయన ఖాళీగా లేడు, ఆయన వచ్చినప్పుడు తీపిస్తాను అని నిర్లక్ష్య ధోరణితో సమాధానం చెబుతున్నారు. ఈ సమస్యపై విద్యుత్ శాఖ పై స్థాయి అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పక్కన పడ్డ స్తంభాలను తీయించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా నిర్లక్ష్య ధోరణితో మాట్లాడుతున్న కరెంట్ శాఖ ఏఈ పైన కూడా శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సర్పంచుల గొంతు నొక్కితే.. పల్లెల సమస్యలు తీరుతాయా?

- బిల్లులు ఎక్కడ..? నిధులు ఎక్కడ..? అధికారాలు ఎక్కడ..?
- అప్పులు చేసి గ్రామాలను నడివి ంచిన పల్లె ప్రదాతలకు ఇదేనా ప్రతిఫలం?
- అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన జేఏసీ నేత రవినాయక్ ముందస్తు అరెస్ట్.!







**కేసముద్రం సెప్టెంబర్ 09,ప్రజావాణి.**గ్రామానికి సర్పంచే ప్రథమ పౌరుడు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి. పల్లెల్లో సమస్య వస్తే ముందుగా నిలబడేది ఆయనే.. అభివృద్ధి పనులకు నిధులు ఆలస్యమైతే ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది కూడా ఆయనే. కానీ నేడు అదే సర్పంచులు తమకు రావాల్సిన బిల్లులు, పంచాయతీలకు రావాల్సిన నిధులు, పాలనా అధికారాల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది?

"గ్రామాన్ని అభివృద్ధి చేయండి" అని బాధ్యతలు అప్పగించి.. అభివృద్ధి కోసం చేసిన ఖర్చుల బిల్లుల కోసం మాత్రం సర్పంచులనే ఎదురుచూడమంటే ఎలా? ఇదే ఇప్పుడు పల్లెల్లో వినిపిస్తున్న ప్రధాన ప్రశ్న.ఈ నేపథ్యంలో తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వాంకుడోత్ రవినాయక్‌ను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని కేసముద్రం పోలీస్ స్టేషన్‌కు తరలించారని జేఏసీ నేతలు తెలిపారు.

**అరెస్టుతో ప్రశ్న ఆగిపోతుందా?**

రవినాయక్‌ను అరెస్ట్ చేయడంతో ఒక వ్యక్తిని మాత్రమే అడ్డుకున్నట్టవుతుందేమో.. కానీ ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారు?పెండింగ్ బిల్లులు ఎప్పుడు విడుదల చేస్తారు?

పంచాయతీలకు రావాల్సిన నిధులు ఎప్పుడు అందుతాయి? సర్పంచులు అప్పుల భారంలో ఉన్నారనే ఆవేదనపై ప్రభుత్వం ఏం చేస్తుంది?పాలనా అధికారాల విషయంలో ఉన్న సమస్యలకు పరిష్కారం ఎప్పుడు?

ఇవే ఇప్పుడు సర్పంచుల నుంచి ప్రభుత్వానికి ఎదురవుతున్న ప్రశ్నలు.

**పల్లె అభివృద్ధికి .. సర్పంచుల అప్పుల బాధ!**

గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీరు, చిన్నచిన్న అభివృద్ధి పనుల కోసం తాము సొంతంగా డబ్బులు ఖర్చు చేశామని పలువురు సర్పంచులు చెబుతున్నారు.ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు ఆలస్యమవుతున్నాయని, దీంతో అప్పుల భారాన్ని మోయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల కోసం ఖర్చు చేసిన సొమ్ము తిరిగి రావడానికి ఇంత కాలం ఎందుకు?అనేది ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నగా సర్పంచుల సంఘం ముందుకు తెస్తోంది.

**నిధుల్లేని పంచాయతీకి .. బాధ్యత మాత్రం సర్పంచుదేనా?**

పంచాయతీ ఖాతాలో నిధులు లేకపోయినా గ్రామ ప్రజల అవసరాలు మాత్రం ఆగవు. చెత్త పేరుకుపోతే ప్రజలు సర్పంచును అడుగుతారు.వీధిదీపం వెలగకపోతే సర్పంచునే నిలదీస్తారు. డ్రైనేజీ సమస్య వచ్చినా సమాధానం చెప్పాల్సింది సర్పంచే.అయితే బాధ్యత సర్పంచుదైతే.. ఆ బాధ్యత నిర్వహించేందుకు అవసరమైన నిధులు, అధికారాలు ఎవరి బాధ్యత?ఈ ప్రశ్నకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని సర్పంచుల సంఘం కోరుతోంది.

**చెక్‌పవర్ వివాదానికి తెరదించాలి.!**

సర్పంచులు, ఉపసర్పంచుల మధ్య చెక్‌పవర్‌కు సంబంధించిన సమస్యలు గ్రామ పాలనపై ప్రభావం చూపుతున్నాయని జేఏసీ ఆరోపిస్తోంది. గ్రామాల్లో విభేదాలకు తావులేకుండా పాలన సజావుగా సాగేందుకు ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు, అధికారాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతోంది.అధికారాలపై అయోమయం ఉంటే.. అభివృద్ధి ఎలా ముందుకు సాగుతుంది?

**అరెస్టులు కాదు.. చర్చలు కావాలి.!**

ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి గొంతును అణచివేయడం కంటే.. ఆ గొంతు వెనుక ఉన్న సమస్యను వినడం ప్రజాస్వామ్యానికి బలమని సర్పంచుల సంఘం నేతలు అంటున్నారు.రవినాయక్ అరెస్ట్‌పై జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.."మా సమస్యలు వినండి.. మా బిల్లులు విడుదల చేయండి..పంచాయతీలకు నిధులు ఇవ్వండి.. అరెస్టులతో సమస్య పరిష్కారం కాదు" అని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**ఇది ఒక రవినాయక్ సమస్య కాదు.. పల్లెల ప్రశ్న.?**

ఒక నాయకుడి అరెస్ట్‌తో ఈ అంశాన్ని ముగించలేమని జేఏసీ నేతలు చెబుతున్నారు. ఇది వ్యక్తిగత సమస్య కాదని, రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి, సర్పంచుల సమస్యలు, గ్రామ పాలనకు సంబంధించిన విస్తృత అంశమని వారు పేర్కొంటున్నారు.

**సర్పంచులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి**

.బిల్లులపై స్పష్టమైన గడువు ప్రకటించగలదా?
పంచాయతీల నిధులపై స్పష్టత ఇవ్వగలదా?చెక్‌పవర్ వివాదానికి పరిష్కారం చూపగలదా?సర్పంచులతో నేరుగా చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తుందా?

**ప్రభుత్వం ముందున్న రెండు మార్గాలు.!**

అరెస్టులతో ఆందోళనను అడ్డుకోవడమా?
లేక.. సర్పంచులతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపడమా?

గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులే సర్పంచులు. వారి ఆర్థిక, పరిపాలనా సమస్యలు పరిష్కరించబడితేనే పంచాయతీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.అందుకే ఇప్పుడు సర్పంచుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాల్సిన సమయం.అరెస్ట్ చేసిన రవినాయక్ వ్యవహారంపై కూడా పోలీసు, ప్రభుత్వ వర్గాల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. సర్పంచుల ఆరోపణలు, ప్రభుత్వ వివరణ---రెండూ ప్రజలకు తెలియజేయడం ద్వారానే ఈ అంశంపై పూర్తిగా స్పష్టమవుతుంది.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన వోడితల ప్రణవ్..

- ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేస్తామని హామీ





**ప్రజావాణి సెప్టెంబర్ 9** ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పేదవాడి ఆత్మ గౌరవాన్ని నిలబెడుతూ వారికి సొంతింటి కలలు నెరవేరుస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వోడి తల ప్రణవ్ అన్నారు బుధవారం రోజున హుజరాబాద్ మండలం జూపాక గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుని నూతన గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు రాబోయే రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ సుహాసిని కౌన్సిలర్ మండల అధ్యక్షులు కిరణ్ ప్రజాప్రతినిధులు జూపాక గ్రామ నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# "ప్రజా వాణి" వార్తకు స్పందన

- విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తా
- జనగామ బస్సు డిపో మేనేజర్ ఎం.ఉషా



**మద్దూరు సెప్టెంబర్9, ప్రజా వాణి,** విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని జనగామ డిపో మేనేజర్ ఏం. ఉషా అన్నారు.బుదవారం మండలంలోని లద్నూరు గ్రామంలో జనగామలో విద్యను అభ్యసిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం లద్నూరు నుండి నేరుగా జనగామకు కల్పించాలని రెండు గంటలు రోడ్డుపై ధర్నా అనే వార్త ప్రజా వాణి దినపత్రికలో ప్రచురితం అయిన వార్తకు స్పందించారు. బస్సు వేళలలో ఎటువంటి మార్పులు చేయలేదు అర్ టి సి సిబ్బందిని అడిగి తెలుసుకొని సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు.

# బెక్కల్ లో "కపిశ్వర ట్రాక్టర్ షోరూం" ఆధ్వర్యంలో ఉచిత సర్వీస్ క్యాంప్ విజయవంతం

- గ్రామ సర్పంచ్ నలగొప్పుల రేణుక రాములుకు సన్మానం
- ఎల్లవేళల ట్రాక్టర్ యజమాను లకు ఉచిత సర్వీస్ క్యాంప్
- చేర్యాల కపీశ్వర పవర్ ట్రాక్ ట్రాక్టర్ షోరూం డీలర్స్ సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి





**మద్దూరు సెప్టెంబర్9, ప్రజా వాణి,**మండలంలోని బెక్కల్ గ్రామంలో బుదవారం చేర్యాల కపీశ్వర పవర్ ట్రాక్ షోరూమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సర్వీస్ క్యాంప్ విజయవంతం అయినట్లు పవర్ ట్రాక్ షోరూమ్ డీలర్లు ఎల్. సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు ఒక ప్రకటనలో విలేఖర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెక్కల్ గ్రామ పరిధిలోని పరిసర గ్రామాల 40 నుండి 50 మంది ట్రాక్టర్ యజమానులు ఈ ఉచిత సర్వీస్ క్యాంప్ లో పాల్గొని తమ ట్రాక్టర్లకు చిన్న చిన్న మరమత్తులతో పాటు ఆయిల్ సర్వీసింగ్, గేర్ ఆయిల్, గ్రీటింగ్, లు చేయించుకొని సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా నెలకు ఒకసారి మండలాల వారిగా చేర్యాల, కొండపాక, నంగునూరు, కొమురవెల్లి మండలాల్లో ఉచిత సర్వీస్ క్యాంప్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బెక్కల్ గ్రామ సర్పంచ్ నలగొప్పుల రేణుక రాములును శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమం లో కపీశ్వర ట్రాక్టర్ షోరూం డీలర్స్ సంతోష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఏ ఎస్ ఎం అరుణ్, టి ఎస్ ఎం రాకేష్, స్పేర్ సర్వీసు సుపర్వైజర్ శ్రావణ్,మహేష్, మెకానిక్ బృందం నరేశ్,నూతన్,శేఖర్, సాయికుమార్,మహేష్, మద్దూరు మండల సెల్స్ ఎగ్జిక్యూటివ్ భాను, ట్రాక్టర్ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

# కెమిస్ట్రీలో విజయ్ కుమార్ కు డాక్టరేట్ ప్రధానం

- యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం పరిశోధకులు అల్లం విజయ్ కుమార్ డాక్టరేట్ సాధించారు



**ప్రజావాణి సెప్టెంబర్ 9** యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో అల్లం విజయ్ కుమార్ డాక్టరేట్ సాధించారు బుధవారం విజయ్ కుమార్ కు డాక్టర్ డిగ్రీ విధానం జరిగినట్లు కాకతీయ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ గారు ఒక ప్రకటనలో తెలియజేశారు విజయ్ కుమార్ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన ప్రొఫెసర్ జి బ్రహ్మేశ్వరి పర్యవేక్షణలో సింథటిక్ ఆఫ్ స్మాల్ హైబ్రిడ్ మాలిక్యుల్స్ లాసోన్ ఫర్ లాంటి క్యాన్సర్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్పేర్బ్ ప్రాజెక్టుపై అల్లం విజయ్ కుమార్ పరిశోధనలు చేశారు ప్రఖ్యాత అంతర్జాతీయ జనరల్ స్లో పరిశోధనా పత్రాలు సమర్పించాడు ఈ సందర్భంగా విజయ్ కుమార్ కు డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన ప్రొఫెసర్ రీసెర్చ్ స్కాలర్స్ అభినందనలు తెలియజేశారు హన్మకొండ పరకాల మల్లక్కపేట గ్రామానికి చెందిన విజయ్ కుమార్ చిన్నతనం నుంచి పరిశోధన పట్ల మక్కువతో కష్టపడి డాక్టర్ సాధించారు

# మండల స్థాయి సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష



**దండేపల్లి, సెప్టెంబర్ 9 (సక్రమ ప్రజావాణి):** దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సహాయకులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జలశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, దరఖాస్తుల పరిశీలన, చేయూత పింఛన్లకు సంబంధించిన దరఖాస్తుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా సమస్యలపై కూడా చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మహాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్కి వెంకటాపూర్ సొసైటీ చైర్మన్ ముత్యాల శ్రీనివాస్, ఎంపీడీవో జేడీ ప్రసాద్, తహసీల్దార్ దేశ్‌పాండే, ఎంపీవో ప్రసాద్, సీనియర్ సహాయకుడు నక్క అరుణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

# ధర్మారావుపేటలో పోషణ్ మాసం ఉత్సవాలకు శ్రీకారరం



**దండే పెల్లి మండల్ , సెప్టెంబర్ 9 (సక్రమ ప్రజావాణి):** తెలంగాణ రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ్ మాసం ఉత్సవాలు బుధవారం ధర్మారావుపేటలో ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 'మన అంగన్‌వాడీ--మన బాధ్యత' అనే ప్రధాన నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ రకాల పోషకాహార పదార్థాలను ప్రదర్శించి, సమతుల్య ఆహారం, ప్రోటీన్ ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించారు. ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, వేరుశెనగలు, వివిధ రకాల గింజలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే వేడి భోజనం, ఇంటికి తీసుకెళ్లే పోషకాహారాన్ని ప్రదర్శించారు. చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడే ఆట వస్తువులు, బోధనా సామగ్రిని ప్రదర్శించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మమత, సర్పంచ్ కొత్త ధర్మయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్నకుమారి, విజయ, గంధం భాగ్య, మన్నే సువర్ణ, శ్యామల, సరిత, ఆయా భాగ్యలక్ష్మి, తల్లులు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**పరకాల ప్రజావాణి నవీన్ బ్యూరో ధర్మారం:** విద్యుత్ శాఖ ధర్మారం విభాగంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ప్రసాద్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి మిత్రులు ముందుకొచ్చారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి తమ వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తాము అందించిన సహాయం కుటుంబానికి కొంతమేర ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారం సర్పంచ్ భాషిక ఎల్లాస్వామి యాదవ్, ఉపసర్పంచ్ పల్లె వెంకన్న గౌడ్, మామిండ్ల కుమారస్వామి, దూలం వెంకటేష్ గౌడ్, గుర్రం రమేష్, పిల్లల సుమంత్, బోయిని మల్లేష్, ఇంటి మహేందర్ రెడ్డి, యాదండ్ల ప్రశాంత్, ఆకుల శ్రీనివాస్, గడల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు.

- మహిళా ఉద్యోగులు ఉన్న అసెంబ్లీలో చొక్కాలు విప్పుకుని అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి..




**కోదాడ, సెప్టెంబర్ 9/ ప్రజావాణి** తెలంగాణ అసెంబ్లీలో చోటు చేసుకున్న పరిణామాలపై మహిళా ఎమ్మెల్యేలు తెలంగాణ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి సహచర మహిళా ఎమ్మెల్యేలతో కలిసి మహిళా కమిషన్‌ను కలిసి ఫిర్యాదు సమర్పించారుఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి దేవాలయంగా భావించే అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు తీవ్రంగా బాధించిందని అన్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, మహిళా ప్రజాప్రతినిధులు ఉన్న ప్రదేశంలో చొక్కాలు విప్పుకుని బహిరంగంగా నిరసన వ్యక్తం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, ఇది అత్యంత సిగ్గుచేటైన ఘటన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదికపై సభ్యులు తమ నిరసనను ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేయాలని, కానీ హద్దులు దాటి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా శాసనసభ స్పీకర్‌ను అసభ్యకరమైన పదజాలంతో దూషించడం మరింత బాధ కలిగించిందని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు. సభకు అధ్యక్షత వహించే స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్క శాసనసభ్యుడిపై ఉందని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు దిగడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. మహిళల గౌరవం, భద్రతకు సంబంధించిన అంశాలను తేలికగా తీసుకోకూడదని, అసెంబ్లీలో జరిగిన ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్‌ను కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సాధికారత, మహిళల గౌరవం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, మహిళలను అవమానించే ఎలాంటి ప్రవర్తననైనా సహించేది లేదని ఎ మ్మెల్యే ఉత్తమ్ పద్మావతి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తో పాటు పలువురు మహిళా ఎమ్మెల్యేలు పాల్గొని, అసెంబ్లీలో చోటుచేసుకున్న ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

# ఏకలవ్య పాఠశాలలో క్వాలిటీ విద్యా అందించాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్
- తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దు.
- ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి.
- పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.









**భద్రాద్రి జిల్లా బ్యూరో మన ప్రజావాణి (09 సెప్టెంబర్ 26):** టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, ప్రయోగశాలలు, భోజనం, పరిశుభ్రత, యూనిఫాంలు, వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. 8, 9, 10వ తరగతుల గదులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, స్కాలర్‌షిప్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కోసం విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఆర్ట్ అండ్ డ్రాయింగ్ తరగతిని పరిశీలించి, బోధిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. 8వ తరగతి లైబ్రరీ పీరియడ్‌కు బదులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి సమయాన్ని పూర్తిగా విద్యాబోధనకే కేటాయించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాల్లో నిమగ్నం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామసభ, విద్యార్థి పార్లమెంట్, బ్యాంకు ఖాతాల ప్రారంభం, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్‌ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకు పరిమితం చేయకుండా ప్రయోగాత్మకంగా నేర్పడం ఎంతో ముఖ్యమని, ప్రతి విద్యార్థి ప్రయోగాల్లో స్వయంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రయోగశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ఆసక్తి పెంపొందించేలా బోధన సాగాలని అన్నారు. కొత్తగా చేరిన కొంతమంది విద్యార్థులకు యూనిఫాంలు ఇంకా అందలేదని ప్రిన్సిపల్ వివరించడంతో, అర్హులైన విద్యార్థులందరికీ యూనిఫాంలు త్వరగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

భోజనశాల, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంట సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న ఆహారం వివరాలను తెలుసుకున్నారు. ప్రధాన వంట మనిషి అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలియడంతో, విద్యార్థులకు భోజనంలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ వంట మనిషిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లోని కూరగాయలు, రిఫ్రిజిరేటర్‌లోని పాలు, పెరుగు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. మందుల నిల్వ, వినియోగానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విద్యాబోధన, ప్రయోగాత్మక విద్య, ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యం, హాజరు తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తమ బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ తో పాటు తాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిది హిట్లర్ తరహా నియంతృత్వ పాలన

- ముఖ్యమంత్రిని తక్షణమే భర్తరఫ్ చేయాలి..
- అడుగడుగున ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారనే భయంతోనే బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులను సభ ల నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం.
- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీ ఎండగడుతూనే ఉంటుంది.
- కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్..



**కోదాడ, సెప్టెంబర్ 9/ ప్రజావాణి** పట్టణంలోని మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రజా సమస్యలపై (రైతులు, విద్యార్థులు, పారిశుద్ధ్యం తదితర అంశాలు) చేపట్టిన నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసిన కోదాడ నియోజకవర్గ ప్రజలకు, పత్రికా విలేకరులకు, బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న తీరును ఎండగడుతూ ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం హోదాలో అసెంబ్లీలో ప్రజా సమస్యలపై నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడి చావును కోరుకునే స్థాయికి దిగజారారు. అసెంబ్లీ మొదటి రోజు ప్రతిపక్ష సభ్యులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి లాంటి సీనియర్ మహిళా శాసనసభ్యులపై అమానుషంగా ప్రవర్తించారు. కౌరవ సభను తలపించేలా, దుశ్శాసన పర్వాన్ని గుర్తుకు తెచ్చేలా దాడి జరిగినా ముఖ్యమంత్రి కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం దారుణం. అసెంబ్లీ రెండో రోజున, ముఖ్యమంత్రే స్వయంగా కాంగ్రెస్ సభ్యులను రెచ్చగొట్టి, తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఫామ్ హౌస్ పైకి దాడికి ఉసిగొల్పారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు పోలీసు ఎస్కార్ట్ ఇచ్చి మరీ దాడులకు పంపించడం రాష్ట్రంలో నెలకొన్న దౌర్భాగ్య పరిస్థితికి అద్దం పడుతోంది. మూడో రోజున ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష సభ్యులు నిలదీస్తుంటే, సమాధానం చెప్పలేక మూకుమ్మడిగా సస్పెండ్ చేశారు. సభకు రాని కేటీఆర్ ,మల్లారెడ్డి లాంటి వారిని కూడా సస్పెండ్ చేయడం వారి అజ్ఞానానికి, నియంతృత్వానికి నిదర్శనం అని, రాష్ట్రంలో ప్రస్తుతం హిట్లర్ తరహా నియంతృత్వ పాలన సాగుతోంది. ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నారు. అసెంబ్లీ గేట్ల వద్దే ప్రతిపక్ష సభ్యుల గొంతులు నొక్కే ప్రయత్నం చేశారు. మహబూబాబాద్‌లో ధర్నా చేస్తున్న ఒక పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును పోలీస్ ఇన్స్పెక్టర్ నొక్కిన ఘటన ఈ ప్రభుత్వ అరాచకాలకు పరాకాష్ట. విద్యార్థులకు స్కాలర్షిప్పులు, ఉద్యోగులకు జీతాలు లేవు. వ్యవసాయ, నిర్మాణ రంగాలు కుదేలయ్యాయి. రైతుల నెత్తిన భారం మోపేలా తీసుకొచ్చిన 22వా జీవో పై, కరెంటు, సాగునీటి సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ఉండేందుకే బీఆర్ఎస్ సభ్యులను గెంటివేశారు. హింసను ప్రేరేపిస్తూ, దాడులను ప్రోత్సహిస్తూ హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. కాబట్టి ఆయన ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు కోల్పోయారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచక పాలనను, అణచివేతను వివరిస్తూ ఇప్పటికే బీఆర్ఎస్ సభ్యులు గవర్నర్ ని కలిసి ఫిర్యాదు చేశారని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, హింసాత్మక ఘటనలకు ఊతం ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తక్షణమే గవర్నర్ భర్తరఫ్ చేయాలని, మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీ బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# ఆర్మూర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

- రెండు వందల మందికి వివిధ రకాల క్యాన్సర్ పరీక్షలు
- ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్‌ను జయించవచ్చు: లయన్ మొహమ్మద్ రఫీయుద్దీన్





**ఆర్మూర్ టౌన్, సెప్టెంబర్ 09(మన సమగ్ర ప్రజావాణి):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం, హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో--అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆర్మూర్ క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన సుమారు 20 మంది వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వివిధ రకాల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో అనుమానాస్పద లక్షణాలు లేదా ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం అధ్యక్షులు లయన్ మొహమ్మద్ రఫీయుద్దీన్ ఎం.జె.ఎఫ్. మాట్లాడుతూ, ఆర్మూర్ ప్రాంత ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిని ముందస్తుగా గుర్తించే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలను వారి వద్దకే తీసుకురావడం లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మంచి కార్యక్రమానికి సహకరించిన బసవతారకం ఇండో--అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి.డి.జి. లయన్ పి. బసవేశ్వరరావు, ఆర్.సి. ఘనాసాగర్, జెడ్.సి. లయన్ మోహన్‌దాస్ పాల్గొన్నారు. కార్యక్రమ చైర్మన్ లయన్ సుధీర్ బాబు, సహ చైర్మన్ లయన్ సామల లక్ష్మీనారాయణ, కార్యదర్శి లయన్ అంబాల తిరుపతి, జి.ఎం. గంగారెడ్డి, లయన్ గంగాధర్, లయన్ చిన్న రవికుమార్‌తో పాటు పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన లయన్స్ క్లబ్ సభ్యులందరికీ అధ్యక్షులు లయన్ మొహమ్మద్ రఫీయుద్దీన్ ఎం.జె.ఎఫ్. ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా కవి కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం

- ఆదర్శ పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు




**బెజ్జంకి, సెప్టెంబర్ 9 (ప్రజావాణి):** సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని ఆదర్శ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శిరీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కవితలు, పద్యాలు, ప్రసంగాలు, పాటలు ఆలపిస్తూ తెలంగాణ భాష గొప్పతనాన్ని చాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. మాతృభాష కేవలం మాట్లాడే భాష మాత్రమే కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలకు ప్రతీక అని,మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ భాష గొప్పతనాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని, భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు,,,

**కోదాడ, సెప్టెంబర్ 9/ ప్రజావాణి :**కోదాడ పట్టణంలో రాత్రివేళ తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కోదాడ పట్టణ పోలీసులు,,,
జిల్లా సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.60 లక్షల విలువైన 37.2 తులాల బంగారు ఆభరణాలు, 470 గ్రాముల వెండి, రూ.3.60 లక్షల నగదు, హోండా అమేజ్ కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కె. నరసింహ, నిందితుడి అరెస్ట్, కేసుల దర్యాప్తు వివరాలను వెల్లడించారు.

**కారు డ్రైవర్‌గా పనిచేస్తూ దొంగతనాలు..**
నిందితుడిని పట్నం శెట్టి రాజు అలియాస్ రాజిరెడ్డి (41)గా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీలో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో 2009లో ఖమ్మంలో సైకిల్ దొంగతనం చేసి జైలుకు వెళ్లిన నిందితుడు, అనంతరం 2015, 2016 సంవత్సరాల్లో జగద్గిరిగుట్ట పరిధిలో ఐదు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి పోలీసులకు చిక్కినట్లు వెల్లడించారు.

**తాళం వేసిన ఇళ్లే లక్ష్యం..**
నిందితుడు ప్రయాణికులను హైదరాబాద్ నుంచి కోదాడకు కారులో తీసుకొచ్చి, రాత్రి సమయంలో కోదాడలోనే ఉండేవాడు. తన కారును నిర్మానుష్య ప్రాంతంలో పార్క్ చేసి, నడుచుకుంటూ పట్టణంలో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించేవాడు. అనంతరం స్క్రూడ్రైవర్‌తో ఇంటి ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలు, నగదును అపహరించేవాడు. దొంగిలించిన ఆభరణాల్లో కొన్నింటిని విక్రయించడం, మరికొన్నింటిని కరిగించడం, ఇంకొన్నింటిని ఫైనాన్స్ సంస్థల్లో కుదవ పెట్టడం ద్వారా వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలు, అప్పుల చెల్లింపులకు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు.

**నకిలీ నంబర్‌తో పోలీసులకు చిక్కకుండా**
నిందితుడు తన హోండా అమేజ్ కారు అసలు రిజిస్ట్రేషన్ నంబర్



AP 28 BY 7770కు బదులుగా TS 07 GC 1612 అనే నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులకు అనుమానం రాకుండా ఈ విధంగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడేవాడని వెల్లడించారు.

**2021 నుంచి 10 దొంగతనాలు..**
కోదాడ పట్టణంలో 2021 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు నిందితుడు మొత్తం 10 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో 2026 సంవత్సరంలోనే ఏడు ఇళ్లలో దొంగతనాలు చేసినట్లు తెలిపారు.

**పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ నిందితుడు**
విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో నిందితుడు దొంగిలించిన బంగారు ఆభరణాలను విజయవాడకు తీసుకెళ్లి విక్రయించేందుకు కారులో వెళ్తుండగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సూర్యాపేట నుంచి కోదాడ పట్టణంలోని ఫ్లైఓవర్ మీదుగా హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్దకు చేరుకున్న సమయంలో పోలీసులను గమనించిన నిందితుడు వాహనాన్ని వెనక్కి తీసుకుని తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని తనిఖీ చేయగా డిక్కీలోని కవర్లలో బంగారం, వెండి ఆభరణాలు, నగదు లభించాయి.అదేవిధంగా స్క్రూడ్రైవర్లు, షూ సాక్స్‌లు కూడా లభించడంతో పోలీసులు నిందితుడిని విచారించగా కోదాడ పట్టణంలో తాను చేసిన దొంగతనాలను అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి హోండా అమేజ్



కారు, వివో వై31 5జీ మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు..**
కేసుల దర్యాప్తును పర్యవేక్షించిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, నిందితుడి అరెస్ట్‌లో కీలకంగా పనిచేసిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, కోదాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, సీసీఎస్ ఎస్‌ఐలు హరికృష్ణ, సాయిరాం, ఎస్‌ఐ అజయ్‌కుమార్, సిబ్బంది వెంకన్న, విద్యాసాగర్, మల్లేష్, సతీష్, శివ, ప్రభాకర్, మంజులను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ,,**
నేరాలకు పాల్పడిన వారు ఎప్పటికైనా చట్టానికి చిక్కక తప్పదని ఎస్పీ నరసింహ తెలిపారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, కాలనీల ప్రధాన మార్గాల్లోనూ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.ఎక్కువ రోజులు ఇంటికి తాళం వేసి వెళ్లే వారు విలువైన వస్తువులు, నగదును ఇంట్లో ఉంచకూడదని సూచించారు. ఇరుగు పొరుగు వారికి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ దొంగతనాల నివారణలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం నిరంతరం నిఘా కొనసాగిస్తూ నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సూధనపల్లి ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**దోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి ,సెప్టెంబర్ 9,ప్రజావాణి:**కురవి మండలం సూధనపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరావత్ వెంకన్న అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సాహిత్యానికి కాళోజీ నారాయణరావు చేసిన సేవలను వక్తలు గుర్తుచేశారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు పద్య పఠనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్ కుమార్, ఎం.డి. అంజద్ పాషా, గాండ్ల బాలరాజు, బి. సరోజ, వి. శుభ, కే. సారంగం, ఏ. ప్రగతి, ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ రేఖ మాధవి, ఆయా నీలం వాసవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమశెట్టి ధనమ్మ, కమిటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సవాల్ ను స్వీకరించే దమ్ముందా కౌశిక్ రెడ్డి



**ప్రజావాణి సెప్టెంబర్ 9** నియోజకవర్గం 1000 రోజుల కాంగ్రెస్ ప్రజా పాలనలో హుజురాబాద్ ఇన్చార్జిగా మేము ఏం చేశామో ఎమ్మెల్సీ వీప్ ఎమ్మెల్యేగా నువ్వేం చేసావో ప్రజల ముందుకు వెళ్లి తేల్చుకుందాం.... రాజీనామా చేసి రా పెద్ద వారి గురించి మాట్లాడితే పెద్దవాడిని అయిపోతానని అనుకోకు స్థాయి తెలుసుకొని మాట్లాడు కౌశిక్ రెడ్డి కి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన ప్రణయ్ బాబు

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

- తెలంగాణ యాసలో ప్రజల గొంతుకగా కాళోజీ
- ప్రిన్సిపాల్ పురం భూపాల్ రెడ్డి,
- డైరెక్టర్ ఆవుల శ్రీనివాస్,
- వైస్ ప్రిన్సిపాల్ ప్రీతీ రెడ్డి



**దోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 9 ప్రజావాణి :**మహబూబాబాద్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పురం భూపాల్ రెడ్డి, డైరెక్టర్ ఆవుల శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రీతీ రెడ్డి మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావును ప్రజలందరూ "ప్రజాకవి"గా పిలుస్తారని అన్నారు. తెలంగాణ యాసలో రచనలు చేస్తూ ప్రజల సమస్యలకు, ఆకాంక్షలకు తన సాహిత్యం ద్వారా గొంతుకగా నిలిచారని తెలిపారు. పుట్టుక, చావులను మినహాయించి తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేసిన మహనీయుడు, వైతాళికుడు కాళోజీ అని పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావు కర్ణాటకలో జన్మించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని విద్యార్థులకు వివరించారు. సాహిత్య, సామాజిక రంగాల్లో ఆయన చేసిన విశేష సేవలను గుర్తించిన ప్రభుత్వం 1992లో పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించిందని తెలిపారువిద్యార్థులు కాళోజీ సాహిత్యాన్ని, తెలంగాణ భాషా వైభవాన్ని తెలుసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానించడమే:

- దాసరి మనోహర్ రెడ్డి

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 9:**అసెంబ్లీ వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి అన్నారు.బుధవారం పెద్దపల్లిలోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం వివిధ అంశాలను తెరపైకి తీసుకువస్తోందని విమర్శించారు.
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో భాగమని పేర్కొన్నారు.



అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని, భౌతికంగా దాడి చేశారని ఆయన ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారని పేర్కొంటూ ఈ ఘటనలను తీవ్రంగా ఖండించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు తమ నియోజకవర్గ ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించే హక్కు ఉందని, ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.కేసీఆర్‌ను ఉద్దేశించి కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు, ఆయనకు హాని కలగాలని కోరుతూ చేసిన నినాదాలు అత్యంత హేయమైనవని దాసరి మనోహర్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన కేసీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానించడమేనని అన్నారు.
ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యలు వంటి ప్రధాన అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వివాదాస్పద ఘటనలను తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ప్రజల దృష్టిని ఎంతకాలం మళ్లించినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన పనులను ప్రజలు మర్చిపోరని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలను పక్కనపెట్టి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలకు తగిన గౌరవం ఇవ్వాలని దాసరి మనోహర్ రెడ్డి కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

# ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యం రగిలించిన కాళోజీ కృషి మరువలేనిది

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 9:**ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకురావడంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు చేసిన కృషి చిరస్మరణీయమని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందించిన వ్యక్తిత్వం కాళోజీ నారాయణరావుదని అన్నారు. సత్యాగ్రహ మహోద్యమంలో పాల్గొని చిన్న వయసులోనే జైలు జీవితం అనుభవించారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప ఉద్యమకారుడని కొనియాడారు.తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్యం, రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని పేర్కొన్నారు. కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత ఆయన ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నవాబ్‌పేట్ సత్యం ట్రెడిషనల్ ఆశ్రమంలో క్రియా యోగా--బ్రహ్మవిద్యపై కీలక కార్యక్రమం

- విద్యా విధానంలో బ్రహ్మవిద్య--యోగకు సముచిత స్థానం కల్పించాలి
- కేజీ నుంచి పీజీ వరకు యోగను పాఠ్యాంశంగా చేర్చాలి: క్రియా యోగా గురూజీ జ్ఞానానందగిరి మహారాజ్

**ప్రజావాణి ఖానాపూర్ నియోజకవర్గం:**నవాబ్‌పేట్:విద్యార్థుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి యోగ, బ్రహ్మవిద్య, జ్ఞాన విద్యలు ఎంతో దోహదపడతాయని, కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు యోగ విద్యను పాఠ్యాంశంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని బ్రహ్మజ్ఞానభారత్ సంస్థాపక సంకల్పాచార్య పూజ్య శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్ అన్నారు.విద్యా విధానంలో యోగను కేవల శారీరక వ్యాయామంగా కాకుండా ఆరోగ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే విద్యగా గుర్తించాలని ఆయన సూచించారు.
కేజీ నుంచి పీజీ వరకు యోగ విద్యను పాఠ్య ప్రణాళికలో భాగంగా ప్రవేశపెట్టి, 20 మార్కుల పాఠ్యాంశంగా చేర్చడంతో పాటు, గుర్తింపు పొందిన క్రియా యోగా గురువులకు విద్యా సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది తన ప్రధాన సంకల్పాలలో ఒకటని శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్ తెలిపారు.

**సత్యం ట్రెడిషనల్ ఆశ్రమంలో ఘన స్వాగతం**



ఈ సంకల్పంలో భాగంగా నవాబ్‌పేట్ గ్రామంలోని సత్యం ట్రెడిషనల్ ఆశ్రమాన్ని శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్ సందర్శించారు. ఆశ్రమ వ్యవస్థాపకులు గురూజీ డాక్టర్ సత్యం స్వామీజీ ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్‌తో పాటు ప్రముఖ సినీ ఫైట్ మాస్టర్స్ రామ్--లక్ష్మణ్ గార్లను మంగళహారతులతో, పుష్పమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.
అనంతరం ఆశ్రమంలో కొనసాగుతున్న క్రియా యోగా సాధన, సహజ జీవన విధానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల గురించి డాక్టర్ సత్యం స్వామీజీ వివరించారు.
శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్, రామ్--లక్ష్మణ్ గార్లు ఆశ్రమంలో క్రియా యోగా సాధనలో పాల్గొని ప్రశాంతమైన అనుభూతిని పొందారు. అనంతరం వారు ఆశ్రమంలో ఒక రాత్రి బస చేశారు.
ఆశ్రమంలో సహజసిద్ధంగా పండించిన పండ్లను స్వీకరించడంతో పాటు సహజ ఆహారంతో కూడిన భోజనం చేశారు.

**కడం ప్రాజెక్ట్ ప్రాంత సందర్శన**
తదుపరి గురూజీ డాక్టర్ సత్యం స్వామీజీ, శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్, రామ్--లక్ష్మణ్ గార్లకు సమీపంలోని కడం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని చూపించారు. ప్రాజెక్ట్ ప్రత్యేకతలు, పరిసర ప్రాంతంలోని ప్రకృతి అందాలను వారికి వివరించారు.

**ఆశ్రమ సేవలను అభినందించిన జ్ఞానానందగిరి మహారాజ్**
క్రియా యోగా, సహజ జీవన విధానం, ఆధ్యాత్మిక సాధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు గురూజీ డాక్టర్ సత్యం స్వామీజీ చేస్తున్న కృషిని శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్ ఈ సందర్భంగా అభినందించారు.
విద్యా రంగంలో యోగ--బ్రహ్మవిద్యను విస్తృతంగా తీసుకెళ్లేందుకు విద్యావేత్తలు, క్రియా యోగా గురువులు, విద్యా సంస్థలు, సామాజిక సేవా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.
"యోగ ప్రతి విద్యార్థికి -- జ్ఞానం ప్రతి ఇంటికి -- బ్రహ్మవిద్య ప్రతి తరానికి" అనే లక్ష్యంతో విద్యా విధానంలో యోగకు సముచిత స్థానం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శ్రీ జ్ఞానానందగిరి మహారాజ్ కోరారు.ఈ కార్యక్రమంలో సత్యం ట్రెడిషనల్ ఆశ్రమం ట్రెజరర్ మేడి చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త జష్ట్ర. రాజేష్ ఛత్రపతి, క్రియా యోగా భక్తులు, యువత, ఆశ్రమ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు కేటాయించాలి.

- గృహనిర్మాణ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలి.



**హుజూర్ నగర్ సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరి రామస్వామి గుట్టవద్ద గత ప్రభుత్వ హాయంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు పొజిషన్ ఇచ్చి గృహనిర్మాణ పథకం ద్వారా రూ 5 లక్షల నిధుల కేటాయింపు చేయాలని కోరుతూ తహసిల్దార్ బండా కవిత, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ కమిషనర్ కే సతీష్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎటువంటి జీత భత్యాలు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలుస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# దండేపల్లి మండలం వెలుగనూర్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం

**మంచిర్యాల జిల్లా ప్రజావాణి తేదీ. 9/9/2026**దండేపల్లి మండలం వెలుగనూర్ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం బుధవారం ఘనం గా జరుపుకున్నారు.. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న మాట్లాడుతూ తెలంగాణ భాష గొప్పతనాన్ని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు..



# రాజ్‌భవన్ ముట్టడి కేసులో కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కుంభం...



**సెప్టెంబర్ 09 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ లతో కలిసి బుధవారం రోజు నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు.కార్యక్రమంలో ఆయన వెంట యాదాద్రి డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకునూరి మహేందర్ , కాంగ్రెస్ యువ నాయకులు ఏడునూతల మహేష్ తదితరులు ఉన్నారు.

# నిర్మల్ జిల్లాలో డీజేల హోరు.. నిబంధనలు గాలికి!

- టెస్టింగ్ పేరుతో చెవులు చిల్లులు పడేలా శబ్దం.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, సెప్టెంబర్ 9:-**వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల హడావుడి మొదలైంది. పండుగ ఏర్పాట్ల పేరుతో పలుచోట్ల టెస్టింగ్ నిర్వహిస్తూ భారీ శబ్దాలు చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని పలు ప్రాంతాల్లో ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా డీజేల మోత వినిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత డెసిబుల్స్ పరిమితికి మించి శబ్దం చేయరాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో శబ్ద కాలుష్యం పెరిగిపోతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ శబ్దాల కారణంగా వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, గర్భిణీలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. చదువుకునే విద్యార్థులకు ఏకాగ్రత దెబ్బతింటోందని, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. ఇళ్లలో ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ వేడుకలపై ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే నిబంధనలకు లోబడి శబ్ద పరిమితిని పాటించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పండుగల పేరుతో ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మండల స్థాయి ఎస్ జి ఎఫ్ ఐ క్రీడల ఎంపికలు





**పెద్దవంగర సెప్టెంబర్ 09 ప్రజావాణి .**మండలంలోని పెద్దవంగర పాఠశాలలో మండల స్థాయి క్రీడలు నిర్వహించడం జరిగినది. ఇందులో అండర్ 14 ఇయర్స్ బాలబాలికలు మరియు అండర్ 17 ఇయర్స్ బాల బాలికలు పాల్గొనడం జరిగింది. ఇందులో స్థానిక పాఠశాల హెచ్‌ఎం బుధారపు శ్రీనివాస్ మరియు ముద్దశాని పారిజాతం సురేష్ మరియు మెహబూబాబాద్ జి ఎఫ్ ఐ ఎస్ జి ఎఫ్ ఐ సెక్రెటరీ శ్రీ ప్రవీణ్ రెడ్డి మరియు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హెడ్మాస్టర్ మాట్లాడుతూ ఇక్కడ సెలెక్ట్ అయిన జోనల్ స్థాయిలో సెలెక్ట్ అయి మరియు జిల్లాస్థాయిలో సెలెక్ట్ అయి రాష్ట్ర స్థాయికి కూడా సెలెక్ట్ కావాలని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ మాట్లాడుతూ విధ్యార్థులు ఆటల్లోనూ మరియు చదువులోనూ రాణించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని. ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

# జిల్లా సొసైటీ సీఈవో, జనరల్ మేనేజర్‌కు బెజ్జంకి సొసైటీ ప్రతినిధుల సన్మానం



**బెజ్జంకిసెప్టెంబర్ 9 (ప్రజావాణి)**కరీంనగర్ జిల్లా సొసైటీ సీఈవో సత్యనారాయణ రావు, జనరల్ మేనేజర్ శ్రీధర్‌లను బెజ్జంకి సొసైటీ చైర్మన్ ఒగ్గు దామోదర్, డైరెక్టర్ బైర సంతోష్, నాయకులు ఒంటెల సంపత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఈవో సత్యనారాయణ రావు, జనరల్ మేనేజర్ శ్రీధర్‌లను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం సొసైటీ అభివృద్ధి, రైతులకు అందుతున్న సేవలు తదితర అంశాలపై చర్చించారు.

# పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- పిఎసిఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్



**బెజ్జంకి, సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దాచారం గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మంజూరైన ఇంటి నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులైన దొగ్గల రమ, అంతగిరి కుటుంబానికి ఇంటి ప్రధాన ద్వారాన్ని బెజ్జంకి సొసైటీ చైర్మన్ ఒగ్గు దామోదర్, దాచారం సర్పంచ్ బైరి మానస రాజేందర్ కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాచారం ఉప సర్పంచ్ దీటి బాల నర్సు, వార్డు సభ్యులు గదాగోని అశోక్, బోడిగే రాంచంద్రం, కానుకయ్య, రాజేశం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్...

- పోరుబాటకు సిద్ధ మవుతున్న ఉద్యోగులు.
- ఎల్బీ స్టేడియంలో మహా ధర్నా..!
- 6 డీఏలు పెండింగ్‌లో..
- పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి
- బకాయిలు క్లియర్ కావాలంటే..!
- 10న ఎల్బీ స్టేడియంలో సభను విజయవంతం చేయాలి.
- ఉద్యోగులకు పిలుపు నిచ్చిన జెఏసి చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి.

**సెప్టెంబర్ 09 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని సమర్థ వంతంగా నడిపిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చే కీలక శక్తులు ఉద్యోగులు. అయితే , ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు , దక్కాల్సిన న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యోగ వర్గాలు నేడు పోరు బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తమ నాలుగు ప్రధాన డిమాండ్ల సాధన కోసం దశలవారీ ఉద్యమ కార్యా చరణను ప్రకటించింది.

ఇందులో భాగంగా తొలి అడుగుగా ఆగస్టు 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ఉద్యోగులు భారీ ఎత్తున మహాధర్నాలు నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం , సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో సెప్టెంబర్ 1న 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా మరోసారి కలెక్టరేట్ల ఎదుట జెఏసి ఉద్యోగులు , ఉపాధ్యా యులు ధర్నాలకు దిగారు. ఈ ఉద్యమ పరంపరలో అత్యంత కీలక ఘట్టంగా సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ మహా ధర్నాకు జేఏసీ పిలుపు నిచ్చింది.



**6 డీఏలు పెండింగ్‌లోనే ఉన్నాయి...**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగు , ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం వాయిదాలు వరుసగా పేరుకుపోయి ప్రస్తుతం దాదాపు 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డీఏలు సకాలంలో విడుదల కాక పోవడంతో , ఉద్యోగం , ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన నిత్యావసర ధరలు , ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, పీఆర్సీ ఆలస్యం కారణం గా క్యాడర్‌ను బట్టి సగటున ఒక్కో ఉద్యోగి నెలకు రూ. 10,000 నుండి రూ. 25,000 వరకు నష్టపోతున్నారు. ఈ సుదీర్ఘ నిరీక్షణ వల్ల మొత్తంగా ప్రతి ఉద్యోగికి ఇప్పటివరకు దాదాపు 3 లక్షల నుంచి 5 లక్షల రూపాయలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ జాప్యం వారి కుటుంబ ఆర్థిక ప్రణాళికలను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

**పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి...**

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగుల చిరకాల ఆకాంక్ష అయిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి , పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రిస్తామని స్పష్టమైన వాగ్దానం చేసింది. అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడిచినా ఆ కీలక హామీ నేటికీ అమలుకు నోచుకోకపోవడం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది ఉద్యోగులు ,ఉపాధ్యా యులలో తీవ్ర నిరాశను , అభద్రతాభావాన్ని కలిగి స్తోంది.ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవితాన్ని , సామాజిక భద్రతను అందించే ఏకైక మార్గం పాత పెన్షన్ విధాన మే. ఉద్యోగుల సేవలను గుర్తించి , ఎన్ని కల వేళ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలం గా స్పందించాలి. సీపీఎస్ ను తక్షణమే రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధ రించడం ద్వారా ఉద్యోగ వర్గాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

**బకాయిలు క్లియర్ కావాలంటే..!**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,రిటైర్డ్ సిబ్బందికి సంబంధించి జీపీఎఫ్,సరెండర్ లీవులు , మెడికల్ రీయింబర్స్‌మెంట్ , గ్రాట్యుటీ తదితర రూపాల్లో దాదాపు రూ. 10,000 కోట్ల నుంచి రూ. 16,000 కోట్ల మేర బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం నెలకు సుమారు రూ. 700 కోట్ల నుండి రూ. 2000 కోట్ల చొప్పున గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తోంది. అయితే , ఉద్యోగ విరమణ చేసిన వారికి తక్షణ ఆర్థిక ఉపశమనం లభించాలన్నా , పేరుకు పోయిన మొత్తం బకాయిలు త్వరితగతిన పూర్తిగా క్లియర్ కావాలన్నా ప్రభుత్వం నెలకు కనీసం రూ. 3000 కోట్ల నుంచి రూ. 4,000 కోట్ల నిధులను కేటాయించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఉద్యోగుల సమస్యలు శాశ్వతంగా పరిష్కార మవుతాయి.

**పాలకులు తక్షణమే స్పందించాలి...**

ఉద్యోగులు , ఉపాధ్యా యుల న్యాయమైన హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న ఎల్బీ స్టేడియంలో జేఏసీ తల పెట్టిన ఈ మహాధర్నా ప్రభుత్వానికి ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటిది. ప్రభుత్వ పాలనను ముందుకు నడిపించే ఉద్యోగుల సమస్యలను ఇకపై ఉపేక్షించడం సరికాదు. కొత్త పీఆర్సీ అమలు , పెండింగ్ డీఏలు , బిల్లుల తక్షణ విడుదల , సీపీఎస్ రద్దు వంటి నాలుగు ప్రధాన డిమాండ్ల పై పాలకులు కాలయాపన చేయకుండా తక్షణమే స్పందించాలి. ఉద్యోగు లతో గౌరవప్రదమైన చర్చలు జరిపి , ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చినప్పుడే ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అభద్రతా భావం తొలగి పోతుంది. ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకొని సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తుందని ఆశిద్దాం. లేని పక్షంలో ఈ ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చడం ఖాయం.

# పాఠశాలలకు ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్...

- వరుసగా 3 రోజులు సెలవులు.
- పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి..!

**సెప్టెంబర్ 09 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి**

తెలుగు రాష్ట్రాలలోని విద్యాసంస్థలు , ప్రభుత్వ కార్యాలయాలకు ఈ వారాంతంలో వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి. వినాయక చవితి పండుగ సందర్భం గా ఈ ప్రత్యేక సెలవులు లభిస్తుందడంతో విద్యార్థులు ఉపాధ్యాయు లు మరియు ప్రభుత్వ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 12 రెండవ శనివారం-ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు ప్రభుత్వ కార్యాలయాలకు సాధారణ రెండో శనివారం సెలవు.




సెప్టెంబర్ 13 ఆదివారం కామన్ సెలవు దినం. సెప్టెంబర్ 14 సోమవారం రోజు వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రభుత్వం అధికారిక జనరల్ హాలిడే ప్రకటించింది. వరుసగా మూడు రోజుల పాటు సుదీర్ఘమైన వీకెండ్ రావడంతో సొంత ఊర్లకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకునేందుకు అనేకమంది ప్రణాళికలు వేసుకుంటున్నారు.. దీంతో బస్టాండ్లు , రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. మరోవైపు , గ్రామాలలో , పట్టణాలలో పండుగ వాతావరణం సంతరించు కుంటుంది. వీధుల్లో వినాయక మండపాల ఏర్పాట్లు , డెకరేషన్ పనుల్లో స్థానికులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిగా నిమగ్న మయ్యారు. ఈ పండుగ ముగిసిన తర్వాత విగ్రహాల నిమజ్జనం జరిగే రోజున కూడా ఆయా జిల్లాల స్థానిక పరిస్థితు లను బట్టి వేరువేరుగా స్థానిక సెలవులు వచ్చే అవకాశ ముంటుందని సమాచారం.

# రాష్ట్ర పోటీలకు ఇనుగుర్తి విద్యార్థులు ఎంపిక

- అభినందించిన హెచ్‌ఎం అమ్మ యాకయ్య

**ప్రజావాణి,ఇనుగుర్తి:**రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండల కేంద్రం ఇనుగుర్తి జెడ్ పి హెచ్ ఎస్ కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రం మహబూబాబాద్ లో నిర్వహించిన ట్రయాల్స్ లో ఇనుగుర్తి విద్యార్థులు బొల్లు సహస్ర, బొల్లు రష్మి, మందుల నిఖిల్,బోళ్ల భోగేశ్వర్, గట్టిగొర్ల వర్షిత్ అసాధారణ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 11 నుండి 13 వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తిలక్ స్టేడియం లో నిర్వహించే 11వ సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా నుంచి పాల్గొంటారు.

అభినందించిన హెచ్‌ఎం టీచర్స్ బృందం..

రాష్ట్రస్థాయి పోటీలకు ఇనుగుర్తి హై స్కూల్ విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల హెచ్‌ఎం అమ్మ యాకయ్యతో పాటు టీచర్స్ బృందం క్రీడా విద్యార్థులను అభినందించారు.ఓవైపు



విద్యాభ్యాసం చేస్తూనే క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని కితాబిచ్చారు.రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలలో ప్రతిభ చాటిన వారికి భవిష్యత్తులో ఉన్నతమైన అవకాశాలు లభిస్తాయన్నారు. ఇందుకు కారణమైన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తాళ్ల ప్రణయ్ ను హెచ్‌ఎం టీచర్స్ ప్రశంసించారు. నిరంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తూ, శిక్షణ ఇవ్వడంతోనే ఇది సాధ్యమైందని అభినందించారు.




# ఉద్యోగంతో పాటు చదువులోనూ రాణించిన పంచాయతీ కార్యదర్శి

- గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు.. వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ.. డాక్టర్ పవర్ విజయ్‌కుమార్‌కు అభినందనల వెల్లువ

**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో,భైంసా, సెప్టెంబర్ 9:-**ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే ఉన్నత విద్యను కొనసాగించి డాక్టరేట్ సాధించిన నిర్మల్ జిల్లా భైంసా మండలం దేగాం గ్రామపంచాయతీ కార్యదర్శి పవార్ విజయ్‌కుమార్ అందరికీ ఆదర్శంగా నిలిచారు. విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూనే విద్యపై ఉన్న ఆసక్తిని కొనసాగించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.పవర్ విజయ్‌కుమార్ ప్రస్తుతం దేగాం గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలు, గ్రామపంచాయతీ పరిపాలనలో నిత్య కార్యక్రమాలు ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు పరిశోధనపై దృష్టి సారించి తన లక్ష్యాన్ని సాధించారు. ప్రొఫెసర్ పి. కమలాకర్ పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగంలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. హైదరాబాద్‌లో జరిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో ప్రముఖుల చేతుల మీదుగా పీహెచ్‌డీ డిగ్రీ అందుకోవడం ఆయన విద్యా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలిచింది. ఉద్యోగం చేస్తూనే చదువును



కొనసాగించడం, పరిశోధనను పూర్తి చేయడం అంత సులభమైన విషయం కాదని, అయితే పట్టుదల, క్రమశిక్షణతో విజయ్‌కుమార్ ఈ ఘనత సాధించారని పలువురు ప్రశంసిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శిగా ప్రజలకు సేవలందిస్తూ, విద్యా రంగంలోనూ తన ప్రతిభను చాటుకోవడం అభినందనీయమని పేర్కొంటున్నారు. పవర్ విజయ్‌కుమార్ డాక్టరేట్ సాధించిన సందర్భంగా సర్పంచుల సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, దేగాం గ్రామ ప్రజలు, సహచర ఉద్యోగులు, బంధుమిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే వారికి విజయ్‌కుమార్



స్ఫూర్తిగా నిలిచారని పలువురు కొనియాడారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం.. ప్రభుత్వ ఉద్యోగం సాధించి, గ్రామపంచాయతీ కార్యదర్శిగా ప్రజలకు సేవలందిస్తూ, అదే సమయంలో ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించే స్థాయికి చేరడం యువతకు స్ఫూర్తిదాయకమని గ్రామస్థులు పేర్కొన్నారు. "ఉద్యోగం ఒక బాధ్యత.. విద్య ఒక నిరంతర ప్రయాణం" అనే సందేశాన్ని పవర్ విజయ్‌కుమార్ తన విజయంతో చాటిచెప్పారని పలువురు అభిప్రాయపడ్డారు.

# పాతది బందాయె.. కొత్తది రాదాయె.. రైతు బతుకు ఆగమాయె...!

- రైతు బీమాకు బ్రేక్.. కొత్త పథకానికి లేట్..!
- ఆగస్టు 14తో ముగిసిన 'రైతు బీమా'.. ఎల్ఐసీకి అందని ప్రీమియం నిధులు..!
- నవంబర్ 19 వర కు పాలసీ శూన్యం.
- ఈ మధ్యలో మరణించే రైతు కుటుంబాలకు దిక్కెవరు...!
- మధ్యలో రైతు చనిపోతే.. కుటుంబానికి 5 లక్షలు ఎవరిస్తారు..!




తెలంగాణలో వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచి , అన్నదాత ఆకస్మిక మరణంతో వీధిన పడే కుటుంబాలకు కొండంత ఆర్థిక భరోసా నిచ్చిన 'రైతు బీమా' పథకం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. గత ఎనిమిదేళ్లుగా నిరంతరాయంగా కొన సాగుతూ వచ్చిన ఈ రైతు రక్షణ కవచం ప్రస్తుతానికి నిలిచిపోవడంతో, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు తీవ్ర అయో మయానికి , ఆందోళనకు గురవుతున్నారు.

**ముగిసిన గడువు- నిలిచిన ప్రీమియం...**

రాష్ట్రంలోని 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల పట్టాదారు రైతులందరికీ ప్రభుత్వం వంద శాతం ప్రీమియం చెల్లిస్తూ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తూ వచ్చింది. ప్రతి సంవత్సరం ఆగస్టు 14 నాటికి ప్రభుత్వమే వార్షిక ప్రీమియం మొత్తాన్ని ఎల్ఐసీకి చెల్లించి పాలసీని పునరుద్ధ రించాల్సి ఉంటుంది. అయితే , 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రితో పాత ఒప్పందం గడువు ముగిసి నప్పటికీ , ప్రభుత్వం నుంచి ఎల్ఐసీకి ప్రీమియం నిధులు జమ కాలేదు. దీంతో ఆగస్టు 15 నుండి రైతు బీమా పథకం సాంకేతికంగా నిలిచి పోయినట్లయింది.

**'ఇందిరమ్మ' జాప్యం- నడిమధ్యలో అభద్రత...**

కేవలం భూమి ఉన్న రైతు లకే కాకుండా , ఆహార భద్రతా కార్డులు కలిగిన నిరుపేద కుటుంబా లన్నింటికీ వర్తించేలా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పేరిట సమగ్ర నూతన పథకాన్ని తీసుకువస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అయితే , ఈ కొత్త పథకాన్ని నవంబర్ 19న (ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా) ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. పాత రైతు బీమా కాలపరిమితి ఆగస్టు 14తో ముగియగా , కొత్త పథకం ప్రారంభం కావ డానికి ఇంకా రెండున్నర నెలల సమయం పట్టనుంది. ?మధ్యంతర మరణాలకు పరిహారం దక్కేదెలా..? ఈ రెండు పథకాల మధ్య ఏర్పడిన సుమారు మూడు నెలల విరామ కాలంలో (ఆగస్టు 15 నుంచి నవంబర్ 19 మధ్య) సహజంగా గానీ, ప్రమాదవశాత్తు గానీ మరణించే రైతుల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) ఆగస్టు 14 తర్వాత సంభవించిన మరణాలకు సంబంధించిన క్లెయిమ్ దరఖాస్తులను స్వీకరించేందుకు నిరాక రిస్తున్నట్లు సమాచారం. గతంలో రైతు మరణించిన పది రోజుల్లోనే నామినీ బ్యాంకు ఖాతాలో 5 లక్షల మొత్తం జమయ్యేది. కానీ ప్రస్తుత పరిస్థితిల్లో , దుర దృష్టవశాత్తు కుటుంబ పెద్దను కోల్పోయిన రైతు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాయి.

**ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలి...**

ఆగస్టు 14 నుండి రైతు బీమా పథకం నిలిచి పోయిన మాట వాస్తవ మేనని , ప్రభుత్వం గాని పై అధికారుల నుండి గాని ఈ మధ్యకాలంలో చని పోయిన రైతుల నుండి దరఖాస్తులు తీసుకో వాలని తమకు ఎలాంటి ఉత్తర్వులు గాని అంద లేదు కాబట్టి ప్రస్తుతం తమ వద్దకు వచ్చిన రైతులకు ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చేవరకు వేచి చూడాలని చెప్తున్నాం.

## తెలంగాణ యాస,భాషను కాపాడింది కాళోజి నారాయణ రావు




**నేరేడుచర్ల, ప్రజావాణి (సెప్టెంబర్ )9** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల కు అద్దం పట్టేలా తన కలం ద్వారా ఎన్నో రచనలు రాసి తెలంగాణ భాషను, యాసను కాపాడిన మహనీయుడు కాళోజీ నారాయణ రావు అని నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.నీరజ కొనియాడారు. కాళోజి జయంతిని పురస్కరించుకొని బుధవారం నాడు కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాళోజి ఆంధ్ర మహాసభ, గ్రంథాలయ ఉద్యమం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటాలు ఎన్నో చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కాలోజీ ని అనగదొక్కారని, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఆయన జయంతిని అధికారికంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. సీనియర్ అధ్యాపకులు పి.వెంకటరమణ, డాక్టర్ మద్దిమడుగు సైదులు మాట్లాడుతూ కర్ణాటకలో జన్మించిన కాళోజి రెండు సంవత్సరాల వయసులోనే వారి కుటుంబం తెలంగాణకు రావడం, వరంగల్ లో స్థిరపడడం జరిగిందన్నారు. ఆయన శాసనమండలి సభ్యునిగా పనిచేశారని, పద్మ విభూషన్ పురస్కారం అందుకున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,తెలంగాణ ప్రజల గుండెల్లో ఎల్లప్పుడూ ఉంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ,ప్రణతి, కేల్ న్ రావు, వెంకన్న, శ్రీనివాసులు, సునీత, ప్రసాదు, అంజయ్య, నరసింహ చారి, గణేష్, వీరు, వెన్నెల, అపర్ణ, వీరేష్ సిబ్బంది అన్వేష్,వెంకన్న, దుర్గయ్య, ఖాన్, బేగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం




**మంథని నియోజక వర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రజావాణి:**స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంథనిలో ఐక్యూఏసీ, తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ కర్నాటి కృష్ణ మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలంగాణ భాషకు చేసిన సేవకు గుర్తింపుగా ఆయన జయంతిని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారికంగా జరుపుకుంటున్నామని, ' నా గొడవ ' లాంటి రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లారని, ఉద్యమం ఉవ్వెత్తున సాగుటలో ఈ రచనలు ఎంతో ఉపయోగపడినాయని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు రామకృష్ణగారు మాట్లాడుతూ కాళోజి నారాయణ రావు గారు 'అక్షరం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక ' అని ఎలుగెత్తి చాటి, కత్తి కంటే కలం గొప్పదని తెలంగాణ రాష్ట్రంలో పుట్టి తెలంగాణ భాష మాట్లాడని వారిని తనదైన శైలిలో విమర్శించారని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఎనలేని కృషి చేసినందుకు గుర్తింపుగా భారత ప్రభుత్వం చే పద్మ విభూషణ్ పురస్కారం ద్వారా సన్మానించబడినారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, దుర్గం కృష్ణ, శేఖర్, శ్రీధర్, సందీప్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- వెంకటాపూర్--ఆరెంద రహదా రి విస్తరణ పనులను వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలి
- మంథని మండలంలో పలు పా ఠశాలలు, రహదారి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్





**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 9, ప్రజావాణి:**పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.మంథని మండలంలోని ఖాన్సాయిపేట ఎంపీపీఎస్ పాఠశాల, భట్టుపల్లి ఎంపీపీఎస్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల, మల్లారం ఎంపీపీఎస్ పాఠశాల, ఆరెంద జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, స్వర్ణపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధన, విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిపై సంబంధిత అధికారులను, ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.వెంకటాపూర్ నుంచి ఆరెంద వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రహదారి విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఖాన్సాయిపేట ఎంపీపీఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులు కొత్తగా కల్పించిన సౌకర్యాల ను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని తెలిపారు.

**ప్రతి విద్యార్థికి కనీస విద్యా నైపుణ్యాలు కల్పించాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఉపాధ్యాయులు FLN (Foundational Literacy and Numeracy) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు ఉండేలా బోధన అందించాలని ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై మరింత ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలని తెలిపారు.

**విద్యార్థుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ**

ప్రతి విద్యార్థి ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్నట్లయితే సంబంధిత తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదించి, కారణాలను తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి పాఠశాలలో నెలకోసారి తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులకు వివరించి వారి సహకారం తీసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి చిన్నారి పట్ల మనం చూపించే శ్రద్ధ మన బోధనలోనూ, విద్యార్థుల అభ్యసనలోనూ స్పష్టంగా కనిపించాలి. ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలి సూచించారు.పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఎంపీడీవో శ్రీజ రెడ్డి, ఎం.పి. ఓ.షబ్బీర్ పాషా, ఏఈ పి.ఆర్. జగదీశ్,సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం ఇవ్వాలి

- 11న కలెక్టరేట్ ఎదుట కెవిపిఎస్ ధర్నా

**ప్రజావాణి హన్మకొండ బ్యూరో నవీన్ హనుమకొండ, సెప్టెంబర్ 9:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఏళ్ల తరబడి పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షుడు ఒరుగంటి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి మంద సంపత్ తెలిపారు. పెండింగ్లో ఉన్న పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మూడేళ్లుగా పెండింగ్లో..ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదైన బాధితులకు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో ఆర్థిక సాయం అందించాల్సి ఉన్నప్పటికీ, గత మూడేళ్లుగా అనేక మంది బాధితులకు పరిహారం అందలేదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కులాంతర వివాహితులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక బహుమతులను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులతో పాటు కులాంతర వివాహిత జంటలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక సంఖ్యలో తరలిరావాలి పెండింగ్లో ఉన్న అట్రాసిటీ పరిహారం కోసం ఎదురుచూస్తున్న బాధితులు, కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులు, దళిత, గిరిజన ప్రజలు ఈ నెల 11న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కెవిపిఎస్ నాయకులు పిలుపునిచ్చారు.

# మంథనిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేకు ప్రజలు సహకరించాలి

- జాతీయ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్



**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ -09 ప్రజావాణి:**జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)-2026లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని మంథని పట్టణంలో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంథని ఆర్డీఓ సురేష్, తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఎంపీడీవో శ్రీజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ శారదలను కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేసి సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు,విద్యాభ్యాసం,వృత్తి విద్య, ఉద్యోగం స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులతో పాటు జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్ఫామ్ల ద్వారా పని చేస్తున్న గిగ్, ప్లాట్ఫామ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి సందేహాలకు తావులేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజనల్ వెంకటేశ్వర్లు, మంథని ఎంపీఎస్ఓ సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో అలా మొదలైంది సినిమా సెప్టెంబర్ 18 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.




**(ప్రజావాణి) సెప్టెంబర్ 9 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.** నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటించిన 'పిఠాపురంలో... అలా మొదలైంది' అనే చిత్రం సెప్టెంబర్ 18న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.గతంలో 'ప్రేయసి రావే' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన మహేష్ చంద్ర ఈ సినిమాకు దర్శకత్వం వహించారు.నిర్మాణ సంస్థలు & డిస్ట్రిబ్యూషన్: ఈ చిత్రాన్ని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా బ్యానర్లపై దుండిగళ్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదారి కిట్టయ్య) సంయుక్తంగా నిర్మించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా ఈ సినిమా విడుదలవుతోంది. కథ నేపథ్యం: ప్రేమ, సునిశితమైన హాస్యం, సెంటిమెంట్‌తో పాటు ముఖ్యంగా తండ్రీకూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. మన చుట్టూ జరిగే సంఘటనలను లైవ్ కెమెరా పెట్టి తీసినట్లు అత్యంత సహజంగా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.ప్రత్యేక ఆకర్షణలు: ఈ చిత్రానికి హాస్యబ్రహ్మ డా. బ్రహ్మానందం వాయిస్ ఓవర్ అందించడం విశేషం. అలాగే ప్రముఖ శిల్పి రాజ్ కుమార్ వడయార్ ఒక కీలక పాత్రలో నటించారు.నటీనటులు: రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, జూనియర్ పవన్ కళ్యాణ్, కేవీ పాల్ రాము, అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జీస్ క్రిష్ సంగీతాన్ని అందించారు.ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభించింది. కుటుంబ సమేతంగా చూదగ్గ ఒక మంచి ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీస్ స్టేషన్లో పలు సూచనలు



**ప్రజావాణి శాయంపేట:** మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాయంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు, సభ్యులను శాయంపేట పోలీసులు పిలిపించి తగు సూచనలు, జాగ్రత్తలను తెలియజేశారు.శాయంపేట సీఐ సుధాకర్ రెడ్డి , ఎస్ఐ పరమేశ్ సమక్షంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలని పోలీసులు సూచించారు. ప్రజలు, భక్తులు సహకరించి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.

# రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- టేక్మాల్ వ్యవసాయ విస్తరణ అధికారి మంజుల



**టేక్మాల్ సెప్టెంబర్ 9: (మన ప్రజావాణి)** మండల పరిధిలోని ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని టేక్మాల్ వ్యవసాయ విస్తరణ అధికారి మంజుల తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నూ రైతుల సౌలభ్యం కోసం ఈ నమోదు ప్రక్రియను ముమ్మరం చేసినట్లు వారు వెల్లడించారు.మండలంలోని ఐదు క్లస్టర్లకు చెందిన వ్యవసాయ విస్తరణాధికారులు తమ పరిధిలోని గ్రామాలలో స్వయంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్డుల నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకోని మిగిలిపోయిన రైతుల వివరాలను ఆయా గ్రామాల వాట్సాప్ గ్రూపులలో అందుబాటులో ఉంచామని, రైతులు ఎవరైనా మిగిలిపోయి ఉంటే వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ ద్వారా ఎరువులు పొందాలంటే ఈ రిజిస్ట్రేషన్ కార్డు ఉండటం విధిగా మార్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి రైతులకు అందే అన్ని రకాల సబ్సిడీలు, రాయితీలు సజావుగా అందాలంటే ఈ కార్డు ఖచ్చితంగా కలిగి ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

# పాఠశాలలు,ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్




- వరుసగా మూడు రోజులు సెలవులు

**బూర్గంపహాడ్ (ప్రజావాణి) సెప్టెంబర్ 9:**తెలుగు రాష్ట్రాల్లోని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఈ వారాంతంలో వరుసగా మూడు రోజుల సెలవులు రానున్నాయి. వినాయక చవితి పండుగ సందర్భంగా ఈ సెలవులు రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.సెప్టెంబర్ 12న రెండో శనివారం కావడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సాధారణ సెలవు ఉంటుంది. సెప్టెంబర్ 13న ఆదివారం కావడంతో మరో సెలవు లభించనుంది. ఇక సెప్టెంబర్ 14న సోమవారం వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించిన నేపథ్యంలో వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రానున్నాయి.దీంతో పలువురు ఉద్యోగులు, విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి పండుగను సొంతూళ్లలో జరుపుకునేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉంది.మరోవైపు గ్రామాలు, పట్టణాల్లో వినాయక చవితి పండుగ సందడి నెలకొంది. వీధుల్లో వినాయక మండపాల ఏర్పాట్లు, అలంకరణ పనుల్లో స్థానికులు, ఉత్సవ కమిటీ సభ్యులు నిమగ్నమయ్యారు.వినాయక చవితి అనంతరం విగ్రహాల నిమజ్జనం రోజున కూడా ఆయా జిల్లాల స్థానిక పరిస్థితులను బట్టి స్థానిక సెలవులు ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# కోదండాపురంలో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- దేవరకొండ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ చేతుల మీదుగా కార్డుల అందజేత



**దేవరకొండ / గుడిపల్లి, ప్రజావాణి:**తెలంగాణ ప్రభుత్వ నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం గుడిపల్లి మండలం కోదండాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. దేవరకొండ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ మాట్లాడుతూ, పేద ప్రజల సంక్షేమం, ఆహార భద్రతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డులు లబ్ధిదారులకు మరింత సౌకర్యవంతంగా, పారదర్శకంగా రేషన్ సేవలను అందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డులలో హోలోగ్రామ్, ఎన్‌క్రిప్టెడ్ క్యూఆర్ కోడ్, వాటర్‌మార్క్, యూవీ లోగోతో పాటు పలు ఆధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచినట్లు తెలిపారు. కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కుటుంబానికి సంబంధించిన రేషన్ వివరాలను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రభుత్వం ఈ నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పూర్తిగా ఉచితంగా అందజేస్తోందని, అర్హులైన పేద కుటుంబాలకు ఒక్కో వ్యక్తికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం దూరదృష్టితో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మైనం రాధిక శ్రీనివాస్, ఉపసర్పంచ్ గోగు ఇద్దయ్య, రేషన్ డీలర్ శ్రీనివాస్, మండాది మల్లయ్య, ఇంద్రకంటి బుచ్చయ్య, భగవంత చారి, పోలే వెంకటయ్య, నక్క బిక్షం, పోలే సైదులు, గ్రామ మహిళలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయంలో ఎవరు శాశ్వత శత్రువులు,మిత్రులు కారు.

- కొందరి నమ్మకద్రోహం వల్లే బాజిరెడ్డి హుందాగా ఈ నియోజక వర్గం వదిలి వెళ్లారు.
- రాజకీయాల్లో ప్రతి ఒక్క రికి హుందాతనం ముఖ్యం.
- బాజిరెడ్డి గోవర్ధన్ క్షమా పణ చెప్పాలని డిమాండ్ చేయడం సరికాదు.
- బీఆర్ఎస్ మహాసభపై కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ పెట్టడం సబబు కాదు.
- పోతంగల్ మహాసభను విజయవంతం చేసిన ప్రజలు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు.
- బీఆర్ఎస్ నాయకులు తేల్ల రవికుమార్,సూదం నవీన్.



**కోటగిరి/ప్రజావాణి:**–రాజకీయాల్లో ఎవరు శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు కారని,ప్రతి ఒక్కరికీ హుందాతనం ముఖ్యం అని,బాజిరెడ్డి గోవర్ధన్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తేల్ల రవికుమార్,సూదం నవీన్ స్పష్టం చేశారు. బుధవారం పోతంగల్ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆరోపణలపై వారు కౌంటర్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా తేల్ల రవికుమార్,సూదం నవీన్ మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన మహా ధర్నా,భారీసభ పోతంగల్ మండలంలో విజయవంతం కావడం దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించడం పట్ల ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.ఈ సభ విజయవంతం కావడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్ మీట్ పెట్టి విమర్శలు చేయడం,నియోజకవర్గ స్థాయి సభకు ఇతర మండలాల నుంచి కార్యకర్తలు వచ్చారని అనడం సరికాదన్నారు. నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఈ ప్రాంత ప్రజలు,కార్యకర్తలు పాల్గొనడంలో ఎలాంటి తప్పులేదని స్పష్టం చేశారు.పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు పోతంగల్‌లో మహాసభ నిర్వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ నాయకులు రీ కౌంటర్‌గా ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సాధారణ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోతంగల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రెస్ మీట్ పెట్టడం బాధాకరమని పేర్కొన్నారు.రాజకీయాల్లో హుందాతనం ముఖ్యం అని.కిందిస్థాయి నాయకులు ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులను ఉద్దేశించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేయడం రాజకీయ విలువలకు విరుద్ధమని తెలిపారు.గతంలో బాజిరెడ్డి గోవర్ధన్ హయాంలో పోతంగల్,బీర్కూర్ ప్రాంతాల్లో మంజీరా బ్రిడ్జిల నిర్మాణం జరిగి మహారాష్ట్రతో సంబంధాలు బలపడ్డాయని గుర్తుచేశారు.అలాగే గత బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ పాలనలో పోతంగల్ మండలంలో జరిగిన అభివృద్ధి కళ్ళకు కనిపిస్తున్నా కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.కొందరి నమ్మకద్రోహం వల్లే బాజిరెడ్డి ఒక హుందాతనంతో నియోజకవర్గం వదిలి వెళ్లారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మోరే కిషన్,హరీఫ్, కారేగాం గణేష్,సూధం సాయిలు, ఎజాస్,గంధపు సాగర్,బిఖ్యా నాయక్, అఫ్రోజ్, ఇమ్రాన్,గంధపు గంగాధర్, జలాల్,సురేష్ పటేల్,కోటగిరి హనుమంతు,ఏకార్,ఫకృద్దీన్,జావేద్,తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న భవారియా గ్యాంగ్ సభ్యుడి అరెస్ట్

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితుడి అదుపులోకి తీసుకున్న పెద్దపల్లి పోలీసులు.. బైక్ స్వాధీనం





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 9** చైన్ స్నాచింగ్‌లను ప్రవృత్తిగా మార్చుకుని వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా గ్యాంగ్ సభ్యుడిని పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి చైన్ స్నాచింగ్‌లకు ఉపయోగించిన పల్సర్ 220 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసుల వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లా కైరాన తహసీల్ జిన్జనా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాన్‌పూర్ కాల గ్రామానికి చెందిన కలిరామ్ (38), తన స్నేహితుడు కపిల్‌తో కలిసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. వీరిద్దరూ రైలు ద్వారా వివిధ పట్టణాలకు చేరుకుని, ముందుగా బైక్‌లను దొంగిలించి, వాటిపై తిరుగుతూ రోడ్డుపై ఒంటరిగా కనిపించే మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు పుస్తెల తాళ్లు, చైన్లను లాక్కెళ్లడం నేర విధానంగా పెట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.
2026 మార్చి 30న పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న నిందితులు రైల్వే కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ బైక్‌ను దొంగిలించి, అదే బైక్‌పై బంధంపల్లి వైపు వెళ్లి గుండు నర్సమ్మ అనే మహిళ మెడలోని సుమారు రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం రామగుండం ఓల్డ్ బజార్‌లో కోల కుసుమ అనే మహిళ మెడలోని సుమారు 45 గ్రాముల బంగారు పుస్తెల తాడును అపహరించినట్లు తెలిపారు.
అదేవిధంగా మే 29న పెద్దపల్లి బస్టాండ్ ముందు మరో పల్సర్ బైక్‌ను దొంగిలించి పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో తిరిగినప్పటికీ చైన్ స్నాచింగ్‌కు అవకాశం లభించకపోవడంతో బైక్‌ను బెల్లంపల్లి వద్ద దాచి ఉత్తరప్రదేశ్‌కు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.ఆగస్టు 17న మరోసారి పెద్దపల్లికి వచ్చిన నిందితులు కాలేజీ మైదానం సమీపంలో పల్సర్ బైక్‌ను దొంగిలించి, లక్ష్మీనగర్‌లో నూనె స్వరూప అనే మహిళ మెడలోని సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లినట్లు పేర్కొన్నారు. అనంతరం బైక్‌ను వాంకిడి--బెల్లంపల్లి మధ్య ప్రాంతంలో వదిలి రైలులో ఉత్తరప్రదేశ్‌కు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.
వరుస చైన్ స్నాచింగ్‌ల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, ఏసీపీ జి.కృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా గ్యాంగ్‌కు చెందిన వారిగా గుర్తించి ప్రత్యేక బృందాన్ని ఉత్తరప్రదేశ్‌కు పంపించారు.నిందితులు తిరిగి పెద్దపల్లి వైపు వస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గతంలో బెల్లంపల్లి వద్ద దాచిన పల్సర్ బైక్‌ను తీసుకుని పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చిన కలిరామ్.. తన సహచరుడు కపిల్ కోసం ఎదురుచూస్తుండగా బుధవారం ఉదయం 9.45 గంటలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పల్సర్ 220 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చైన్ స్నాచింగ్‌లకు సంబంధించిన సొత్తు తన సహచరుడు కపిల్ వద్ద ఉన్నట్లు విచారణలో కలిరామ్ వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న కపిల్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.
నిందితుడిపై పెద్దపల్లి టౌన్, రామగుండం పోలీస్ స్టేషన్లలో మొత్తం ఐదు కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పెద్దపల్లి సీఐ కె.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కె.నరేష్, సీసీఎస్ ఎస్ఐ ఎం.డి.నసీర్, హెచ్‌సీ కె.సుధాకర్, పీసీలు కె.ప్రభాకర్, కె.విజయ్‌కుమార్, బి.ప్రేమ్‌సాగర్‌లను ఏసీపీ అభినందించారు.

# మఠంపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం







**హుజూర్ నగర్ సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ మఠంపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ లో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి ని పురస్కరించుకుని పాఠశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సౌజన్య ల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి. శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. తెలంగాణ భాషా పరిణామ క్రమాన్ని, దాని విశిష్టతను వివరించారు. “మన యాస, మన భాష మన సంస్కృతికి ప్రతిబింబాలని, ప్రతి ఒక్కరూ మాతృభాషను గౌరవించి, దాని ప్రాముఖ్యతను కాపాడుకోవాలని” ఆయన పిలుపునిచ్చారు.ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. తెలంగాణ భాషా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు సామూహికంగా “తెలుగు” అనే పదాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి: చింతలపాలెం ఎస్ఐ పరమేష్

- మండపాల నిర్వాహకులకు పోలీసుల మార్గదర్శకాలు
- ముందస్తు అనుమతులు తప్పనిసరి; రాత్రి 10 దాటితే మైకులకు నో



**చింతలపాలెం, సెప్టెంబర్ 9 ( ప్రజావాణి )** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చింతలపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పరమేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, పోలీస్ నిబంధనలపై ఆయన దిశానిర్దేశం చేశారు.శాంతిభద్రతల పరిరక్షణలో నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరుతూ, ఎస్ఐ పలు కీలక సూచనలు చేశారు:ముందస్తు అనుమతులు: విగ్రహాల ఏర్పాటుకు పోలీస్, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలి.భద్రతా ఏర్పాట్లు: మండపాల వద్ద నిరంతరం ఇద్దరు లేదా ముగ్గురు కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలి. రాత్రి వేళల్లో విగ్రహాల రక్షణకు పహారా ఏర్పాటు చేయాలి. నిఘా కోసం మండపాల వద్ద వీలైనంత వరకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలి.విద్యుత్ జాగ్రత్తలు: నాణ్యమైన వైరింగ్ ఉపయోగించి షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా విద్యుత్ శాఖ నిబంధనలు పాటించాలి.ధ్వని కాలుష్యంపై ఆంక్షలు: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత మైకులు, లౌడ్ స్పీకర్లను పూర్తిగా నిషేధించారు. అనుమతించిన సమయాల్లో మాత్రమే పరిమిత శబ్దంతో వినియోగించాలి.ప్రజలకు ఇబ్బంది కలగొద్దు రోడ్లపై రాకపోకలకు ఆటంకం కలిగించకుండా మండపాలు ఏర్పాటు చేయాలి. నిమజ్జనం సమయంలో చెరువులు, నదుల వద్ద భద్రతా సిబ్బంది సూచనలను పాటించాలని, యువత ప్రమాదకర విన్యాసాలు చేయకూడదని స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ఈ సదస్సులో స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు గణేష్ మండపాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గూడెం గ్రామంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్తో ఇల్లు దగ్ధం

- కట్టుబట్టలతో మిగిలినకుటుంబం!
- రూ.10 లక్షల వరకు ఆస్తినష్టం
- రూ.50 వేల నగదు.. రెండు తులాల బంగారం బూడిద!
- పొగతో రొడ్డ బిచ్చన్నకు తీవ్ర గాయాలు.. వనపర్తి ఆస్పత్రికి తరలింపు
- సిలిండర్ పేలకపోవడంతో తప్పిన పెను ప్రమాదం!!






**చిన్నంబావి, ప్రజావాణి సెప్టెంబరు 9**

చిన్నంబావి మండలం గూడెం గ్రామంలో విద్యుత్ షార్ట్సర్క్యూట్ తో కుటుంబాన్ని కట్టుబట్టలతో మిగిల్చింది. తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలోఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇల్లు కళ్లముందే అగ్నికి ఆహుతైంది. ఇంట్లోని దుస్తులు, నగదు, బంగారం, పుస్తకాలు, ధ్రువపత్రాలు సహా సర్వం కాలిబూడిదయ్యాయి. కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ ఘటన చిన్నంబావి మండలం గూడెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది.

**ఒక్కసారిగా ఎగిసిన మంటలు**

గూడెం గ్రామానికి చెందిన రొడ్డ బిచ్చన్న ఇంట్లో విద్యుత్ షార్ట్సర్క్యూట్తో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇంటి మొత్తం వ్యాపించడంతో దట్టమైన పొగ కమ్ముకుంది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఇంట్లోని సామగ్రి మాత్రం మంటలకు ఆహుతైంది.

**రూ.50 వేల నగదు.. రెండు తులాల బంగారం బూడిద**

అగ్నిప్రమాదంలో ఫ్రిజ్, కూలర్, టీవీ, వాషింగ్ మిషన్, డ్రెస్సింగ్ టేబుల్, బీరువా తదితర గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. దుస్తులు, బియ్యం, తినుబండారాలు, విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, సర్టిఫికెట్లు, ఇతర ముఖ్యమైన ధ్రువపత్రాలు సైతం బూడిదయ్యాయి. బీరువాలో భద్రపరిచిన రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం కూడా కాలిపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది.

**పొగతో రొడ్డ బిచ్చన్నకు తీవ్ర గాయాలు**

మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఉన్న రొడ్డ బిచ్చన్న పొగతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గాయాలు కావడంతో వెంటనే 108 అంబులెన్స్లో వీపనగండ్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**కట్టుబట్టలతో రోడ్డున పడ్డ కుటుంబం**

ఇల్లు, ఇంట్లోని వస్తువులు మొత్తం కాలిపోవడంతో బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. కళ్లముందే సర్వస్వం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

**సిలిండర్ పేలకపోవడంతో తప్పిన ముప్పు**

ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఉండటంతో మంటలు చెలరేగిన సమయంలో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సిలిండర్ పేలి ఉంటే పరిస్థితి మరింత విషమించి భారీ ప్రాణనష్టం జరిగి ఉండేదని గ్రామస్థులు తెలిపారు. అదృష్టవశాత్తు సిలిండర్ పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

**మంటలను అదుపు చేసిన గ్రామస్థులు**

మంటలు కనిపించగానే గ్రామస్థులు అప్రమత్తమై ఘటనాస్థలానికి చేరుకున్నారు. నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం కొల్లాపూర్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

**ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్సై**

సమాచారం అందుకున్న చిన్నంబావి ఎస్సై రామన్గౌడ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, ఆస్తినష్టంపై బాధిత కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రాథమికంగా విద్యుత్ షార్ట్సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు నిర్ధారించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బాధిత కుటుంబానికి సర్పంచ్ పరామర్శ**

ప్రమాద విషయం తెలుసుకున్న గూడెం గ్రామ సర్పంచ్ కొత్త వెంకటరెడ్డి వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బిచ్చన్నను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శోభ, గ్రామస్తులు రాఘవేంద్రశెట్టి, మాధురి, చిన్న కురుమయ్య, రొడ్డ వెంకటస్వామి, రంగన్న, పెద్ద కురుమయ్య, పెద్ద నాగశేషు, ఏడో వార్డు సభ్యురాలు మేకల ఈశ్వరమ్మ, శేర్పల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాగుంటేనే.. గ్రామం బాగుంటుంది!

- మల్బరీ సాగుతో మెరుగైన ఆదాయానికి బాటలు.
- రైతు సందేహాలు తీర్చుతూ.. సాగు విధానాలపై శాస్త్రీయ అవగాహన.
- ప్రతి గ్రామంలో 50 ఎకరాల క్లస్టర్ సాగుకు పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహం.




**కేసముద్రం సెప్టెంబర్ 9, ప్రజావాణి.** రైతు ఆర్థికంగా ఎదిగితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందనే ఉద్దేశంతో ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్ డిమాండ్, సాగు వ్యయం, ఆదాయ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని మల్బరీ సాగును చేపట్టాలని సూచిస్తున్నారు. కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న (నా పట్టు--నా అభిమానం 2.0) కార్యక్రమంలో భాగంగా రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కల్పించారు.

**రైతు దగ్గరకే శాస్త్రీయ పరిజ్ఞానం.!**

రైతులు సాగులో ఎదుర్కొనే సమస్యలకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించాలనే ఉద్దేశంతో కేంద్ర సిల్క్ బోర్డు మైసూరు శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్, సహాయ పట్టు పరిశ్రమ అధికారి కె. సురేష్ రైతులతో నేరుగా మాట్లాడారు. మల్బరీ సాగు విధానం, పట్టు పురుగుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

**పంట మార్పిడితో ఆదాయానికి కొత్త దారి.!**

వరి, మొక్కజొన్న, పత్తి, మిరప వంటి సంప్రదాయ పంటలతో పాటు మల్బరీని ప్రత్యామ్నాయ పంటగా పరిగణించాలని అధికారులు సూచించారు. సరైన సాగు పద్ధతులు, నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహనతో మల్బరీ సాగు ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.

**ఒక్కచోట.. 50 ఎకరాల సాగు.!**

మల్బరీ సాగును క్లస్టర్ విధానంలో సామూహికంగా చేపడితే రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం సులభమవుతుందని అధికారులు తెలిపారు. ప్రతి గ్రామంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

**అధికారుల లక్ష్యం.. రైతు ఆర్థిక ప్రగతి.!**

రైతులకు కొత్త పంటను పరిచయం చేయడం మాత్రమే కాకుండా, దాని సాగు విధానం నుంచి పట్టు పురుగుల పెంపకం వరకు పూర్తి అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు. రైతులు తమ భూమి, నీటి వసతి, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకుని స్థిరమైన ఆదాయం సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. రైతు సమస్యను తన సమస్యగా భావించి.. రైతు సందేహానికి సమాధానం ఇచ్చి..రైతు ఆదాయం పెరిగే మార్గాన్ని చూపించడమే క్షేత్రస్థాయి అధికారుల అసలు సేవ. మల్బరీ సాగుపై అధికారులు అందిస్తున్న ఈ అవగాహన రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించేందుకు ఉపయోగపడుతోంది. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీఓ నంబర్ 97 రద్దు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్
- పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నాకు సంఘీభావం




**అందోల్, సెప్టెంబర్ 9: మన సమగ్ర ప్రజావాణి సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**

జీఓ నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అందోల్-జోగిపేట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సంఘీభావం తెలిపారు. విద్యార్థులను కళాశాల లోపలే ఉంచి బయటకు రాకుండా తాళాలు వేయడంతో పాటు, క్రాంతి కిరణ్ను కళాశాలలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన కళాశాల ఆవరణ బయట తన వెంట వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నాకు దిగారు. మరోవైపు కళాశాల లోపల ఉన్న విద్యార్థులు కూడా నిరసన నినాదాలు చేశారు. అనంతరం ప్రిన్సిపల్, పోలీసు అధికారులు చర్చించి మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ను ఒక్కరినే కళాశాలలోకి వెళ్లి విద్యార్థులను కలిసేందుకు అనుమతించారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది. జీఓ నంబర్ 97తో పాలిటెక్నిక్ విద్య నిర్వీర్యమవుతుందనే ఆందోళన విద్యార్థుల్లో ఉంది. పాలిటెక్నిక్ విద్యను ఇంజనీరింగ్ విద్యతో పాటు కొనసాగించాలి. జీఓ నంబర్ 97 రద్దయ్యే వరకు పాలిటెక్నిక్ విద్యార్థులకు బాసటగా ఉంటాం" అని అన్నారు. రేవంత్ ప్రభుత్వం వెంటనే స్పందించి జీఓ నంబర్ 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పి. నారాయణ ముదిరాజ్, అర్జునయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, సర్పంచ్ వసంత్ రెడ్డి, కౌన్సిలర్ నాగరత్నం గౌడ్, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్, బిర్ల శంకర్, ఖాజా పాషా, కరుణాకర్, ఉల్వల వెంకటేశం, రవీందర్ గౌడ్, పల్లె వెంకట రమణ, ఇమ్రాన్ ఖాన్, విజయ్ కుమార్, సాయి కుమార్, తాలుక లక్ష్మణ్, పవన్ ముదిరాజ్, నర్సింలు, ఉద్ది నాగరాజు, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ అడుగుజాడల్లో నడవాలి...!

- శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్




**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పారస్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను తన కలం బలం ద్వారా ఎండగట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాచైతన్యమే ఊపిరిగా జీవించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, ఆయన చూపిన బాటలో, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, కేర్ టేకర్ వెంకన్న, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావు సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

# మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులను వెంటనే రిలీజ్ చేయాలి




**చిన్నశంకరంపేట, సెప్టెంబర్09, మన ప్రజావాణి:** మాజీ సర్పంచ్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడి కి పిలుపునివ్వడంతో ఈరోజు చిన్న శంకరంపేట మండల పరిధిలోని పలు గ్రామాల సర్పంచ్లను ఉదయం నుండి పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ తాము చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించలేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచుల బిల్లులు విడుదల చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున అసెంబ్లీ ముట్టడించడానికి సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, మాజీ సర్పంచ్ లు సాయం పోచయ్య, బందెల జ్యోతి ప్రభాకర్, పడాల శ్రీనివాస్, గూగ్లోత్ సుధాకర్, తాటికొండ స్వామి రాజ్, తోట రమేష్, సునావతులాలు నాయక్, అత్తెల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి గొల్లవాడవాడలో వీధి దీపాలు వెలగక అంధకారం

- చీకట్లోనే రాకపోకలు.. పాముల భయంతో వణుకుతున్న ప్రజలు



**రేగొండ మండల రిపోర్టర్ సెప్టెంబర్ 09 (మన ప్రజావాణి) :** జయశంకర్ భూపాలపల్లిజిల్లా రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలోని వాడలో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని గొల్లవాడ వాడలో గత 3 నెలలుగా స్తంభాలకు ఉన్న లైట్లు పనిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం చీకటి పడితే వాడ మొత్తం అంధకారంగా మారుతోంది. రాత్రి వేళ పిల్లలు బయటకు రావాలంటే భయం. పాములు, తేళ్లు వస్తున్నాయి. వీధి దీపాలు లేక జారిపడుతున్నాం" అని వాడకు చెందిన ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు పెరిగాయని, మహిళలు, విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీకి పలుమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాడలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దొండపాడు పాఠశాలలో ఘనంగా కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం



**చింతలపాలెం సెప్టెంబర్ 9 ( ప్రజావాణి )** మండల కేంద్రంలోని దొండపాడు ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ పాఠశాలలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ కాళోజీ తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచి, నిజాం నిరంకుశ పాలనకు, అన్యాయాలకు వ్యతిరేకంగా తన కలం ద్వారా గళమెత్తిన ధీశాలి అని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆయన జన్మదినాన్ని అధికారికంగా తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. నేటి తరం విద్యార్థులు కాళోజీని ఆదర్శంగా తీసుకొని, ఉన్నతంగా చదువుకుని తెలంగాణ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేష్, సుమయామిని, సుజాత, భవిత సెంటర్ సిబ్బంది నరసింహారావు, లక్ష్మిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

# ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరచిపోవద్దు: ప్రిన్సిపాల్ రేవతి



**ప్రజావాణి శాయంపేట :** ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను మరచిపోవద్దని శాయంపేట పీఎంశ్రీ, ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి అన్నారు. బుధవారం కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ కర్ణాటకలో జన్మించిన కాళోజీ నారాయణరావు విద్యార్థి దశ నుంచే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరిచారని గుర్తు చేశారు. విద్యార్థులు ఎన్ని భాషలు నేర్చుకున్నా తమ మాతృభాషను మాత్రం మరచిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# మట్టి గణపతులనే పుజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5000 వేల మట్టి వినాయకుల పంపిణీ
- చందానగర్,దీప్తి శ్రీ డివిజన్ లలో శనివారం నుండి పంపిణీ
- బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి





**శేరిలింగంపల్లి,సెప్టెంబర్09(మన సమగ్ర ప్రజావాణి):**-బొబ్బ చారిటబుల్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మట్టి వినాయుకలను,శేరిలింగంపల్లి బీ.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి,కూకట్పల్లి ఎం.ఎల్. ఏ మాధవరం కృష్ణ రావు ఆవిష్కరించడం జరిగినది.బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్,మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ చందానగర్,దీప్తి శ్రీ నగర్ డివిజన్లలో బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 5000 వినాయకులను పంపిణీ చేస్తున్నాం అని,పర్యావరణ పరిరక్షణ కొరకు మట్టి గణపతులను ప్రతిష్టాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగ రావు,సలీం,చందర్ రావు, గౌస్,అంజి యాదవ్,అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

- చిన్నచిన్న కేసుల పరిష్కారానికి సదవకాశం --
- సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్



**సిద్దిపేట, సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. చిన్నచిన్న రాజీ పడదగిన కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రాజీ పడదగిన కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన వివాదాలు, రోడ్డు ప్రమాద కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, చెక్ బౌన్స్ తదితర కేసుల్లోని నిందితులు, ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి రాజీ చేసుకోవచ్చని తెలిపారు.చిన్నచిన్న కేసుల విషయంలో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ రాజీ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభించే అవకాశం ఉందని సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు.

# ప్రభుత్వ బాలుర పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభం

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్





**జమ్మికుంట సెప్టెంబర్ 9 (ప్రజావాణి):**జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో (ఎస్ జి ఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ ముందుగా క్రీడలలో పాల్గొనబోతున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థిని విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని క్రీడల్లో ప్రావీణ్యం పొందినవారు సర్టిఫికెట్ పొందుతూ ఈ యొక్క సర్టిఫికెట్ ద్వారా కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయి కనుక విద్యతోపాటు క్రీడా స్ఫూర్తి కూడా ఉండాలని ఈ యొక్క పాఠశాలలో చదువుకున్నటువంటి ఎందరో విద్యార్థులకు క్రీడల సర్టిఫికెట్ ద్వారా ద్వారా ప్రభుత్వ ఉద్యోగం పొందారని అలాగే క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలుపుతూ మీరందరూ కూడా క్రీడల్లో మంచి ప్రావీణ్యం చూపించి మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ హేమలత ఎస్సైరమేశ్ పాఠశాలప్రధానోపాధ్యాయులు. సురేష్ ఉపాధ్యాయులు ప్రేమలతశ్రీలతరేణుకాప్రవీణ్ శ్రీను,భగత్ తదితరులు పాల్గొన్నారు

# ఆచార్యులగూడెంలో అంగన్వాడి నూతన భవన శంకుస్థాపన

- చిన్నారుల భవిష్యత్తుకు 200 గజాల స్థలం విరళాం ఇచ్చిన దాతలు
- మైలారిశెట్టి చిన్న యలమందయ్య, జానకమ్మ దంపతులు అభినందించిన గ్రామ ప్రజలు



**చిలుకూరు, సెప్టెంబర్ 9 ( ప్రజావాణి):** మండలంలోని ఆచార్యులగూడెంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మీ బిక్షం, స్థలదాతలు మైలారిశెట్టి చిన్న యలమందయ్య, జానకమ్మ దంపతుల చేతుల మీదుగా కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ భవన నిర్మాణానికి 200 గజాల స్థలాన్ని దానం చేసిన చిన్న యలమందయ్య, జానకమ్మ దంపతులను అభినందించారు. స్థల దానం ఆస్తి దానం మాత్రమే కాదని, ఎందరో చిన్నారుల భవిష్యత్తుకు వెలుగునిచ్చే మహాదానమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ నేమ్మాది వీరబాబు, వార్డు సభ్యులు అలవాల భాస్కర్, చింతరెడ్డి లక్ష్మారెడ్డి, వంగూరి కనకరత్నం సూర్యం, బొడ్డుపల్లి ధనలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్ పొన్నం ఉపేంద్ర, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంబాబు, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గట్టు వీరయ్య, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవ పోరాటాన్ని తక్కువ అంచనా వేయొద్దు: ఎమ్మెల్సీల అనుచిత వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ ప్రజాస్వామ్య పరిరక్షకుడు "తలారి సాయి కుమార్"

- స్పీకర్తో పాటు పోలీసులకు కూడా క్షమాపణ చెప్పాలని తీవ్ర డిమాండ్

**మన సమగ్ర ప్రజావాణి (సంగారెడ్డి )09**
మాకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు. దళితుల చరిత్ర అంటేనే పోరాటాల చరిత్ర.. ఆత్మగౌరవ చరిత్ర! బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో ఆత్మగౌరవంతోనే ఈ స్థాయికి వచ్చాం. మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే తెలంగాణ యువత చూస్తూ ఊరుకోదు, ఖచ్చితంగా తిరగబడుతుంది" అని బాధ్యతాయుత పౌరుడు, ప్రజాస్వామ్యవాది లితలారి సాయి కుమార్లి స్పష్టం చేశారు.
శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిపై, అలాగే విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దీ=ా ఎమ్మెల్సీలు చేసిన అనుచిత




వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు.
తలారి సాయి కుమార్ ప్రసంగం/డిమాండ్లలోని ముఖ్యాంశాలు పోలీసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి స్పీకర్ స్థానానికే కాకుండా, ఆ రోజు అసెంబ్లీ గేటు వద్ద విధి నిర్వహణలో ఉండి తీవ్ర అవమానానికి గురైన పోలీసు సిబ్బందికి, రక్షణ వ్యవస్థకు కూడా ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోనాపూర్ సాయి కచ్చితమైన డిమాండ్ చేశారు. లిస్వేచ్ఛకు హద్దులుంటాయి: భావప్రకటన స్వేచ్ఛ అంటే ఒకరి తల్లిని లేదా కులాన్ని కించపరిచే హక్కు కాదని, రాజకీయ విమర్శలకు ఒక పరిమితి ఉండాలని ఆయన ఆక్షేపించారు.
చట్టం ముందు అందరూ సమానులే రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని, శాంతిభద్రతలను కాపాడే పోలీసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన సదరు ప్రజాప్రతినిధులపై చట్టప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.
లిలి"రాజకీయ ఆరోపణలు, నిరసనలు ప్రజాస్వామ్యంలో భాగమే. కానీ, విధి నిర్వహణలో ఉన్న అధికారుల గొంతు నొక్కడం, రాజ్యాంగ స్థానాలను కులాల ప్రాతిపదికన చులకనగా మాట్లాడటం ఆధునిక సమాజానికి మంచిది కాదు. ఈ ఆత్మగౌరవ పోరాటంలో వెనక్కి తగ్గేదే లేదు!

# బాలయ్య ఆరోగ్యం కోసం.. అభిమానుల భక్తి సందడి!

- మృత్యుంజేశ్వ రుడికి విశేష అభిషేకాలు.. కర్ణాటక నుంచి తరలివచ్చిన అభిమానులు

**మన ప్రజావాణి చౌడేపల్లి, సెప్టెంబర్ 9:**నటసింహం నందమూరి బాలకృష్ణ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ చౌడేపల్లిలో అభిమానులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్థానిక మృత్యుంజేశ్వర స్వామి ఆలయం లో బాలకృష్ణ అభిమానులు స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, అలంకరణలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.కాకినాడలో జరిగిన సినిమా షూటింగ్లో బాలకృష్ణ గాయపడిన విషయం తెలుసుకున్న అభిమానులు ఆందోళనకు గురయ్యారు. తమ అభిమాన కథానాయకుడు త్వరగా కోలుకుని మళ్లీ పూర్తి ఆరోగ్యంతో షూటింగ్లో పాల్గొనాలని కోరుకుంటూ మృత్యుంజేశ్వర స్వామిని వేడుకున్నారు. మృత్యుంజయుడి కరుణతో బాలయ్యకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**44 రోజుల క్రితం అఖండ దీపోత్సవం**

నందమూరి బసవతారక రామ ట్రస్ట్, ఆల్ ఇండియా నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 44 రోజుల క్రితం చౌడేపల్లిలో నిర్వహించిన అఖండ దీపోత్సవానికి



కొనసాగింపుగా తాజాగా మృత్యుంజేశ్వర స్వామివారికి ఈ విశేష పూజలు నిర్వహించారు. బాలయ్యపై తమ అభిమానాన్ని చాటుకుంటూ అభిమానులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**కర్ణాటక నుంచి అభిమానుల వెల్లువ**

ఈ కార్యక్రమానికి చౌడేపల్లి పరిసర ప్రాంతాల అభిమానులతో పాటు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని కోలారు, ముళబాగల్ తదితర ప్రాంతాల నుంచి బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అభిమానుల సందడితో కళకళలాడింది.'బాలయ్య సంపూర్ణ ఆరోగ్యంతో మరిన్ని



విజయాలు సాధించాలి.. ఆయనకు ఎలాంటి అనారోగ్య బాధలు కలగకూడదు' అంటూ అభిమానులు మృత్యుంజేశ్వర స్వామిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో నందమూరి బసవతారక రామ ట్రస్ట్ అధ్యక్షుడు వానిగానిహల్లి బాలకృష్ణ, కర్ణాటక రాష్ట్ర కన్వీనర్ కాంతారావు, టీడీపీ నాయకులు కళ్యాణ్, వెంకటరమణ, చిన్నప్పయ్య, చిన్ని, జానీ, హరి, బాషా, కిరణ్, రమేష్, ఎస్ఎస్టీ ట్రైలర్, ఎస్ఎస్కే ట్రైలర్, మీసాల శ్రీనివాసులు, గంగాధర, కృష్ణప్ప, రాజా, రవి, నాగరాజు, సత్తన్న, భీమన్న, పీఎంకే వానిగానిహల్లి మునిఅప్పతో పాటు కర్ణాటకకు చెందిన బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మన వంటింటిపై

**(ప్రజావాణి) సెప్టెంబర్ 9 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.**ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మన వంటింటిపై (నిత్యావసర వస్తువుల ధరలపై) ప్రభావం పడే పరిస్థితి మారాలంటే, భారతదేశం ఆహార, ఇంధన రంగాలలో స్వయంసమృద్ధిని సాధించడం ఒకటే ఏకైక మార్గం. గ్లోబల్ సప్లై చైన్ (ప్రపంచ సరఫరా వ్యవస్థ) పై మన ఆధారపడే తత్వాన్ని తగ్గించుకోవడానికి మార్పులు జరగాలి.
వంటనూనెల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి (ఆత్మనిర్భరత)మన దేశం తన వంటనూనెల అవసరాల కోసం 60% పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది (ఉదాహరణకు: ఉక్రెయిన్ నుండి సన్ఫ్లవర్ ఆయిల్, మలేషియా-ఇండోనేషియా నుండి పామాయిల్).పరిష్కారం: దేశీయంగా ఆయిల్ పామ్ (పామాయిల్ తోటలు), ఆవాలు, వేరుశనగ, సన్ ఫ్లవర్ సాగును భారీగా ప్రోత్సహించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్' వంటి పథకాలను క్షేత్రస్థాయిలో మరింత వేగవంతం చేయాలి. 2. ఇంధన స్వయంసమృద్ధి (పెట్రోల్, డీజిల్, గ్యాస్)యుద్ధాల వల్ల అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు




పెరిగినప్పుడు రవాణా ఖర్చులు పెరిగి, కూరగాయల నుండి పప్పుల వరకు అన్నింటి ధరలూ పెరుగుతాయి. పరిష్కారాలు:ఇథనాల్ బ్లెండింగ్: పెట్రోల్లో చెరకు, ధాన్యాల నుండి తీసే ఇథనాల్ను కలిపే శాతాన్ని వేగంగా పెంచాలి.ఎలక్ట్రిక్ రవాణా: సరుకు రవాణా వాహనాలు, రైల్వేలను పూర్తిగా క్లీన్ ఎనర్జీ (ఈవీ లేదా గ్రీన్ హైడ్రోజన్) వైపు మళ్లించాలి.బయో-గ్యాస్: వంటింటి గ్యాస్ (LPG) పై భారం తగ్గడానికి ముడి వ్యర్థాల నుండి తయారుచేసే బయో-CNG, పీఎన్జీ వాడకాన్ని పెంచాలి.3. రసాయన ఎరువుల దిగుమతులు తగ్గించడం యుద్ధాల వల్ల అంతర్జాతీయంగా ఎరువుల (యూరియా, పొటాష్ వంటివి) ధరలు పెరిగి, దేశంలో సాగు ఖర్చు ఎక్కువవుతోంది. పరిష్కారం: రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. దేశీయంగా నానో యూరియా ఉత్పత్తిని పెంచాలి.4. స్థానిక మార్కెట్లు ఌ కోల్డ్ స్టోరేజ్ నెట్వర్క్పరిష్కారం: నిత్యావసర వస్తువులు, కూరగాయలు ఇతర దేశాలు లేదా సుదూర రాష్ట్రాల నుండి కాకుండా, స్థానికంగానే లభించేలా ప్రాంతీయ వ్యవసాయాన్ని బలోపేతం చేయాలి. పంటలు పాడవకుండా ఉండటానికి ప్రతి జిల్లాలో కోల్డ్ స్టోరేజ్ (శీతలీకరణ గిడ్డంగులు) నిర్మించాలి.ఈ వ్యూహాత్మక మార్పులు దేశంలో పూర్తిస్థాయిలో అమలులోకి వస్తేనే, అంతర్జాతీయ యుద్ధాలు మరియు సంక్షోభాల నుండి మన వంటింటి బడ్జెట్కు రక్షణ దొరుకుతుంది.

# దళితబంధు లబ్ధిదారుల అకౌంట్ లో కెళ్ళి డబ్బులు ఎక్కడికి పోలేదు వొడితల ప్రణవ్

- కౌశిక్ రెడ్డి దుష్ప్రచారాన్ని దళిత సమాజం గమనిస్తుంది
- అకౌంట్ లో కెళ్ళి ఒక్క రూపాయి కూడా పోలేదు నిరూపించకపోతే రాజీనామా చేసిముక్కు నేలకు రాసి,క్షమాపణ చెప్పాలి
- అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**జమ్మికుంట పట్టణంలోని ఎం పి ఆర్ గార్డెన్ లోదళిత బంధు నిధుల విషయంలో దళితులను మోసం చేసి వారికి నిధులు రాకుండా అడ్డుకున్న వ్యక్తి కౌశిక్ రెడ్డి అని,ఇప్పుడు మరల సోషల్ మీడియా వేదిక ద్వారా కొత్త డ్రామాకి తెరలేపుతూ దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న డబ్బులు 50 కోట్లు రూపాయలను వెనక్కి తీసుకున్నారన్న మాటల్లో నిజం లేదని,అబద్ధాలు ఆడటంలో కౌశిక్ రెడ్డినీ మించిన వారు లేరని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ 50కోట్ల దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న నిధులు వెనక్కి తీసుకున్నామన్న వ్యాఖ్యల్లో నిజంలేదని,ఆది నిరూపించకపోతే ముక్కు నేలకు రాసి దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్నికల్లో ఓట్ల కోసం దళితులను వాడుకున్నారనే తప్ప నిజంగా వారి సంక్షేమం కోసం ఆలోచించే వారైతే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఎందుకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయలేదనీ ప్రశ్నించారు.మొదటి నుండి బీఆర్ఎస్ పార్టీ కౌశిక్ రెడ్డి దళిత సమాజానికి వ్యతిరేకమని అన్నారు.నిధులు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం,పార్టీదని త్వరలో నిధులు విడుదల చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో





కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వొకేషనల్ కాలేజీలో షీ టీమ్ అవగాహన సదస్సు

- సోషల్ మీడియా తోటి అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి
- షీ టీమ్ మెంబర్ స్వప్న

**జమ్మికుంట సెప్టెంబర్ 9 (ప్రజావాణి)** జమ్మికుంటకరీంనగర్ సిపి ఆదేశాల మేరకు షీ టీమ్ మెంబర్ స్వప్న బుధవారం జమ్మికుంట ఒకేషనల్ కాలేజీ నందు అవగాహన సదస్సు నిర్వహించారుఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడుతూ కాలేజ్ అమ్మాయిలు సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల తోటి జాగ్రత్తగా ఉండాలని ఎవరిని కూడా నమ్మి ఫోటోలు పంపకూడదని ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీమ్ సెల్ నెంబర్ కు 8712670759 ఫిర్యాదు చేయాలని ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారుఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నబోయిన రాజేందర్అధ్యాపకులు సమ్మయ్య అనిల్ రాజ్ కుమార్ శ్రీవాణి మౌనిక సతీష్ కిషన్ విద్యార్థులు పాల్గొన్నారు





# కాళోజీ సేవలు చిరస్మరణీయం

- తెలంగాణ యాసలో రచనలతో ప్రజల్లో సామాజిక చైతన్యం నింపిన మహోన్నత ప్రజాకవి
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 9** తెలంగాణ మాండలికంలో సామాజిక రచనలు చేస్తూ ప్రజల్లో చైతన్యాన్ని నింపిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.కాళోజీ తన రచనల ద్వారా సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సామాజిక చైతన్యానికి బాటలు వేశారని కొనియాడారు.ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతి కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్లతో కలిసి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు..ప్రజా సమస్యలే రచనలకు ప్రేరణ ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తెలంగాణ మాండలిక భాషను తన రచనలకు ఆయుధంగా చేసుకుని సామాన్య ప్రజల సమస్యలను సమాజం ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, ఆకాంక్షలు, సామాజిక పరిస్థితులను తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు.

కాళోజీ కేవలం ఒక కవి మాత్రమే కాకుండా ప్రజల పక్షాన నిలిచిన సామాజిక ఉద్యమకారుడని అన్నారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన నిరంతరం గొంతెత్తారని తెలిపారు. తన రచనలు, ఉద్యమాల





ద్వారా సమాజంలో మార్పు కోసం కాళోజీ చేసిన కృషి నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమన్నారు.పద్మవిభూషణ్‌తో గౌరవించిన ప్రభుత్వం కాళోజీ నారాయణరావు సమాజానికి అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించిందని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతికి కాళోజీ చేసిన సేవలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు.

కాళోజీ రచనలు తెలంగాణ ప్రజల జీవనాన్ని, భావోద్వేగాలను, సామాజిక పరిస్థితులను ప్రతిబింబించాయని అన్నారు. ఆయన సాహిత్యాన్ని, సామాజిక ఆలోచనా విధానాన్ని భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

తెలంగాణ భాషా దినోత్సవంగా కాళోజీ జయంతి

కాళోజీ నారాయణరావు జన్మదినాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించడం ఆయనకు లభించిన సముచిత గౌరవమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కాళోజీ జయంతిని అధికారికంగా నిర్వహించడం ద్వారా ఆయన సాహిత్య, సామాజిక సేవలను ప్రజలకు గుర్తుచేస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తున్నామని తెలిపారు.తెలంగాణ భాష, యాస, సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు వాటి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాళోజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా కాళోజీ జయంతి కార్యక్రమం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ పలువురు అధికారులు ప్రసంగించారు. కాళోజీ సాహిత్యం, ప్రజా ఉద్యమాలు, తెలంగాణ భాష కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, ఎస్సీ సంక్షేమ అధికారి సింధుతో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామాపురంలో ఘనంగా కాళోజీ జయంతి



**చిలుకూరు, సెప్టెంబర్ 9 (ప్రజావాణి):** మండల పరిధిలోని రామాపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కిరణ్, సర్పంచ్ వేమూరి సతీష్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సామాజిక చైతన్యం కోసం కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. ఆయన రచనలు తెలంగాణ ఉద్యమానికి, ప్రజా చైతన్యానికి దిశానిర్దేశం చేశాయని అన్నారు."ఒక్క అక్షర రూపం దాల్చిన సిరా చుక్క కోటి మెదడులకు కదలిక", "పుట్టుక నీది.. చావు నీది.. బ్రతుకంతా దేశానిది" వంటి కాళోజీ సందేశాలు నేటికీ ప్రజలను చైతన్యపరుస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రజాకవిగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్, సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్, వార్డు మెంబర్ వేమూరి కృష్ణయ్య,గ్రామ పంచాయతీ సిబ్బంది కట్టెకోల శ్రీనివాసరావు,ఏసు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా మేడ్చల్ జిల్లా కు చెందిన కర్నే సురేందర్





**జవహర్ నగర్ సెప్టెంబర్ 9 ( ప్రజావాణి ప్రతినిధి)**సెప్టెంబర్ ఐదు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి హైదరాబాదులో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపిక జరిగాయి. ఎంపికలో భాగంగా మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ నివాసి గీతాంజలి హై స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కర్నే సురేందర్ గారు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గౌరవ ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణా రెడ్డి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం జరిగినది.

# గణేశ్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు... ఎస్ఐ మోహన్ బాబు




**చిలుకూరు, సెప్టెంబర్ 9 (ప్రజావాణి):** గణేశ్ నవరాత్రుల సందర్భంగా చిలుకూరు మండలంలో డీజే సౌండ్ సిస్టమ్‌లకు ఎలాంటి అనుమతి లేదని ఎస్సై బండి మోహన్‌బాబు తెలిపారు. మండలంలోని ఏ గణేశ్ మండపం వద్ద ఐనా డీజేలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు హెచ్చరించారు. అధిక శబ్దం వల్ల ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులకు ఇబ్బందులు కలగడంతో పాటు వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు మండలంలోని ఐదుగురు డీజే నిర్వాహకులపై బైండ్‌ఓవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి...!

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో నిమజ్జన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఘనంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు, ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉందని, గతేడాది ఖమ్మం నగర పరిధిలోనే 1,000కు పైగా వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగిన నేపథ్యంలో ఈ ఏడాది నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు.

మున్నేరు బ్రిడ్జి వద్ద ప్రస్తుతం అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో లేనందున నిమజ్జనంకు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అనువైన ప్రాంతంలో ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు, పోలీస్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవరించాలని కలెక్టర్ సూచించారు.ప్రస్తుతం ఉన్న పరిస్థితులను, సమాచారాన్ని ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీలు, అధికారులు సమన్వయంతో విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమాచారం ప్రతి ఒక్కరికీ ముందుగానే చేరేలా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఏటా జరిగే కార్యక్రమమేననే కారణంతో నిర్లక్ష్యం చేయకుండా, పరిస్థితులకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు.

శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్





రాకపోకలు సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అన్నారు.వినాయక విగ్రహాల నిమజ్జనానికి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసి ప్రజలకు, ఉత్సవ కమిటీలకు తెలియజేయాలని కలెక్టర్ అన్నారు. ట్రాఫిక్ డైవర్షన్ అడ్వైజరీని సెప్టెంబర్ 20వ తేదీ సాయంత్రానికల్లా విడుదల చేయాలని సూచించారు.

పోలీస్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిమజ్జన పాయింట్లపై తుది నిర్ణయం తీసుకోవాలని, నిమజ్జనం సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన సంఖ్యలో ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గణేష్ మండపానికి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లైన్‌మ్యాన్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వయంగా అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ తీగల వల్ల ఎలాంటి విద్యుత్ షాక్ ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, గణేష్ మండపాల్లో షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని అన్నారు.

జిల్లాలోని ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద అవసరమైన బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల తరలింపు సమయంలో అడ్డుగా వచ్చే చెట్ల కొమ్మలను ముందుగానే తొలగించాలని, జిల్లాలో ఎత్తైన విగ్రహాల తరలింపును ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే సమన్వయం చేసుకుని వారికి షిఫ్టుల వివరాలు తెలియజేయాలని అన్నారు.నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించాలని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండపంలో చేపట్టిన ఏర్పాట్లు, అవసరమైన భద్రతా చర్యల వివరాలను ముందుగానే తెలుసు కోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద పోలీస్, ఫైర్, విద్యుత్, హెల్త్ తదితర అత్యవసర సేవల అధికారుల సంప్రదింపు వివరాలతో కూడిన చిన్న పోస్టర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ దోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోరపల్లి పాఠశాలకు 30 వేల మైక్ సెట్ వితరణ

- సర్పంచ్ కందికట్ల మధుసూదన్ కూతురు శంకర్



**జమ్మికుంట సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాల లో కాళోజి జన్మదినం పురస్కరించుకొని కార్యక్రమం జరగడం జరిగింది అట్టి కార్యక్రమానికి పాల్గొన్నటువంటి కోరపల్లి సర్పంచ్ కందికట్ల మధుసూదన్ గతంలో వాగ్దానం చేసిన విధంగా పూర్వ విద్యార్థులు అయిన కూతురు శంకర్ సర్పంచ్ కందికట్ల మధుసూదన్ ఇద్దరు కలిసి 30 వేల రూపాయల విలువగల మైక్ సెట్ ఈరోజు పాఠశాలకు ఉపాధ్యాయుల పిల్లల మధ్యలో విరాళంగా ఇవ్వడం జరిగింది అలాగే కందికట్ల మధుసూదన్ ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు సర్పంచ్ మాట్లాడుతూ నేను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నాను మీ పూర్వ విద్యార్థిని నాకన్నా సీనియర్ అయినటువంటి కూతురు శంకర్ కూడా ఈ యొక్క పాఠశాలలో చదువుకున్నారు మేము ఇద్దరం కలిసి ఈరోజు ఈ యొక్క మైక్ సెట్ ను బహుకరించడం జరిగింది అలాగే పూర్వ విద్యార్థులు ఎవరైనా స్పందించి ఇంకా పాఠశాలకు ఏదైతే సౌకర్యాలు తక్కువ ఉన్న వాటిని గుర్తించి పరిష్కరించాలని కోరుతూ మరొకసారి నన్ను రెండోసారి సర్పంచ్ గా గెలిపించినటువంటి నా యొక్క కోరపల్లి గ్రామ ప్రజలందరికీ నాయొక్క నమస్కారాలు తెలుపుతున్నాను

# ఆపదలో సీఎం సాయం.. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- రూ.2.54 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**చెన్నారావుపేట సెప్టెంబర్ 09 ప్రజావాణి** అనారోగ్యంతో ఆస్పత్రి పాలైన పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తంగా నిలుస్తోందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు. వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడుతూ..



పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, చికిత్స అనంతరం ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించేందుకు సీఎం సహాయ నిధి ఉపయోగపడుతోందన్నారు. అనారోగ్య సమయంలో ప్రభుత్వం తమకు అండగా నిలుస్తుందనే భరోసా ప్రజల్లో కల్పిస్తోందని తెలిపారు. హంసభద్రయ్యకు రూ.84,500, ఎదురబోయిన హైమకు రూ.54 వేలు, ఎల్లగౌడ్‌కు రూ.36,500, చిరబోయిన మౌనికకు రూ.25 వేలు, రాజకోటి బిక్షపతికి రూ.54 వేల చొప్పున మొత్తం రూ.2.54 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొంతి శ్రీను, మార్కెట్ డైరెక్టర్ కోరే కుమారస్వామి, కుండే కుమార స్వామి,మెంతులరమేష్,మాజీ సర్పంచ్ విజయరామ రాజు, జోరు వీరయ్య, కొమురయ్య, వార్డు సభ్యుడు లక్క రాజు, యువ నాయకులు వనపర్తి శోభన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు




**రాయికల్, సెప్టెంబర్ 09 (ప్రజావాణి):**రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జూపల్లి తిరుపతిరావు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి,జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కాళోజీ తెలుగు భాషకు, తెలంగాణ యాసకు చేసిన సేవలను, ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష యొక్క గొప్పతనం, తీయదనం, ప్రత్యేకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం విద్యార్థులు తెలంగాణలోని వివిధ ప్రాంతాల యాసలను ప్రతిబింబించేలా నాటక ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. "తెలుగు భాష తీయదనం" అనే పాటకు విద్యార్థులు చేసిన ప్రత్యేక నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. మరికొందరు విద్యార్థులు తెలుగు భాష గొప్పతనం, కాళోజీ సాహిత్య సేవల గురించి ప్రసంగాలు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల, తెలంగాణ సంస్కృతి, యాస పట్ల అభిమానం పెరగడంతో పాటు కాళోజీ ఆశయాలను తెలుసుకునే అవకాశం కలిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జూపల్లి వేణుగోపాల్ రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నంగునూరు మండలం రాజగోపాల్‌పేట యువకుడికి డాక్టరేట్

- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టా పొందిన రాచకొండ కిషోర్



**ప్రజావాణి, నంగునూరు సెప్టెంబర్ 9:**సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాల్‌పేట గ్రామానికి చెందిన రాచకొండ కిషోర్ డాక్టరేట్ సాధించారు. దీంతో గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారు.ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆయన పరిశోధన చేశారు. సౌర విద్యుత్, పవర్ మేనేజ్‌మెంట్ అంశాలపై పరిశోధన పూర్తి చేశారు. సెప్టెంబర్ 8న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో 85వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా రాచకొండ కిషోర్ పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు.పేదరికం నుంచి వచ్చిన కిషోర్ ఉన్నత విద్యలో ప్రతిభ చాటడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి డాక్టరేట్ సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కిషోర్ విజయంతో రాజగోపాల్‌పేట గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గ్రామస్థులు ఆయనను అభినందించారు.ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గురువారం,
సెప్టెంబర్ 10, 2026
మన సర్కారు ప్రజావాణి తెలుగు డైలీ



## నూతన పెన్షన్లపై అధికారుల పరిశీలన



**మన ప్రజావాణి చౌడేపల్లి, సెప్టెంబరు 9:** నూతన పెన్షన్ల మంజూరు ప్రక్రియను అన్నమయ్య జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ధర్మరాజు బుధవారం పరిశీలించారు. చౌడేపల్లి, పెద్దకొండామర్రి గ్రామ సచివాలయాలను సందర్శించి లబ్ధిదారుల దరఖాస్తులు, అర్హతలు, ధ్రువపత్రాల పరిశీలనపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.నూతన పెన్షన్ దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. అయితే ఆధార్‌లో పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా, నవీకరించి ఉండాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా సంబంధిత సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలా మాధవి, వెలుగు సమాఖ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- చేగుంట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి (రాజిరెడ్డి)



**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం** చేగుంట మండల కేంద్రంలో శ్రీ మహంకాళి ఆలయం 3వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు, బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి. అనంతరం చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు, బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి గారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు.చేగుంట మహంకాళి ఆలయం వైస్ చైర్మన్ గుండ్ల సంపత్,ఉదయ్ భాస్కర్,పులబోయిన రవి,అన్నం రవి,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

- స్పందించని డిపో మేనేజర్
- చేవెళ్ల హైదరాబాద్ కు బస్సు సర్వీస్ లను పెంచి సమయానికులంగా నడిపించాలి
- ఎస్ ఫ్ ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ డిమాండ్



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,సెప్టెంబర్ 09:**వికారాబాద్ నుంచి చేవెళ్ల హైదరాబాద్ కు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని బస్టాండ్ లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ. వికారాబాద్ డిపో నుంచి హైదరాబాద్కు సాధారణ,ఎక్స్ప్రెస్, డీలక్స్ బస్సులు అందుబాటులో లేక పొద్దున కాలేజీకి సాయంత్రం ఇంటికి వెళ్లడానికి సమయానికి అనుకూలంగా బస్సులు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు సాయంత్రం నాలుగు గంటల తర్వాత మళ్లీ ఆరు గంటల వరకు ఒక్క బస్సు ఉండడం తాండూరు నుంచి కూడా హైదరాబాద్కు బస్సుల కొరతతో విద్యార్థులు, ఉద్యోగులు,మహిళలు,వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.వికారాబాద్ జిల్లా నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నప్పటికీ బస్సుల కొరత ఉండడం సిగ్గుచేటు కాబట్టి ప్రభుత్వం అధికారులు స్పందించి అత్యవసరంగా తగినన్ని బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## రెడ్డి వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

- రెడ్డి జాగృతి జనగామ జిల్లా అధ్యక్షులు కరెడ్ల రఘునందన్ రెడ్డి




**మద్దూరు సెప్టెంబర్9,ప్రజా వాణి,**రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తీన్మార్ మల్లన్నపై బుధవారం మద్దూర్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రెడ్డి జాగృతి జనగామ జిల్లా అధ్యక్షులు కరెడ్ల రఘునందన్ రెడ్డి విలేఖర్లకు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సమాజం లేదా వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు. ఇలాంటి వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం మద్దూరు పోలీసులకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి జనగామ జిల్లా అధ్యక్షులు కరెడ్ల రఘునందన్ రెడ్డి,యాటవెల్లి బాల్ రెడ్డి ,గొట్టం భూపతి రెడ్డి, కడవేరుగు మల్ల రెడ్డి,నలుసాని భాస్కర్ రెడ్డి, గజ్జెల బాల్ రెడ్డి, చల్ల శరత్ రెడ్డి,గజ్జెల పూర్వస్ రెడ్డి,కలకోటి నర్సింహా రెడ్డి,గుంత్రెడి శ్రీకాంత్ రెడ్డి,గజ్జెల పూర్వస్ రెడ్డి, దాకూరి బాల్ రెడ్డి,రాపాక బుచ్చిరెడ్డి, పాల్గొన్నారు.

## ఇనుగుర్తి ఎంపీడీవో ఆఫీసులో కాళోజీ జయంతి



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో బండారి పార్థసారథి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగినా తన మాటలు,కవితలతో ధిక్కారస్వరం వినిపించేవారన్నారు.తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించిన ఘనత కాళోజి నారాయణరావుదే అన్నారు.తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, వారి భాషలోని సహజత్వాన్ని, ప్రజల సమస్యలను తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి కాళోజి అని కొనియాడారు.కార్యక్రమంలో ఏ పీ ఓ దీప్లా నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ రంజిత్, కార్యాలయ ఉద్యోగులు ప్రణీత్,వివేక్ వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రథసారథి, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలు

- కేసముద్రంలో ఘనంగా సేవా కార్యక్రమాలు.

**కేసముద్రం, సెప్టెంబర్ 9, ప్రజావాణి.**

భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు జన్మదిన వేడుకలు కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో అత్యంత వైభవంగా, సేవా దృక్పథంతో జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, యువ నాయకులు సామాజిక సేవా కార్యక్రమాలతో హోరెత్తించారు.

**చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు.. విద్యార్థులకు కిట్ల పంపిణీ.!**

మున్సిపాలిటీ పరిధిలోని చైతన్య నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు వల్లందాస్ యశ్వంత్ మరియు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు చదువుకు ఉపయోగపడే పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్స్‌తో కూడిన



ప్రత్యేక స్టేషనరీ కిట్లను మరియు పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా యువనేత యశ్వంత్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ.!**

సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన యువజన విభాగం, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేసింది. రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ, వారికి ధైర్యాన్ని నింపారు. నాయకుడి పుట్టినరోజున ఇలాంటి మానవతా కార్యక్రమాలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘనమైన జన్మదిన వేడుకల్లో బిఆర్ఎస్ యువజన విభాగం ప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో వల్లందాస్ శ్రీకాంత్, శ్రీనాథ్, పందుల సతీష్, మామిడి అజయ్, స్టాలిన్, వినీత్, బాబురావు, పట్ల చందు, బన్నీ, సన్నీలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది మరియు స్థానిక పార్టీ కార్యకర్తలు ఉన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఎమ్మెల్సీ రవీందర్ రావుకు సోషల్ మీడియా వేదికగా, స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

## పలుకులో తెలంగాణ.. ప్రదర్శనలో పల్లె పరిమళం!

- ఉప్పరపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో కాళోజీ జయంతి వేడుకలు
- తెలంగాణ యాస, భాష, సంస్కృతిని చాటిన విద్యార్థులు

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 09 ప్రజావాణి** తెలంగాణ మట్టివాసన.. మాండలికం మాధుర్యం.. పల్లె జీవన సోయగం.. సంప్రదాయాల వైభవం.. ఇవన్నీ ఒకే వేదికపై కనిపించాయి. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా సాగాయి.తెలంగాణ భాషా వైభవాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో తెలుగు ఉపాధ్యాయుడు లెంకలపల్లి మొగిలి ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, పద్యపఠనం, నృత్యం, స్కిట్స్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. తొలుత కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తమ మాటల్లో తెలంగాణ యాసను, తమ ప్రదర్శనల్లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించారు.

యాసలో యవ్వారం.. కళల్లో తెలంగాణం..




విద్యార్థుల ప్రసంగాలు, పద్యపఠనం, నృత్యాలు, స్కిట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ మాండలికంలోని ప్రత్యేకత, ప్రజల జీవన విధానంతో భాషకు ఉన్న అనుబంధం, తెలంగాణ సంస్కృతి--సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తమదైన శైలిలో ఆవిష్కరించారు. చిత్రలేఖనాల్లోనూ తెలంగాణ జీవన చిత్రాలు ఉట్టిపడాయి.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ మాట్లాడుతూ.. "తెలంగాణ భాష, యాస, సంస్కృతికి విద్యార్థులే భావితరాల వారధులు" అని అన్నారు. మాతృభాషపై ప్రతి విద్యార్థి గౌరవం, అభిమానం పెంచుకోవాలని సూచించారు. కాళోజీ వంటి ప్రజాకవుల సాహిత్యాన్ని




విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా భాషపై మమకారం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.భాషా దినోత్సవ వేడుకలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకత, సాహిత్యాభిరుచి, వేదికపై మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించేలా ఉండాలని ఆమె అన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, కె. సంతోష్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఏ. ఉదయ్‌కుమార్, జి. సుందర్, కె. మాధవి, వర్దెల్లి సతీష్‌కుమార్, బి. రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహెద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో సాధారణ సమావేశం

- మున్సిపల్ చైర్మన్ మొలుగు దిలీప్
- మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానంద వ మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి

**జమ్మికుంట సెప్టెంబర్ 9 (ప్రజావాణి)**కరీంనగర్ జిల్లా జమ్మికుంట లోవ్యవసాయ మార్కెట్ కమిటి జమ్మికుంట కాటన్ మార్కెట్ కార్యాలయం యందు పుల్లూరి స్వప్న సదానందంచైర్ పర్సన్ అద్యక్షతనలో పాలక వర్గ సాధారణ సమావేశం ఏర్పాటు చేసి మొదటగాతెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ఈ క్రింది అంశాలను చర్చించి తీర్మానించనైనదిఈ క్రింద ఉన్నఎజెండా అంశములు చర్చించి తీర్మానించనైనది1జూన్ 2026 జూలై 2026 ఆగష్టు 2026 మాసముల ఆదాయ వ్యయముల సమీక్షించడం జరిగినది2రాబోయే ఖరీఫ్ సీజన్ పత్తి, ధాన్యము మక్కలు కొనుగోలు కేంద్రాలు గురించి ముందస్తుగా ఎం ఎస్ పి పరికరాలు గురించి చర్చించడం జరిగినది3.ట్రాక్టర్ ట్రాలీ (15) మంది హమాలీ వారికీ లైసెన్సులు జారీ చేయుటకు చర్చించిఆమోదిం



చనైనదినిర్వహణ పనులు1 కొత్త మార్కెట్ మరయు పాత మార్కెట్ ల యందు సి.సి ప్లాట్ ఫాం మద్యన తార్ పోయుటగురించి చర్చించుట2 కొత్త మార్కెట్ పాత మార్కెట్ ల యందు కాంపౌండ్ వాల్ నిర్వహణ పనుల గురించి చర్చించుట3కొత్త మార్కెట్ యార్డు యందు ఉన్న టాయిలెట్స్ నిర్వహణ పనుల గురించి చర్చించుట4. కొత్త మార్కెట్ యార్డు యందు ఉన్న గోడౌన్ రూఫ్స్ నిర్వహణ పనుల గురించి చర్చించుట5. కొత్త మార్కెట్ కార్యాలయం ముందు ఉన్న సి.సి ప్లాట్ ఫాంని ఏర్పాటు



చేయుటగురించి6పాత మార్కెట్ యార్డు యందు ఉన్న డ్రైనేజి ఎత్తుపెంచుటగురించిచర్చించుటపాత మార్కెట్ యార్డు యందు సిసి కెమరాలు ఏర్పాటు చేయుట గురించి చర్చించుటఈ కార్యక్రమములో మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్ రాజా వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి సభ్యులు శ్రీపతి రెడ్డి సునీల్ సతీష్, రాజేశ్వరరావు సదానందం సురేష్ దీక్షిత్ శ్రీనివాస్ రెడ్డి రషీద్ పాషా తిరుపతి శ్యామ్ కుమార్ శ్రీనివాస్ ప్యాక్స్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మునిసిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అనుమతి లేకుండా మండపం పెడితే చర్యలు..!

- గణేష్ ఉత్సవాలపై పోలీసుల నిఘా..
- భద్రతా నిబంధనలు పాటించాల్సిందే..!
- ప్రతి మండపానికి ప్రత్యేక నంబర్..
- నిమజ్జనానికి ముందే మార్గం, సమయం ఖరారు
- పసర ఎస్.ఐ.ఎస్.కె తాజుద్దీన్

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజావాణి):-** గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు మొదలవుతున్న వేళ పసరాపోలీసులు నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. అనుమతి లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేయొద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఇబ్బందులు తప్పవని పసరఎస్ఐ ఎస్.కె తాజుద్దీన్ స్పష్టం చేశారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు గణేష్ మండపాల ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు. మండపం ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగానే పసర పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి పొందిన మండపాల వివరాలను పోలీసులు నమోదు చేసుకుని, భద్రతా చర్యలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

పగలు.. రాత్రి పోలీసుల నిఘా





గణేష్ మండపాల వద్ద భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పగలు, రాత్రి బీట్ నిర్వహించడంతో పాటు నిరంతరం పెట్రోలింగ్ చేపడతామని ఎస్.ఐ .తెలిపారు. యువత అత్యుత్సాహానికి పోకుండా బాధ్యతగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రతి విగ్రహానికి ప్రత్యేక నంబర్

ఉత్సవాల నిర్వహణలో భాగంగా ప్రతి గణేష్ విగ్రహానికి ప్రత్యేక నంబర్ కేటాయించనున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి గందరగోళం లేకుండా ముందుగానే నిమజ్జన మార్గం, సమయం తదితర వివరాలను నిర్వాహకులకు తెలియజేస్తామని చెప్పారు.భక్తి పేరుతో నిబంధనలు అతిక్రమిం చొద్దు.గణేష్ ఉత్సవాలు భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలవాలని పోలీసులు కోరుతున్నారు. ఉత్సవాల పేరుతో డీజేలు, అధిక శబ్దాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా మండపాల ఏర్పాటు వంటి అంశాల్లో నిబంధనలు పాటించాలని సూచిం చారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్ఐ తాజుద్దీన్ కోరారు.మండపాల నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకుని, పోలీసుల సూచనలను పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన సూచించారు. భక్తి ఉత్సవం.. బాధ్యతతో నిర్వహిద్దాం.. శాంతియుత గణేష్ నవరాత్రు లకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

# ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలి

- 15 రోజులుగా నీరులేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కొత్త బావికి మోటార్, పైప్‌లైన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి
- రీ- సర్వే పర్యటనలో కలెక్టర్ స్నేహ శబరిష్ కు వినతిపత్రం అందించిన సర్పంచ్ ప్రవీణ్ నాయక్.





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, సెప్టెంబర్ 09(ప్రజా వాణి )** బయ్యారం మండల పరిధి,కొత్తపేట గ్రామపంచాయతీలో భూ రీ-సర్వే పర్యవేక్షణకు వచ్చిన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ను కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ కలిసి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్తో మాట్లాడుతూ,గ్రామంలో గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి కోసం గ్రామ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో కొత్తగా తవ్వించిన బోరు బావికి మోటార్, పైప్‌లైన్ మంజూరు చేసి మిషన్ భగీరథ నీటి సరఫరా ను పునరుద్ధరించేందుకు అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్ల సురేష్,బుర్ర దుర్గారావు ధనసరి భద్రయ్య,బోడ సాయి కృష్ణ, పుల్లూరి బాలరాజు , రాచమల్ల మహేష్ ,భూక్య బాలకృష్ణ, దేశనీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బుధవారం ఖమ్మం కలెక్టర్ ప్రాంగణంలో ఖమ్మం జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా పాగి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర ముత్యం, కోశాధికారిగా చాపలమడుగు కోటేశ్వరరావు లు ఓటింగ్ ద్వారా గెలుపొందారు. ఈ ఎన్నికలో ఖమ్మం జిల్లాలోని 22 మంది తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాల్గొని ఓటు వేయడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా మునగాల వెంకటరత్నం, గౌరవ సలహాదారులుగా పమ్మి రవి, మిమిక్రీ సుధాకర్, కాల్వకట్ట జాన్, మేడ ముత్తయ్య, ఉపాధ్యక్షులుగా పరకాల అజయ్, కొమ్ము రమేష్, మిమిక్రీ భద్ర, సహాయ కార్యదర్శిగా వెంకట్ నకిరేకంటి, మాచర్ల కృష్ణ, పిడియాల లక్ష్మణ్, ప్రచార కార్యదర్శిగా గోవింద గురవయ్య, మహిళా ప్రతినిధులుగా ఎంగల కుమారి, బీరెల్లి రమణ, కొండ్రు జ్యోతి, ముత్తమాల సునీత, కార్యవర్గ సభ్యులుగా బానోత్ రవిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

# పోరాటమే ఊపిరిగా... సేవనే మార్గంగా... సీతక్క ఒక స్ఫూర్తి శిఖరం

**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** ఒక నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని, జీవితంలో ఎదురైన ప్రతి అడ్డంకిని మెట్టుగా మార్చుకుంటూ, ప్రజల కోసం పోరాడుతూ, అంచెలంచెలుగా ఎదిగి ఈరోజు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా నిలిచిన దనసరి అనసూయ సీతక్క జీవితం ఒక వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు... పోరాటం, పట్టుదల, ధైర్యం, సేవాభావం ఉంటే సామాన్య మనిషి కూడా అత్యున్నత స్థాయికి ఎదగగలడనే సజీవ సందేశం.

సీతక్క జీవితాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే---

"కష్టాలను చూసి వెనక్కి తగ్గలేదు... కన్నీళ్లను చూసి కుంగిపోలేదు... ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి ముందుకు సాగింది."

పేదరికం నుంచి ప్రజాసేవ వరకు...

తెలంగాణలోని గిరిజన సమాజంలో జన్మించిన సీతక్క చిన్ననాటి నుంచే పేదరికం, వెనుకబాటుతనం, సామాజిక అసమానతలను దగ్గరగా చూసారు. అడవులు, కొండలు, మారుమూల గ్రామాల్లో నివసించే గిరిజన కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు ఆమె జీవితంలోనే భాగమయ్యాయి. విద్య, ఉపాధి, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాల కోసం ప్రజలు పడే ఇబ్బందులను ఆమె ప్రత్యక్షంగా చూశారు. ఆ అనుభవాలే ఆమెలో ప్రజల కోసం ఏదైనా చేయాలనే తపనను పెంచాయి.

జీవితం తనకు సులభమైన దారిని చూపలేదు. కానీ సీతక్క కూడా సులభమైన దారిని ఎంచుకోలేదు.

పోరాటం ఆమె జీవితానికి పునాది

సీతక్క జీవితంలో అత్యంత ప్రత్యేకమైన అంశం ఆమె పోరాట పటిమ. సాధారణ రాజకీయ నాయకురాలిగా కాకుండా, ప్రజల మధ్య నుంచి వచ్చిన నాయకురాలిగా ఆమె తన ప్రయాణాన్ని కొనసాగించారు.

ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి గ్రామాలకు వెళ్లడం, అడవుల్లోని మారుమూల ప్రాంతాలకు చేరుకోవడం, బాధితుల పక్షాన నిలబడడం---ఇవి ఆమె ప్రజా జీవితంలో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

పదవి కోసం ప్రజల దగ్గరకు వెళ్లలేదు... ప్రజల కోసం పోరాడుతూ పదవిని సాధించారు.

అందుకే సీతక్కను చూసే ప్రజల్లో ఒక ప్రత్యేకమైన నమ్మకం ఏర్పడింది.

ప్రజల కష్టమే తన కష్టం

సీతక్క రాజకీయ ప్రస్థానంలో అత్యంత ముఖ్యమైన లక్షణం---ప్రజలతో ఆమెకు ఉన్న అనుబంధం.

ఎంత పెద్ద పదవిలో ఉన్నా సామాన్య ప్రజల మధ్యకు వెళ్లడం, వారి సమస్యలను వినడం, వారికి అందుబాటులో ఉండడం ఆమె రాజకీయ శైలిలో కనిపించే ప్రత్యేకత.

పేద కుటుంబాలు, గిరిజనులు, మహిళలు, రైతులు, కూలీలు, మారుమూల గ్రామాల ప్రజల సమస్యలపై ఆమె నిరంతరం స్పందిస్తూ వచ్చారు.

"ప్రజలకు దూరంగా ఉండే నాయకత్వం కాదు... ప్రజల మధ్యే ఉండే నాయకత్వం" అనే భావనను ఆమె తన ప్రస్థానంలో చూపించారు.

రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదుగుదల

సీతక్క రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయి. అయినప్పటికీ ప్రతి దశలోనూ తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగారు.

ప్రజా సమస్యలపై పోరాడుతూ, తన ప్రత్యేకమైన రాజకీయ వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజాస్వామ్య రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని మరింత బలపరిచారు.

ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఎన్నికై, ములుగు ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేశారు.

తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన విజయాలు మాత్రమే కాదు---పరాజయాలు కూడా ఆమెను మరింత బలమైన నాయకురాలిగా తీర్చిదిద్దాయి.

గెలుపు వచ్చినప్పుడు పొంగిపోలేదు... ఓటమి వచ్చినప్పుడు కుంగిపోలేదు.



గిరిజన మహిళగా ఒక ప్రత్యేక గుర్తింపు

తెలంగాణ రాజకీయాల్లో గిరిజన మహిళగా సీతక్క ఎదుగుదల ఎంతో ప్రత్యేకమైనది.

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన మహిళ ఒక రాష్ట్ర స్థాయి నాయకురాలిగా ఎదగడం అనేది ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

ఆమె ఎదుగుదల వెనుక కేవలం రాజకీయ అదృష్టం లేదు.

కష్టం ఉంది... కన్నీరు ఉంది... అవమానాలను ఎదుర్కొన్న ధైర్యం ఉంది... ప్రజల కోసం చేసిన సేవ ఉంది... ముఖ్యంగా వెనుకడుగు వేయని పట్టుదల ఉంది.

సంక్షోభ సమయంలో సేవే ముందుగా

ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారి వద్దకు వెళ్లి అండగా నిలవడం సీతక్క ప్రజా జీవితంలో కనిపించే మరో ముఖ్యమైన అంశం. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, కరోనా వంటి సంక్షోభ సమయాల్లో ప్రజలకు సహాయం అందించేందుకు ఆమె చేసిన ప్రయత్నాలు ఆమెను ప్రజలకు మరింత చేరువ చేశాయి.

సేవ అంటే కేవలం పదవిలో ఉన్నప్పుడు చేసే కార్యక్రమం కాదని, ప్రజల కష్టాల్లో వారి పక్కన నిలబడటమే నిజమైన సేవ అనే భావనను ఆమె తన ప్రవర్తన ద్వారా చాటారు.

మంత్రి స్థాయికి ఎదిగిన సీతక్క

ప్రజల నమ్మకంతో ఎమ్మెల్యేగా ఎన్నికై, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టడం సీతక్క జీవిత ప్రస్థానంలో ఒక కీలకమైన మైలురాయి.

ఒకప్పుడు మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రజల సమస్యల కోసం తిరిగిన మహిళ...

ఈరోజు అదే ప్రజల కోసం ప్రభుత్వ స్థాయిలో నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగారు.

ఇది ఒక్క సీతక్క విజయం మాత్రమే కాదు.

పేదరికంతో పోరాడుతున్న ప్రతి యువకుడి విజయం.

అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి యువతి విజయం.

సామాజిక వెనుకబాటుతనాన్ని అధిగమించాలని కలలు కనే ప్రతి గిరిజన బిడ్డ విజయం.

పదవి పెరిగినా... ప్రజలతో బంధం తగ్గలేదు

మంత్రి అయిన తర్వాత కూడా సీతక్క తన మూలాలను మరచిపోకుండా ప్రజల మధ్య ఉండేందుకు ప్రయత్నించడం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

మంత్రి పదవి అనేది తనకు అలంకారం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యత అని భావించే నాయకత్వమే ఆమెది.

ములుగు నియోజకవర్గ అభివృద్ధి, గిరిజన ప్రాంతాల సమస్యలు, గ్రామీణ మౌలిక సదుపాయాలు, మహిళలు, రైతులు, పేదలు వంటి అంశాలపై ఆమె ప్రత్యేక దృష్టి సారిస్తూ వస్తున్నారు.

యువతకు సీతక్క జీవితం చెప్పే పాఠం

ఈరోజు యువతలో చాలామంది చిన్న అపజయం వచ్చినా నిరాశ చెందుతున్నారు. ఒకసారి ఉద్యోగం రాకపోతే, ఒకసారి పరీక్షలో విఫలమైతే, ఒకసారి రాజకీయంగా లేదా వ్యక్తిగతంగా ఎదురుదెబ్బ తగిలితే తమ జీవితమే ముగిసిపోయిందని భావిస్తున్నారు.

అలాంటి ప్రతి యువకుడికి, ప్రతి యువతికి సీతక్క జీవితం ఒక గొప్ప సమాధానం.

కష్టం వచ్చినప్పుడు కుంగిపోకూడదు.

అవకాశం రాకపోతే అవకాశాన్ని సృష్టించుకోవాలి.

అవమానం ఎదురైతే ఆత్మవిశ్వాసంతో నిలబడాలి.

అపజయం వస్తే అది అంతం కాదు---మరో విజయానికి ప్రారంభం.

సీతక్క జీవితం మనకు ఇదే చెబుతోంది.

మహిళలకు ఒక గొప్ప సందేశం

సీతక్క ప్రస్థానం మహిళలకు కూడా ఒక శక్తివంతమైన సందేశం. మహిళ ఇంటికే పరిమితం కావాలనే పాత ఆలోచనలకు ఆమె ఎదుగుదల ఒక సమాధానం.

"మహిళకు అవకాశం ఇస్తే ఆమె కుటుంబాన్ని మాత్రమే కాదు... సమాజాన్ని, ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని కూడా ముందుకు నడిపించగలదు" అనే విషయాన్ని ఆమె తన రాజకీయ ప్రయాణంతో నిరూపించారు.

గిరిజన బిడ్డ నుంచి రాష్ట్ర మంత్రిగా...

సీతక్క జీవితాన్ని వెనక్కి తిరిగి చూస్తే ఒక అద్భుతమైన ప్రయాణం కనిపిస్తుంది.

గిరిజన కుటుంబం? పేదరికం? పోరాటం?ప్రజలతో అనుబంధం ? ప్రజా సేవ ? రాజకీయ ప్రస్థానం ? ఎమ్మెల్యే ? రాష్ట్ర మంత్రి

ఇది ఒక సాధారణ రాజకీయ ప్రయాణం కాదు.

ఇది "మన పరిస్థితులు మన భవిష్యత్తును నిర్ణయించవు... మన సంకల్పమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అనే సత్యానికి నిదర్శనం.

సీతక్కకు సలాం

ఎన్నో కష్టాలను ఎదుర్కొని కూడా వెనక్కి తగ్గకుండా, ప్రజల కోసం పోరాడుతూ, తన శ్రమను నమ్ముకొని, తన సేవను నమ్ముకొని ఈ స్థాయికి ఎదిగిన సీతక్క ధైర్యానికి సలాం.

పేదరికాన్ని చూసి భయపడని ధైర్యానికి సలాం...

అవరోధాలను చూసి ఆగని పట్టుదలకు సలాం...

ప్రజల కన్నీళ్లను తన కన్నీళ్లుగా భావించే మానవత్వానికి సలాం...

గిరిజన మహిళగా అగ్రస్థాయికి ఎదిగిన ఆత్మవిశ్వాసానికి సలాం...

ప్రజాసేవనే తన జీవిత ధ్యేయంగా భావించే సీతక్కకు సలాం.

చివరగా యువతకు ఒక సందేశం

సీతక్క జీవితం మనకు ఒక గొప్ప సత్యాన్ని నేర్పుతుంది---

"మీ పుట్టుక మీ భవిష్యత్తును నిర్ణయించదు.

మీ పరిస్థితులు మీ గమ్యాన్ని నిర్ణయించవు.

మీ దగ్గర ఉన్న డబ్బు మీ స్థాయిని నిర్ణయించదు.

మీ కష్టం, మీ ధైర్యం, మీ పట్టుదల, మీ సేవాభావమే మీ భవిష్యత్తును నిర్మిస్తాయి."

అందుకే సీతక్క జీవితం కేవలం ఒక రాజకీయ నాయకురాలి జీవిత చరిత్రగా చూడకూడదు.

కష్టాల్లో ఉన్న యువతకు ధైర్యం ఇచ్చే కథగా...

మహిళలకు ఆత్మవిశ్వాసం నింపే కథగా...

గిరిజన యువతకు ఆశ చూపించే కథగా...

పేదలకు "మనమూ ఎదగగలం" అనే నమ్మకం కలిగించే కథగా...

ప్రజాసేవ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా చూడాలి.

పోరాటం నుంచి పుట్టిన నాయకత్వం...

ప్రజల నుంచి వచ్చిన విశ్వాసం...

సేవతో సంపాదించిన గౌరవం...

ధైర్యంతో సాధించిన స్థానం---

అదే సీతక్క జీవితం.

"కష్టం నిన్ను ఆపడానికి రాదు... నిన్ను మరింత బలంగా మార్చడానికి వస్తుంది" అనే సందేశానికి సీతక్క జీవితం ఒక సజీవ ఉదాహరణ.

జై సీతక్క. జై జై సీతక్క. శివ గాజుల

# ఆర్మూర్‌కు నిధులు మంజూరు చేయండి....

- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వినతి



**ఆర్మూర్ టౌన్ సెప్టెంబర్ 09(మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి బుధవారం తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని, నూతన మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.7.50 కోట్ల నిధులు మంజూరు చేసి అన్ని అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఖరీఫ్ పంట సాగుకు రైతులకు ఇబ్బందులు లేకుండా గుత్ప ఎత్తిపోతల పథకం నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వినతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే గుత్ప నుంచి వెంటనే నీటిని విడుదల చేయాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించినట్లు రాకేశ్ రెడ్డి తెలిపారు.

# కరాటేలో 'గోల్డ్' గర్ల్

- 16 స్వర్ణ పతకాలు..
- నాలుగు ఛాంపియన్‌షిప్‌లతో నిత్యశ్రీ జైత్రయాత్ర
- జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ చేతుల మీదుగా ఘన సత్కారం





**మెదక్, జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 9:** నగేష్ మల్లారి శిక్షణతో అంతర్జాతీయ వేదికపై మెరుపులు కరాటే రంగంలో మెదక్ పట్టణానికి చెందిన నిత్యశ్రీ తనదైన ముద్ర వేస్తోంది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న ఆమె ఇప్పటివరకు 16 స్టేట్, ఇంటర్నేషనల్ గోల్డ్ మెడల్స్‌తో పాటు నాలుగు ఛాంపియన్‌షిప్‌లను సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్ నిత్యశ్రీని అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడల్లో నిత్యశ్రీ సాధించిన విజయాలు మెదక్ జిల్లాకే గర్వకారణమన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో నిత్యశ్రీ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. నిత్యశ్రీ మాట్లాడుతూ.. తన గురువు నగేష్ మల్లారి సారథ్యంలో శిక్షణ తీసుకుంటూ కరాటేలో విజయాలు సాధిస్తున్నానని తెలిపారు. గురువు అందిస్తున్న శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం తనకు ఎంతో అండగా నిలిచాయని చెప్పారు. తన ప్రతిభకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ బ్రూస్ లీ ఐకాన్ అవార్డు సైతం సొంతం చేసుకున్నానని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని దేశానికి, రాష్ట్రానికి, మెదక్ జిల్లాకు మంచి పేరు. తీసుకురావడమే తన లక్ష్యమని నిత్యశ్రీ పేర్కొన్నారు.

# కేసీఆర్ భద్రతను సమీక్షించాలని కోరిన బీఆర్ఎస్ నేతలు





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరేలా, ఆయనకు హాని కలిగించే విధంగా ప్రేరేపించే ధోరణిలో వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, ఆర్ టి వి లో ప్రసారం ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, హింసకు దారితీసేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం మౌనం వహించకూడదని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఒక ప్రజాప్రతినిధి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు, అనుచరుల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు జరిపి, భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల మేరకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలకు అవకాశం ఉందన్న అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా విచారించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నిపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, ఆ పరిమితి దాటితే ప్రభుత్వం చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ కార్పొరేటర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి క్రిష్ణ , మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఖమర్ , మాజీ కార్పొరేటర్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ ఎస్.కె మగ్బుల్ , మాజీ కార్పొరేటర్ రోజ్ వీనా షకిన , బి ఆర్ యస్ నాయకులు ముజాహిద్ బండారు శీను, గౌరి నాద్ గౌతమ్ బాబా మున్నా ఉస్మాన్ షరీఫ్ ఇలియాస్ శైలజా , చోటు అజీమ్ ' ఫెరోజ్ , హిజాహర్ ' జావీద్ , సాజీద్ తదితరులు పాల్గొన్నారు.

## సురేందర్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ నేతల భరోసా



**చెన్నారావుపేట సెప్టెంబర్ 09 ప్రజావాణి** మండల కేంద్రంలోని పాపయ్యపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పాత్రికేయుడు తాళ్ల సురేందర్‌రెడ్డి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం అమీనాబాద్ పీఏసీఎస్ ఛైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చెన్నారావుపేట పిఎసిఎస్ మాజీ వైస్ ఛైర్మన్ తొగరు చెన్నారెడ్డి, మరియు కాంగ్రెస్ నాయకులు కుటుంబ సభ్యులను కలిశారు.ఉత్తరక్రియల నిమిత్తం కుటుంబానికి ఒక క్వింటా బియ్యాన్ని అందజేసి అండగా నిలిచారు.సురేందర్‌రెడ్డి తండ్రి సాంబరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.కష్టకాలంలో మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ నాయకులు



**భద్రాచలం/మన ప్రజావాణి (09 సెప్టెంబర్ 26):** భద్రాచలంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసిన బీజేపీ టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ ఉ గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. పార్వతి హాథీరామ్ నాయక్, బుధవారం రోజు భద్రాచలం లోని ఐటిసి గెస్ట్ హౌస్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా బొకేతో ఘనంగా సత్కరించి, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన రైతులకు రావలసిన పోడు పట్టాలు ఇప్పించాలని వారి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు బాలాజీ నాయక్, డ్రెస్సింగ్ మండల నాయకులు శంభు నాయక్, దరావత్ సురేష్, బాల, తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు...



**కోదాడ, సెప్టెంబర్ 9/ ప్రజావాణి** కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘ ఎన్నికలు బుధవారం నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికలలో 10 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా ఎనిమిది మంది ఉపసంహరించుకున్నారు. ఎన్నికల బరిలో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పైడిమర్రి నారాయణరావు. రాయపూడి వెంకటనారాయణ లు నిలిచారు. గత పది రోజులుగా ఇరువురు అభ్యర్థులు పట్టణంలో తమ అనుచరులతో తిరుగుతూ ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటివరకు కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం కమిటీ ఏకగ్రీవంగానే ఏర్పాటు అవుతూ వచ్చింది. మొట్టమొదటిసారిగా సంఘానికి ఎన్నికలు నిర్వహించబడుతుండడంతో పట్టణంలోని ఆర్యవైశ్యులతో పాటు ఇతర సామాజిక వర్గాలు సైతం ఈ ఎన్నికలపై దృష్టి పెట్టాయి. పది రోజులుగా ఉత్కంఠ నెలకొన్న ఈ ఎన్నికల హడావిడి బుధవారంతో ముగిసింది. ఈ ఎన్నికలో 806 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో 419 ఓట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పైడిమర్రి నారాయణరావుకు. 384 ఓట్లు రాయపూడి వెంకటనారాయణకు రాగా మూడు ఓట్లు చెల్లలేదు. ఎన్నికల అధికారి ఇరుకుల్ల చెన్నకేశవరావు గెలిచిన అభ్యర్థికి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ గత సంవత్సరాలుగా వైశ్య సంఘానికి పలు రకాల సేవలను అందజేస్తున్నానని భవిష్యత్తులో సైతం ఆర్యవైశ్యుల ఐక్యతకు పటిష్టతకు కృషి చేస్తానన్నారు ఆర్యవైశ్యులలోని అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు రాజకీయాలకు అతీతంగా అందుబాటులో ఉంటూ తన సేవలను కొనసాగిస్తానన్నారు. తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. పైడిమర్రి నారాయణరావును జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు,జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ సర్పంచ్ పైడిమరి సత్యబాబు, వైశ్య ప్రముఖులు పైడిమర్రి వెంకట్ నారాయణ, చల్లా రామ్మూర్తి,ఇమ్మడి రమేష్ గరినే శ్రీధర్ వెంపటి మధు చెల్లా ప్రకాష్, ఓరుగంటి బ్రహ్మం, వంగవీటి శ్రీనివాసరావు,ఓరుగంటి పాండు తదితరులు అభినందించారు.

## వివేకవర్ధిని పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం.!

- ప్రజాకవి కాళోజీ సేవలు చిరస్మరణీయం... పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్.
- మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.



**కేసముద్రం, సెప్టెంబర్ 9,ప్రజావాణి.** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో బుధవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఉద్యమానికి స్ఫూర్తి కాళోజీ రచనలు.!

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణకు కాళోజీ చేసిన సేవలు అనన్యసామాన్యమైనవని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ఇక్కడి మట్టి మనోభావాలను తన కలం ద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడు కాళోజీ అని పేర్కొన్నారు. ఆయన రచనలు తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజల్లో ఎనలేని చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిల్చాయని గుర్తుచేశారు. నేటి తరం విద్యార్థులు కాళోజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, మాతృభాషను ప్రేమించి, గౌరవించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో భాషాభిమానాన్ని పెంపొందించడంలో శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ భాషా మాధుర్యం అనంతం.! తెలుగు ఉపాధ్యాయులు వీరబోయిన సుమన్ మాట్లాడుతూ.. తెలంగాణ భాషలోని విశిష్టతను, అమాయకత్వంతో కూడిన మాధుర్యాన్ని, ఇక్కడి సాంస్కృతిక వైభవాన్ని విద్యార్థులకు చక్కగా వివరించారు. మన జీవన విధానాన్ని ప్రతిబింబించే మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యతని గుర్తుచేశారు. ప్రజాకవిగా కాళోజీ సాగించిన సాహిత్య ప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులర్పించారు. కాళోజీ నినాదాలతో పాఠశాల ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి..

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వాణి ప్రసాద్







**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (09 సెప్టెంబర్ 26):** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, పర్యాటక, ఇతర శాఖల అధికారులతో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించేలా చర్యలు చేపట్టడంతో పాటు, జిల్లాల్లోని పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధిపై ఆసక్తి ఉన్న యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని, ఫిల్మ్ టూరిజం ద్వారా కూడా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాల్లోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా ఆయా జిల్లాలను ప్రముఖ పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయనున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితాను రూపొందించాలని సూచించారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి కేంద్రీకృత సేకరణలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించి, వాటి ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా టూరిజం నోడల్ అధికారి అనూష, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం...

- కాలుష్య నియంత్రణ మండలి గోడ పత్రిక ఆవిష్కరణ.
- ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలి.
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.





**సెప్టెంబర్ 09 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్స వాలను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం రోజున కలెక్టరేట్ సమావేశం మందిరంలో గణేష్ నవరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , జిల్లా ఎస్పీ అక్షాంక్ యాదవ్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు , అడిషనల్ ఎస్పీ లక్ష్మి నారాయణలతో కలిసి సమీక్షించారు. ముందుగా శాంతి సమావేశం కమిటీ సభ్యులు తమ సూచ నలు , సలహాలు తెలియ జేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ ఈ నెల 14న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్స వాలను ఘనంగా నిర్వ హించాలని , భక్తులకు , ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేయాలని , వినాయకుల నిమజ్జ నానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిమజ్జనానికి అవసర మైన రూట్ మ్యాపులు సిద్ధం చేసుకోవాలని , అవసరమైన రూట్లలో రోడ్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని తెలి పారు. వినాయక చవితి నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెడికల్ ఆఫీసర్ , సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి అందు బాటులో ఉంచాలన్నారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం సాయంత్రం వేళ జరుగుతున్నందున నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకో వాలన్నారు. వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైన చర్యలు తీసుకో వాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తూ ప్రతి చెరువు దగ్గర విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో మండ పాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. గణేష్ నవరాత్రులు మొదలుకొని నిమర్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండ పాలలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలి అనే వాటి మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా పండగ వాతా వరణంలో జరుపు కునేందుకు సహాయ సహకారాలు అందివ్వాలని తెలిపారు.జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ. గణేష్ పండుగను శాంతి యుతంగా జరుపు కునేందుకు విగ్రహాన్ని పెట్టుకునే ప్రతి ఒక్కరు ఆన్లైన్లో కమిటీ సభ్యులు , గణేష్ వివరాలను నమోదు చేయాలని అన్నారు. ఆన్ లైన్లో నమోదు చేసిన వివరాలు బట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేయడం జరుగు తుందన్నారు. రాత్రి సమయంలో మండపాల వద్ద ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ మండపాలు రోడ్లను బ్లాక్ చేసి పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయి కాబట్టి రోడ్డుకు ఇరు వైపులా ఏర్పాటు చేసు కోవాలన్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసర మైన బందోబస్తు ఏర్పాటు, గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పర్యా వరణ పరిరక్షణ , కాలుష్య నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందు కు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. మట్టి గణపతుల వినియోగంతో నీటి కాలుష్యం తగ్గడంతో పాటు ప్రకృతి సమతుల్య తను కాపాడవచ్చని , పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ , ఆర్డీవో లు కృష్ణారెడ్డి , శేఖర్ రెడ్డి , భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి , సంఘం సభ్యులు , ఉత్సవ కమిటీల సభ్యులు , జిల్లా అధికారులు , మున్సిపల్ కమిషనర్లు తహ సిల్దారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఇచ్చిన దళిత హామీలు ఏమయ్యాయి?

- తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా తొలగించాలి
- నవీన్‌రెడ్డి అనుచిత, దురహంకార వ్యాఖ్యలు ఖండనీయం..
- ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలి
- విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు





**మేడిపల్లి సెప్టెంబర్ 09(మన ప్రజావాణి)** తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి, తెలంగాణ సమాజానికి తలవంపులు తెచ్చేలా ఉందని,బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా తొలగించాలని,నవీన్‌రెడ్డి చేసిన అనుచిత, దురహంకార వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు డిమాండ్ చేశారు.బోడుప్పల్ సర్కిల్ లోని ఫేడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, ప్రజలను, సామాజిక వర్గాలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని రాపోలు రాములు అన్నారు. తాతా మధు, నవీన్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేసిన వారిపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ దళిత హామీలు ఏమయ్యాయి?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రాపోలు రాములు ప్రశ్నించారు. దళితులకు ముఖ్యమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటి అమలులో ఎంతవరకు చిత్తశుద్ధి చూపిందో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. దళితులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన లెక్కలు చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉందన్నారు.

ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్..

అధికారంలో ఉన్న సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన కేసీఆర్ ఇప్పుడు ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని రాపోలు రాములు విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా రాజకీయాలు చేయడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రజల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను కలవాలని సూచించారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైనా ఉందని రాపోలు రాములు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇతర పార్టీలపై విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు.ఈ సందర్భంగా తాతా మధు,నవీన్‌రెడ్డి వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాపోలు రాములు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఫేడరెషన్ వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,అధ్యక్షుడు అబ్రహం లింకన్,ప్రదాన కార్యదర్శి గడ్డం యాదగిరి,కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్,సభ్యులు రామకృష్ణారెడ్డి,మహేష్, మధుసూదన్, దానగళ్ళ యాదగిరి,గోపు రాము,ఎర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురుకు నూతన అంబులెన్స్..

- ప్రారంభించి నజాతీయ ఎస్టీ కమిషన్ హుస్సేన్ నాయక్



**ప్రజావాణి,నెల్లికుదురు:** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ చొరవ, కృషితో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలానికి ఆధునిక వసతులతో కూడిన అంబులెన్స్ మంజూరయింది. దీనిని హుస్సేన్ నాయక్ బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు,మండల అధ్యక్షులు చందు రాజ్ కుమార్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు మదన్ లాల్ ప్రభృతులతో కలిసి దంతాలపల్లి మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి మండలాధ్యక్షులు చందు రాజ్ కుమార్ యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు మదన్ లాల్ మాట్లాడుతూ తమతో పాటు,పార్టీ మండల శాఖ అభ్యర్థన మేరకు హుస్సేన్ నాయక్ ఓఎన్జిసి,సిఎస్ఆర్ నిధుల సహకారంతో నెల్లికుదురు మండలానికి అంబులెన్స్ మంజూరీ చేయించారన్నారు. మండలంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ లతోపాటు అన్ని వర్గాల పేదలందరికీ అంబులెన్స్ సేవలు అందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ తరఫున మండల ప్రజల పక్షాన హుస్సేన్ నాయక్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోనాయకులు తోట రమేష్, సాయి గౌడ్, రొయ్యల చంటి, గుగులోత్ బావిసింగ్ వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య కాదు... ఆశకు ఒక అవకాశం ఇవ్వాలి!



ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం -- సెప్టెంబర్ 10 సందర్భంగా మనిషి జీవితంలో కొన్ని క్షణాలు ఎంతో భారంగా అనిపిస్తాయి. సమస్యలు వరుసగా ఎదురైనప్పుడు, మార్గం కనిపించనప్పుడు "ఇక నా జీవితంలో ఏమీ మారదు" అనే ఆలోచన కలగవచ్చు. అయితే ఒక కష్టమైన పరిస్థితి శాశ్వతం కాదు. ఆ క్షణంలో కనిపించని మరో మార్గం ఉండవచ్చు. అందుకే ఆత్మహత్యల నివారణ అనేది కేవలం ఒక రోజు నిర్వహించే అవగాహన కార్యక్రమం కాకుండా, కుటుంబం మరియు సమాజం మొత్తం బాధ్యతగా తీసుకోవాల్సిన అంశం.

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహిస్తారు. ఆత్మహత్య గురించి ఉన్న మౌనం, అపోహలు, నిందల నుంచి బయటకు వచ్చి అవగాహన, సానుభూతి, సంభాషణ మరియు సహాయానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం.

గణాంకాల వెనుక... ఎన్నో జీవితాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 7.2 లక్షలకు పైగా ప్రజలు ఆత్మహత్యతో మరణిస్తున్నారు. ముఖ్యంగా యువతలో కూడా ఇది తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతోంది.

అయితే ఈ సంఖ్యలను కేవలం గణాంకాలుగా చూడటం సరిపోదు. ప్రతి సంఖ్య వెనుక ఒక మనిషి, ఒక కుటుంబం, ఎన్నో సంబంధాలు, చెప్పలేని ఒక కథ ఉంటాయి. అందుకే ఆత్మహత్యల నివారణలో గణాంకాలతో పాటు, బాధలో ఉన్న వ్యక్తిని గుర్తించడం, వినడం, అర్థం చేసుకోవడం మరియు సరైన సమయంలో సహాయం అందించడం ఎంతో ముఖ్యమైనది.

ఆత్మహత్యకు ఒక్క కారణమే ఉండదు

ఆత్మహత్య ఆలోచనలు రావడానికి ఒకే ఒక్క కారణం ఉండదు. కుటుంబ సమస్యలు, సంబంధాల్లో ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, అవమాన భావన, వైఫల్యం, తీవ్రమైన మానసిక వేదన వంటి అనేక అంశాలు ఒకదానితో ఒకటి కలిసిపోవచ్చు. అందువల్ల "అతనికి అంత మంచి జీవితం ఉంది కదా... మరి ఎందుకు ఇలా ఆలోచించాడు?" అని ప్రశ్నించడం కంటే, "అతను అనుభవిస్తున్న బాధ ఏమిటి"? అని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

సంకేతాలను గమనించాలి

ఒక వ్యక్తి అకస్మాత్తుగా అందరితో దూరంగా ఉండటం, నిరాశ లేదా నిస్సహాయత గురించి మాట్లాడటం, "నావల్ల ఎవరికీ ఉపయోగం లేదు" వంటి మాటలు చెప్పటం, గతంలో ఇష్టపడిన విషయాలపై ఆసక్తి కోల్పోవడం, వంటి మార్పులను కుటుంబ సభ్యులు గమనించాలి.

మరణం గురించి మాట్లాడటం లేదా జీవితం పై ఆశ కోల్పోయినట్లు వ్యక్తం చేయడం వంటి సంకేతాలను కూడా తేలికగా తీసుకోకూడదు.

ఇలాంటి సమయంలో "అలా ఆలోచించకు", "నీకు ఏం తక్కువ", "ఇతరులకు ఇంకా పెద్ద సమస్యలు ఉన్నాయి"అని చెప్పడం కంటే, ప్రశాంతంగా విని, తీర్పు ఇవ్వకుండా మాట్లాడటం అవసరం.

ఒక సంభాషణ... ఒక జీవితానికి తోడు

ఎవరైనా తీవ్రంగా బాధపడుతున్నట్లు కనిపిస్తే వారి దగ్గర కూర్చుని "నువ్వు ఎలా ఫీల్ అవుతున్నావో చెప్పు... నేను వినడానికి ఉన్నాను" అని చెప్పడం ఎంతో విలువైన సహాయం కావచ్చు.

వారి బాధలు చిన్నచూపు చూడకుండా, ఒంటరిగా వదిలేయకుండా, అవసరమైతే కుటుంబ సభ్యులు, మానసిక ఆరోగ్య నిపుణులు లేదా అత్యవసర సహాయ వ్యవస్థలలో వెంటనే సంప్రదించాలి.

ప్రొఫెషనల్ సహాయం తీసుకోవడం బలహీనత కాదు. అది తన జీవితాన్ని కాపాడుకోవడానికి తీసుకునే బాధ్యతాయుతమైన నిర్ణయం.

మౌనం కాదు... మనస్ఫూర్తిగా మాట్లాడాలి

ఆత్మహత్య గురించి సున్నితంగా మరియు బాధ్యతగా మాట్లాడటం ద్వారా అపోహలను తగ్గించవచ్చు. ముఖ్యంగా కుటుంబాల్లో "మానసిక సమస్యలను బయటకు చెప్పకూడదు" అనే భావనను మార్చాల్సిన అవసరం ఉంది.

ఎవరైనా బాధలో ఉన్నప్పుడు వారికి సలహా ఇవ్వడానికి అన్నా ముందు వారి మాట వినడం చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనం సమస్యను వెంటనే పరిష్కరించలేకపోయినా, వారి బాధలో వారికి తోడుగా ఉండగలం.

ఒక ఫోన్ కాల్, ఒక చిన్న ప్రశ్న, శ్రద్ధగా వినయ్ ఒక చెవి, "నేను నీతో ఉన్నాను" అని ఒక మాట కూడా ఒక వ్యక్తికి ఎంతో విలువైనదిగా అనిపించవచ్చు.

చివరి సందేశం

ఆత్మహత్య ఒక సమస్యకు పరిష్కారం కాదు... కానీ సరైన సమయంలో అందిన సహాయం ఒక జీవితానికి దారి చూపగలదు.

మాట్లాడండి...వినండి...అర్థం చేసుకోండి...తోడుగా నిలబడండి. ప్రతి ప్రాణం విలువైనదే.ప్రతి జీవితానికి , ఆశకు ఒక అవకాశం ఉంది. రాధిక సోమ సైకాలజికల్ కౌన్సిలర్ సెరినిటి స్పేస్ కౌన్సిలింగ్ సెంటర్ 9347166650

# సీఎంని మర్యాద పూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్...

● ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సహక రించాలని కోరిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.



**సెప్టెంబర్ 09 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య బుధవారం రోజు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు అంశాలతో పాటు ఆలేరు నియోజకవర్గంలో కొన సాగుతున్న సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలు , ప్రజలకు సంబంధించిన పలు సమస్యలపై ముఖ్య మంత్రితో బీర్ల ఐలయ్య చర్చించారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతి పాదనలు , ప్రజల అవసరాలు, పెండింగ్ సమస్యలను రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని అంశాలపై సాను కూలంగా స్పందిస్తూ , ప్రజా సంక్షేమం , నియోజక వర్గ అభివృద్ధికి అవసర మైన చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు.

# విశ్వశాంతి పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు



**రాయికల్, సెప్టెంబర్ 09 (ప్రజావాణి):** రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ, ఈరోజు మనం తెలంగాణ జాతి గర్వించదగ్గ మహాకవి, ప్రజావాణి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని జరుపుకుంటున్నామని అన్నారు. ఈ రోజును తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా "తెలంగాణ భాషా దినోత్సవం"గా ప్రకటించుకోవడం మనందరికీ గర్వకారణమని తెలిపారు.కాళోజీ కేవలం పుస్తకాలకే పరిమితం కాలేదని, ప్రజల కష్టాలను, కన్నీళ్లను తన కవితల్లో ప్రతిబింబించారని అన్నారు. "అన్యాయాన్ని ఎదిరించాలి, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి" అని తన రచనల ద్వారా చాటిచెప్పారని, నిజాం నిరంకుశ పాలనను, అరాచకాలను తన కలంతో గట్టిగా ఎదిరించిన నిర్భయ యోధుడని కొనియాడారు. "నా గొడవ" పేరుతో ఆయన రాసిన కవిత్వం ప్రతి ఒక్కరిలోనూ చైతన్యాన్ని నింపిందని, ప్రజల భాషలోనే సాహిత్యం ఉండాలని నమ్మిన గొప్ప వ్యక్తి కాళోజీ అని అన్నారు. మన తెలంగాణ యాసలోని పదునును, సౌందర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను స్మరిస్తూ, సమాజంలో మంచిని కోరుకుంటూ, మన మాతృభాషను గౌరవిద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్ మరియు ఉపాధ్యాయులు మహేష్, రంజిత్, అఫ్సర్, రజిత, సంజన, ఇందుజ, మంజుల, స్రవంతి, కవిత, సాయిహర్ష, దీపిక, శివాని, సౌజన్య, కళ్యాణి, మాలతి, అహల్య, గాయత్రి, గీతారాణి, ప్రవళిక, కావ్య, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

# రంగస్థలంపై విజ్ఞాన విస్ఫోటనం.. రాష్ట్ర స్థాయికి 'శ్రీ వివేకవర్ధిని' బాలమేధావులు!

● సముద్రాల సంరక్షణే ధ్యేయంగా జీవకళ ఉడికించిన విద్యార్థులు.. జిల్లా స్థాయిలో 'ప్రథమ' కేతనం!

● ర్యాంకుల వేటలోనూ సామాజిక స్పృహను నేర్పుతున్న కేసముద్రం 'శ్రీ వివేకవర్ధిని' యాజమాన్యానికి హ్యాట్సాఫ్!



**కేసముద్రం సెప్టెంబర్ 09.ప్రజావాణి.**పుస్తకాల పుటల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని, సమాజాన్ని మేల్కొలిపే ఆయుధంగా మార్చవచ్చని నిరూపించారు ఆ పదిమంది విద్యార్థులు! కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా, గ్లోబల్ సమస్యలపై గళమెత్తి రంగస్థలంపై వారు చేసిన ప్రదర్శన జిల్లా విద్యా రంగాన్నే విస్మయానికి గురిచేసింది.బుధవారం అనంతారం మోడల్ స్కూల్ ఆవరణలో జిల్లా విద్యాశాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో కేసముద్రం 'శ్రీ వివేకవర్ధిని హైస్కూల్' ప్రభంజనం సృష్టించింది. జిల్లాలోని హేమాహేమీలైన ఎన్నో పాఠశాలలను వెనక్కి నెట్టి, సగర్వంగా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఏకగ్రీవంగా ఎంపికై సంచలనం సృష్టించింది.

**వేదికపై సముద్ర ఘోష.. కన్నీళ్లు పెట్టించిన అద్భుత నటన!**

ప్రస్తుత సమాజం స్వార్థంతో ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రాల్లోకి నెడుతూ.. జలచరాల ప్రాణాలను ఎలా హరిస్తుందో కళ్ళకు కట్టేలా వీరు ఎంచుకున్న "సముద్రాల సంరక్షణ -- పునరుద్ధీకరణ" నాటిక ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. నలమాస లాస్య, రాంపల్లి రఘువీర్, బానోతు హిమబిందు, గోవిందు వరుణ్, పింగిలి భవిష్య, పోలపల్లి ఆద్విక, పోలపల్లి తిలక్, చీర నందన్, బొల్లోజు శ్రీహరి తేజ, చేతి ఆశ్రయ జాయ్ వంటి విద్యార్థులు వేదికపై కేవలం నటించలేదు.. సముద్రపు గుండె ఘోషను తమ అభినయంతో ఆవిష్కరించి న్యాయనిర్ణేతల చేత కన్నీళ్లు పెట్టించారు. క్లిష్టమైన సైన్స్ అంశాన్ని ఇంత సులభంగా, సందేశాత్మకంగా ప్రదర్శించిన వీరి ప్రతిభకు యావత్ విద్యాశాఖ జోహార్లు అంటోంది.

**ర్యాంకుల వేట కాదు.. సంస్కార విలువల వేదిక!**

నేటి కార్పొరేట్ రోజుల్లో విద్యార్థులను కేవలం మార్కులు తెచ్చే యంత్రాలుగా మారుస్తున్న విద్యా వ్యవస్థను చూస్తున్నాం. కానీ, దానికి భిన్నంగా మా లక్ష్యం కేవలం ర్యాంకులు కాదు.. సామాజిక స్పృహ కలిగిన బాధ్యతాయుతమైన పౌరులను తయారుచేయడం అని చేతల్లో నిరూపించారు శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్.ఈ గెలుపు వెనుక ఆయన దార్శనికత , విద్యార్థులకు కల్పించిన స్వేచ్ఛా వాతావరణం స్పష్టంగా కనిపిస్తోంది.పర్యావరణ పరిరక్షణ అనే బృహత్తర అంశాన్ని నాటక రూపంలోకి తెచ్చేందుకు గైడ్ టీచర్ మేకల విష్ణుకు పూర్తి స్వేచ్ఛను ఇవ్వడమే కాకుండా, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను యాజమాన్యం సమకూర్చింది. విజయం సాధించిన బాల సైంటిస్టులను, వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని జిల్లా ప్రజలు, విద్యాభిమానులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. రాష్ట్ర స్థాయి వేదికపై కూడా 'వివేకవర్ధిని' జెండా ఎగరాలని మనమూ ఆకాంక్షిద్దాం!

# ఇటిక్యాల సింగిల్విండో చైర్మన్ గా మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్....?



**రాయికల్;సెప్టెంబర్ 09 (ప్రజావాణి)**రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామ సహకార పరపతి సంఘం (సింగిల్విండో) చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనే దానిపై గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, రైతులకు అందుబాటులో ఉంటున్న శ్రీనివాస్ గౌడ్ కు ఈసారి చైర్మన్ పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన వర్గీయులు చెబుతున్నారు.సింగిల్విండో ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు అందడంలో కీలక పాత్ర ఉంటుంది. అందుకే ఈ పదవికి అధిక ప్రాధాన్యత ఉంది.మరోవైపు పదవి కోసం మరికొందరు నాయకులు కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నాయకత్వం నుండి గ్రీన్ సిగ్నల్ రాగానే అధికారిక ప్రకటన వెలువడనుంది.ప్రస్తుతం మండల వ్యాప్తంగా "ఇటిక్యాల చైర్మన్ గా మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్?" అనే చర్చ జోరుగా సాగుతోంది.

# శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

● మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి..

● రామాయంపేట ఎమ్మార్వో రజనీకుమారి,

● రామాయంపేట సీఐ సైదా

**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి 9** శాంతి కమిటీ సమావేశంలో అధికారుల సూచనలు రామాయంపేట: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, సురక్షితంగా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు. రామాయంపేట కళ్యాణ శుభ వేదికలో గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రామాయంపేట ఎమ్మార్వో రజనీకుమారి, రామాయంపేట సీఐ సైదా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

భద్రతకు అధిక ప్రాధాన్యత ఈ సందర్భంగా అధికారులు గణేష్ మండపాల నిర్వాహకులకు ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, భద్రతా





చర్యలను వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని అధికారులు తెలిపారు.

సమన్వయంతో ఉత్సవాలు నిర్వహించాలి





ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు అధికారుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సమన్వయంతో వ్యవహరించాలని అధికారులు కోరారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించి శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రామాయంపేట ఎస్సై బాలరాజు, చిన్నశంకరంపేట ఎస్సై సదానంద, ఎస్సై సృజనతో పాటు ఎక్సైజ్, విద్యుత్, అగ్నిమాపక శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'వైష్ణవి జుం ఛార్జింగ్' (ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్) ను

● శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి BLR

● DCC ప్రధాన కార్యదర్శి, చిలుకూరి బాలకృష్ణ



**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 09**కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు .ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి అనుగుణంగా, ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన ఛార్జింగ్ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కాలుష్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ ఈవి (EV) వాహనాలపై మొగ్గు చూపాలని, ఇలాంటి ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి రావడం వల్ల వాహనదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మిర్యాలగూడ పట్టణం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రజల అవసరాలకు తగ్గట్లుగా ఆధునిక వసతులు రావడం సంతోషదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, BLR బ్రదర్స్, వైష్ణవి EV ఛార్జింగ్ నిర్వాహకులు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

● మాజీ కార్పొరేటర్ బన్నాల గీత

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 9 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ఈరోజు చిల్కానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జిహెచ్ఎం స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆనంద్ కి పలు కాలనీలో బస్తిందో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సిందిగా కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది .

సాయిరాం నగర్ కాలనీలోని పలు సిసి రోడ్లు, ఇందిరానగర్ కాలనీలోని సిసి రోడ్డు ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్ ప్రధాన రహదారి అయిన సిసి రోడ్డు, చిల్కానగర్ బొడ్రాయి ఎదురుగా ఉన్న వీధుల్లో కుమ్మరి కుంట లోనీ రోడ్ నెంబర్ 3 లో సాంక్షన్లు పూర్తి అయిన టెండర్లు పెట్టకుండా కాలయాపన జరుగుతున్నదని వాటికి వెంటనే టెండర్లు పెట్టి సీసీ రోడ్డు పనులను త్వరత గతిన



ప్రారంభించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని వారిని కోరడం జరిగింది. అదేవిధంగా శానిటేషన్ జివిపి పాయింట్ల వద్ద చెత్త చెదారం అలాగే ఉండి పోతున్నాయని ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వెంటనే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని వీలైనంత తొందరగా ఉదయం 9 గంటల లోపే క్లియర్ చేయాల్సిందిగా కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ వీలైనంత తొందరలో పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమం లో ఏఈ వెన్నెల గౌడ్, శానిటేషన్ ఏఈ నీలిమ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి జల్లి మోహన్, కొక్కొండ జగన్, బాలకృష్ణ గౌడ్ మొదలగువారు పాల్గొన్నారు.

# జనం భాషకు జై కొట్టిన కాళోజీ కలం

● మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు



**రాయికల్, సెప్టెంబర్ 09 (ప్రజావాణి):** ప్రజాకవిగా పేరొందిన కాళోజీ నారాయణరావు కలం జనం భాషకు జై కొట్టిందని రాయికల్ మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు అన్నారు. రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు)లో బుధవారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వర శర్మ మాట్లాడుతూ, సామాన్యుడి భాష, యాస ద్వారా సమస్యలపై కాళోజీ గళం విప్పారని అన్నారు. తెలంగాణ ప్రాంత మాండలికాన్ని, యాసను ఉపయోగిస్తూ, బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాషలో పుస్తకాల రచన ఉండాలని కాళోజీ సూచించారని తెలిపారు. "అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి..! అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి" అంటూ అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకారాధ్యుడని సగర్వంగా ప్రకటించి, ఉద్యమమే ఊపిరిగా జీవించిన కాళోజీ నారాయణరావును స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు జీవితంలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాజశేఖర్, ఎ.పద్మ, జి.తరంగిణి, పి.రమేష్, ఎస్.శోభ, ఎం.రమ, సీఆర్పీ కె.రవీందర్, బి.శాంతయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యాల్లో పాల్గొని కాబోయే నూతన వధూవరులు, చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు





**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 09** మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో దామరచర్ల గ్రామానికి చెందిన జీడయ్య కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్ నగర్‌కు చెందిన తెలుకుంట్ల శేఖర్ మనవళ్ల నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కూడా భాస్కర్ రావు హాజరై చిన్నారులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబాల సభ్యులు భాస్కర్ రావు ని సాదరంగా ఆహ్వానించి, ఆయన రాకతో తమ శుభకార్యానికి మరింత ఆనందం కలిగిందని తెలిపారు. కార్యక్రమములో ఎండి.యూసుఫ్, దుర్గంపూడి నారాయణ రెడ్డి,అంగోతు హాతిరాం నాయక్, పలసాని రాంరెడ్డి,సోము సైది రెడ్డి,కందుల నాగిరెడ్డి,హనిమి రెడ్డి,బాలసైదులు,రఫీ,వినోద్ నాయక్ ,ఆయిల వెంకన్న, లింగా నాయక్,బాల నాయక్,వింజం శ్రీధర్,అంజన్ రాజు,షోయబ్, కోలా నాగరాజు తదితరులు ఉన్నారు.

# చలో హైదరాబాద్ TEJAC గజ్వేల్ డివిజన్ ఉద్యోగులు..




**రాయపోల్ సెప్టెంబర్ 09 (ప్రజావాణి)** ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10, గురువారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గజ్వేల్ ఉద్యోగుల ౹జుజీూజ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో గజ్వేల్ ఉద్యోగుల జీూజ ఆధ్వర్యంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ, ఉద్యోగుల భాగస్వామ్యం మరియు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం "చలో హైదరాబాద్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ TNGO అధ్యక్షులు S. రాజశేఖర్ రెడ్డి గారు, ౹NGO గజ్వేల్ కార్యదర్శి .ప్రవీణ్ గారు, కోశాధికారి . భరత్ గారు, ౹చీ+ూ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు . వెంకట్ గారు, సిద్ధిపేట కలెక్టరేట్ యూనిట్ ఉపాధ్యక్షులు .మధుకర్ గారు, TNGO గజ్వేల్ జాయింట్ సెక్రటరీ . జీ. సతీష్ కుమార్ గారు, TNGO గజ్వేల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ .R. భానుకుమార్ తెలంగాణ పబ్లిక్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్3194INTUC గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు ఆదిమూలం నారాయణ, ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పారామెడికల్ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తూ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రధాన డిమాండ్లు:

(1)PRC అమలు చేయాలి
(2)పెండింగ్‌లో ఉన్న 6 ణూలను వెంటనే విడుదల చేయాలి
(3)CPS స్థానంలో ౹ూూను అమలు చేయాలి
(4)EHSను సమర్థవంతంగా అమలు చేయాలి
(5)317 GOకు సంబంధించిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఉద్యోగులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి ఉద్యోగుల హక్కులు, సంక్షేమం మరియు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గజ్వేల్ ఉద్యోగుల ౹జుజీూజ ,సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ నోటీసులపై ధ్రువపత్రాల సేకరణ

- 92 మందికి ఎస్ఐఆర్ ఫామ్‌లో నోటీసులు
- ధ్రువపత్రాల సేకరణ ప్రారంభం
- జూనియర్ అసిస్టెంట్ సీహెచ్.కమలాకర్
- బీఎల్ఓ సూపర్‌వైజర్, కే.సాయికుమార్, బీఎల్ఓ సిఎచ్.సంధ్య
- 21లోగా ధ్రువపత్రాలు సమర్పించాలి



**కొమురంభీమ్, సెప్టెంబర్ 9,( ప్రజావాణి) సిర్పూర్(టి):** పారిగాం గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ఐఆర్ ఫామ్‌లో నోటీసులు అందుకున్న 92 మంది నుంచి సంబంధిత ధ్రువపత్రాల సేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన పత్రాలను జూనియర్ అసిస్టెంట్ సీహెచ్. కమలాకర్, బీఎల్ఓ సూపర్‌వైజర్ కే.సాయికుమార్, బీఎల్ఓ సిఎచ్,సంధ్య స్వీకరిస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ఆలస్యం చేయకుండా ఈ నెల 21లోగా అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండగూర్లే కొండయ్య, చౌదరి కుషాబ్ రావు ఉన్నారు.

# వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

● నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలి:
● డీసీపీ బి. రామ్‌రెడ్డి





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 9:** రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని డీసెంట్ ఫంక్షన్ హాల్‌లో వినాయక ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ బి. రామ్‌రెడ్డి, పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్ తదితరులు ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలని, ఇతర శాఖల నుంచి పొందాల్సిన అనుమతులు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణ, మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో సంబంధిత శాఖల సూచనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా మార్గం అందుబాటులో ఉంచాలని సూచించారు. డీజేలు, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్ వినియోగం, అసభ్యకర కార్యక్రమాలు, మద్యం సేవించి గందరగోళం సృష్టించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని డీసీపీ హెచ్చరించారు. వినాయక ఉత్సవాలు భక్తి, సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకోవాలని కోరారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే నిర్వాహకులు స్వయంగా స్పందించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలా సహకరిస్తామని డీసీపీ బి. రామ్‌రెడ్డి తెలిపారు.

ఈ సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు నరేష్, మధుకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

● బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 9 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా, వివిధ డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్ చేసిన తప్పుడు చిత్రాలు, ఏఐ ద్వారా రూపొందించిన ఫేక్ ఇమేజ్‌లు, దుష్ప్రచార కంటెంట్‌ను ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరఫున ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి లు తెలంగాణ డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ మురళీధర్ భగవత్ కి ఫిర్యాదు అందజేశారు. రెండు రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి, దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఉద్దేశపూర్వకంగా ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫేక్ లేదా ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడమే కాకుండా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది.

సైబర్ ఫోరెన్సిక్ దర్యాప్తు చేయాలి

ఫేక్, మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలు, పోస్టులను సైబర్ క్రైమ్ విభాగం వెంటనే గుర్తించి దర్యాప్తు చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కంటెంట్‌ను రూపొందించిన, అప్‌లోడ్ చేసిన, ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించాలని, సంబంధిత చిత్రాలపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత డిజిటల్ ఆధారాలు, సోషల్ మీడియా అకౌంట్ వివరాలు, ఖ=ాలు, టైమ్‌స్టాంప్‌లు, మెటాడేటాను భద్రపరచాలని కోరారు. సైబర్ క్రైమ్, పరువునష్టం, తప్పుడు సమాచార ప్రచారం తదితర వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

ఫేక్, మార్ఫింగ్ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకుని ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం పేర్కొంది. రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేసి ప్రచారం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది.

అసెంబ్లీ ఘటనపైనా చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై కూడా సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం కోరింది. సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేసింది. మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాతంగా, అత్యవసరంగా దర్యాప్తు నిర్వహించి, ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను రూపొందించి ప్రచారం చేసిన వారితో పాటు అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డీజీపీని కోరారు.

# దళితులపై దొర అహంకారం చూపించారు

● కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు పూర్తిగా దళిత వ్యతిరేకులు
● పసుపు నీళ్లు చల్లించి దళితులను అవమానించారు: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగునూరు,సెప్టెంబర్ 9 (ప్రజావాణి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌లు దళిత వ్యతిరేక వైఖరిని మరోసారి బయటపెట్టుకున్నారని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తీవ్రంగా విమర్శించారు. అధికారం ఉందనే అహంకారంతో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో దళితులకు జరిగిన అవమానాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని పేర్కొన్నారు.

నేరెళ్ల ఘటనను మర్చిపోలేం

నేరెళ్ల ఘటనలో దళిత సోదరులపై పోలీసుల చర్యలు తీవ్ర చర్చకు దారితీశాయని యాదగిరి గుర్తుచేశారు. దళితుల బాధను అర్థం చేసుకోవాల్సిన అప్పటి పాలకులే వారి పట్ల కఠినంగా వ్యవహరించారని ఆరోపించారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై అప్పట్లోనే అనేక విమర్శలు వచ్చాయని అన్నారు.

సొంత పార్టీ నేతలకే గౌరవం దక్కలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళిత సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ప్రజాప్రతినిధులకు కూడా తగిన గౌరవం దక్కలేదని యాదగిరి ఆరోపించారు. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న తదితర నాయకులను వివిధ సందర్భాల్లో అవమానించేలా వ్యవహరించారని విమర్శించారు. ఇది కేవలం వ్యక్తుల సమస్య కాదని, దళిత నాయకత్వాన్ని చిన్నచూపు చూసే మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు.

దళిత స్పీకర్‌ను అవమానించడం బాధాకరం

అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని యాదగిరి అన్నారు. అసెంబ్లీ ప్రజాస్వామ్యానికి ప్రతీక అని, అక్కడ ప్రతి సభ్యుడు పరస్పర గౌరవంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే దళిత సమాజం ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు.

పసుపు నీళ్ల ఘటనపై ఆగ్రహం

ఈ ఘటనకు నిరసనగా దళిత సమాజం ఆవేదన వ్యక్తం చేసిన కొద్దిసేపటికే పసుపు నీళ్లు చల్లిన ఘటన చోటుచేసుకోవడం మరింత బాధాకరమని యాదగిరి అన్నారు. దళితులను అవమానించే విధంగా ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. పసుపు నీళ్లు చల్లడం ద్వారా దొర అహంకారం, అంటరానితనపు మనస్తత్వాన్ని బయటపెట్టుకున్నారని తీవ్రంగా ఆరోపించారు.

దళితుల ఆత్మగౌరవమే ముఖ్యం

రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని యాదగిరి గుర్తుచేశారు. కులం, మతం, ప్రాంతం ఆధారంగా ఎవరినీ అవమానించకూడదన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. దళితులకు ఇచ్చిన హామీలు, గత ప్రభుత్వ నిర్ణయాలు, దళితులపై జరిగిన ఘటనలను ప్రజలు పరిశీలిస్తున్నారని యాదగిరి పేర్కొన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, అదే దళితులను అవమానించే రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. బీఆర్ఎస్ గత పాలనపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. దళితుల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని టీపీసీసీ కార్యదర్శి, నంగునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విక్రం రెడ్డి, బాగు శ్రీకాంత్ యాదవ్, నాగరాజ్ పల్లి బాలయ్య, రవి బస్వారాజు రాములు, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు




**ప్రజావాణి సెప్టెంబర్ 9** కమలాపూర్ మండల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో NSS ఆధ్వర్యంలో ప్రముఖ కవి రచయిత తెలంగాణ ప్రజా కవి కాళోజీ నారాయణరావు గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ జి కుమార్ గారు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు గారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాలేజీ నారాయణరావు గారు తన రచనలు కవితలు మరియు ప్రజా ఉద్యమాల ద్వారా సమాజంలో చైతన్యాన్ని తీసుకువచ్చారని అన్నారు తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనల ద్వారా నిర్భయంగా వ్యక్తపరిచిన గొప్ప ప్రజాకవిగా కాళోజి చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు NSS po ఏ జ్యోతి మాట్లాడుతూ కాళోజి గారి సాహిత్యం యువతలో సామాజిక బాధ్యత ప్రజాస్వామ్యం విలువలు మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని సమాజసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు చివరగా కళాశాల తెలుగు అధ్యాపకులు శ్రీమతి శోభ గారు కాళోజి నారాయణరావు గారి సాహిత్యం గురించి వివరించారు కాలోజీ రచనల్లో ప్రజల జీవన విధానం సామాజిక సమస్యలు తెలంగాణ భాష సంస్కృతి ప్రతిబింబిస్తాయని తెలిపారు కాలోజీ సాహిత్యం ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించిందని ఈ సందర్భంగా కళాశాల NSS తరపున తెలుగు అధ్యాపకురాలు శ్రీమతి శోభా గారిని ఘనంగా సన్మానించి ఆరు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఆమెను సత్కరించారు కార్యక్రమంలో NSS ప్రోగ్రాం ఆఫీసర్ ఏ జ్యోతి కళాశాల అధ్యాపకురాలు రజిత కవిత శారద చంద్రశేఖర్ సరోజ కుమారస్వామి యామిని సురేష్ లైబ్రేరియన్ జనార్ధన్ బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎస్. టి. కమిషన్ చైర్మన్

**అనంతపురం బ్యూరో సెప్టెంబరు:9 ప్రజా వాణి** రాష్ట్రంలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించ డమే ఎస్. టి. కమిషన్ ముఖ్య లక్ష్యం అని ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి తెలిపారు. జిల్లా పర్యటన భాగంగా స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను పర్యటిస్తూ తండాలలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు కమిషన్ చైర్మన్ తెలిపారు. నిన్నటి రోజున శ్రీ సత్య సాయి జిల్లా లోని కదిరి ,నల్లచెరువు, ముదిగుబ్బ మండలాల్లో పర్యటించడం జరిగిందని ముఖ్యంగా తండావాసులు ఆయా తాండాలలో తాగునీటి సౌకర్యాలు తక్కువగా ఉన్నాయని బోర్లు వేసిన కూడా భూగర్భ జలాలు అడుగంటి పోయినందున నీటి కొరత ఏర్పడుతుందని అలాగే తమ కాలనీలకు రోడ్డు తదితర మౌలిక సదుపాయాలు సరిగా లేవని తమ దృష్టికి విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ట్యాంకర్ల రూపంలో తాత్కాలికంగా చర్యలు తీసుకొని నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నట్టు తెలిపారు. అలాగే ఎల్ నినో వర్ష బావ పరిస్థితుల వల్ల సకాలంలో వర్షాలు లేక రైతులు పెట్టిన పంటలు చేతికి అందక తీర నష్టం జరుగుతుందని అందువల్ల రైతులను కూలీలను ఆదుకోవాలని కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు.



వారు కోరుతున్నట్లు ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ గా తాను సమస్యలను పరిశీలించి పై విషయాలపై స్పందిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంతేగాక భూ వివాద సమస్యలు కూడా ఉన్నాయని, పట్టాల మంజూరులో పలు నిరు పేద గిరిజన కుటుంబాలకు అన్యాయం జరిగినట్లు తమ దృష్టికి ఫిర్యాదులు వచ్చాయని, గిరిజన ఆశ్రమ పాఠశాలలో కూడా మౌలిక సదుపాయాలు కల్పించాలని, గిరిజన ప్రజలకు సంబంధించి స్మశాన వాటికలు కూడా లేవని, అక్రమ కేసులు రద్దు చేయాలని తదితర ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు.ముఖ్యంగా కమిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టిని సారించి గిరిజన ప్రజలు ఎదుర్కొంట్రా సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు సక్రమంగా వినియోగంలోకి రావాలని ఈ విషయంలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని అలాగే అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేయాలని ఎస్టి కమిషన్ చైర్మన్ సూచించారు. కమిటీ సభ్యులు పి. వెంకటప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్టీ కమిషన్ ద్వారా క్షేత్రస్థాయిలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయా పథకాలు అర్హులకు అందుతున్నాయా లేదా అదే అంశాలను పరిశీలిస్తోందని తెలిపారు.ప్రభుత్వ శాఖ అధికారులు కూడా అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా అర్హులకు అన్యాయం జరిగినట్లు రుజువైతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన విద్యా సంస్థల నిర్వహణ, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సభ్యులు కె. మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో పేద గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఆయా సమస్యల పై తక్షణమే స్పందించి ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో ప్రేమాశీథ్ కుమార్, డి టి డబ్ల్యూ శ్రీనివాసరావు, అర్బన్ తాసిల్దార్ డి .రాజా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తేజ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి గిరిజన ప్రజల నుండి పలు సమస్యలతో కూడినఅర్జీలను కమిషన్ బృందం స్వీకరించింది.

# తెలంగాణ యాస.. సంస్కృతికి విద్యార్థుల నీరాజనం

- శ్రీ చైతన్య టాలెంట్ స్కూల్‌లో ఘనంగా భాషా దినోత్సవ వేడుకలు



**కోదాడ, సెప్టెంబర్ 9 (ప్రజావాణి):** తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థుల కు తెలియజేసే లక్ష్యంతో కోదాడలోని శ్రీనగర్ కాలనీ శ్రీ చైతన్య టాలెంట్ స్కూల్‌లో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వివిధ రకాల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఆర్ఐ దండా వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు కోలా రామదాసు, జోనల్ ఇన్‌చార్జ్ ఝాన్సీ, వైస్ ప్రిన్సిపల్ సుమలత, డీన్ ఏడుకొండలు, ప్రైమరీ ఇన్‌చార్జ్ రాణి పాల్గొన్నారు. అలాగే తెలుగు ఉపాధ్యాయులు టి. నరేష్, కే. లక్ష్మి, రాధిక, ఇందిర పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ భాష, సంస్కృతిని భావితరాలకు అందించడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థుల్లో తెలంగాణ భాషపై అభిమానం, సంస్కృతిపై అవగాహన, సంప్రదాయాలపై గౌరవాన్ని పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. "తెలంగాణ భాష మన గర్వం.. తెలంగాణ సంస్కృతి మన వారసత్వం" అనే సందేశంతో వేడుకలు ఉత్సాహభరితంగా ముగిశాయి.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు..! వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలి..!

- శ్రీ సత్యసాయి జిల్లాలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం
- మున్సిపల్, పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని పిలుపు.
- కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలు తీవ్రంగా విసిగిపోయారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన.
- ప్రజా సమస్యలపై పోరాడితే కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి
- "ప్రజల గొంతుకై పోరాడటం మన హక్కు.. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల కోసం మా పోరాటం ఆగదు" అని ఉద్ఘాటన.
- రాప్తాడు నియోజకవర్గంలో బోర్లు ఎండిపోవడం, సాగునీరు లేక పంటలు ఎండిపోవడం, చెట్లు కొట్టే పరిస్థితి రావడంపై ఆందోళన





**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 09 ప్రజా వాణి** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సమాయత్తం చేయడమే లక్ష్యంగా శ్రీ సత్యసాయి జిల్లాలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి , శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. "ఈరోజు కార్యకర్తలను ఎన్నికల పోరాటానికి సిద్ధం చేయడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం" అని తెలిపారు. అతి త్వరలో మున్సిపల్ ఎన్నికలు, అనంతరం పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ విధానాలను, ప్రజా సమస్యలపై పార్టీ చేస్తున్న పోరాటాన్ని బలంగా వివరించాలని పిలుపునిచ్చారు. జగన్ అన్న ముఖ్యమంత్రి కావడానికి కాబోయే ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు రథసారథులుగా నిలుస్తారు. ఈరోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఈ రాష్ట్రంలో ముందుండి నడిపించే గొప్ప అవకాశం మీకు వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని, పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కరువు, సాగునీరు, విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా రాప్తాడు నియోజక వర్గంలో వేలాది బోర్లు ఎండిపోతున్నాయని, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల కోసం పోరాడితే కేసులు పెట్టారు. మా ముగ్గురు బ్రదర్స్‌పై 18 కేసులు పెట్టినా మేము వెనక్కి తగ్గలేదు. కేసులు పెట్టినంత మాత్రాన ప్రజల్లో తిరగడం ఆపలేదు.. మా గొంతు వినిపించడం ఆపలేదు. ప్రజల తరపున ప్రశ్నించడం మా హక్కు" అని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి అత్యంత కీలకమైనవని, జగన్ అన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు కాబోయే ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు రథసారథులుగా నిలిచి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. "ఎన్ని అడ్డంకులు వచ్చినా.. ఎన్ని కేసులు పెట్టినా.. ప్రజల కోసం మా పోరాటం ఆగదు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ ముట్టడికి ముందే మాజీ సర్పంచ్ భర్త అరెస్ట్



**చెన్నారావుపేట సెప్టెంబర్ 09 ప్రజావాణి** మాజి సర్పంచ్ ల పాత బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన గురిజాల మాజీ సర్పంచ్ గొడిశాల మమత భర్త సదానందం గౌడ్ ను చెన్నారావుపేట పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న వారిని మంగళవారం రాత్రి చెన్నారావుపేట పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిపారు. గతంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన నిరసనను ముందస్తు అరెస్టులతో అడ్డుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచులకు రావాల్సిన పాత బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి వారి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ ముందస్తు అరెస్టు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పెనుమూరులో పోలీసుల విస్తృత ఫుట్ పెట్రోలింగ్

- ప్రజలకు భద్రతపై భరోసా.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం




**పెనుమూరు( ప్రజావాణి ప్రతినిధి)సెప్టెంబర్ 9** పెనుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేసేందుకు పోలీసులు పట్టణంలో విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. పెనుమూరు పట్టణంలోని ప్రధాన వీధులు, రద్దీ ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో పోలీసులు కాలినడకన తిరుగుతూ పరిస్థితులను పరిశీలించారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచారు. పట్టణంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడటంతో పాటు, ప్రజలకు పోలీసుల భద్రతా చర్యలపై నమ్మకం కల్పించడమే ఫుట్ పెట్రోలింగ్ ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అనుమానాస్పద విషయాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు

# 183 ప్రజా సమస్యలు..15 రోజుల్లో పరిష్కారం!

- ప్రజల వద్దకే అధికారులు.. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక
- దత్తత గ్రామాల్లో దశరథ జనార్దన్ వినూత్న కార్యక్రమం

**వత్సవాయి సెప్టెంబర్ 09 మన ప్రజావాణి** " ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాదు.. పరిష్కారం చూపేవరకు ప్రజల వెంటే ఉంటాం " అనే లక్ష్యంతో దత్తత గ్రామాలైన గంగవల్లి, పోచవరం గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ మరియు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ శ్రీ తొండపు దశరథ జనార్దన్ ప్రత్యేకంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహించారు." ఇంటింటికీ తెలుగుదేశం " కార్యక్రమంలో భాగంగా గంగవల్లి, పోచవరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను స్వయంగా కలుసుకున్న సందర్భంగా వారి నుంచి 183 సమస్యలు, విజ్ఞప్తులు అందాయి.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్న దశరథ జనార్దన్ వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారుల సమక్షంలో ప్రత్యేక ప్రజా వేదిక ఏర్పాటు చేసి ప్రతి



సమస్యను శాఖల వారీగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

15 రోజుల్లో పరిష్కరించాలి

ప్రజల నుంచి వచ్చిన 183 సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా, ప్రతి సమస్యపై 15 రోజుల లోపు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను దశరథ జనార్దన్ ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా అధికారులతో సమన్వయం చేస్తూ నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకోవడం.. అధికారులను ప్రజల వద్దకు




తీసుకురావడం.. పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యతగా, అభివృద్ధి-- సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేస్తామని దశరథ జనార్దన్ స్పష్టం చేశారు." ప్రజల సమస్యే మా సమస్య.. ప్రజల పరిష్కారమే మా లక్ష్యం" అని ఆయన అన్నారు.

ప్రజల కోసం.. ప్రజల మధ్యలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం! ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎంపీడీవో అగ్రికల్చర్ ఏవో మరియు సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు

# యశోధర తల్లి పిల్లల హాస్పిటల్ భవనంపై మున్సిపల్ అనుమతుల పరిశీలనకు ఫిర్యాదు



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 9 మన ప్రజావాణి** జగ్గయ్యపేట పట్టణంలోని D.No.6-108లో నిర్వహిస్తున్న "యశోధర తల్లి పిల్లల హాస్పిటల్" భవనానికి సంబంధించిన మున్సిపల్ అనుమతులు, భవన నిర్మాణ నిబంధనలు, భవన వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా పరిశీలన చేయాలని కోరుతూ జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. సదరు భవనం ఏ ప్రయోజనం కోసం నిర్మించబడింది? ప్రస్తుతం హాస్పిటల్ నిర్వహణకు అవసరమైన బిల్డింగ్ పర్మిషన్, అప్రూవ్డ్ ప్లాన్, ఆక్యుపెన్సీ అనుమతి, భవన వినియోగ మార్పుకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై స్పష్టత కోసం అధికారులను కోరినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. అలాగే భవనం ఆమోదిత ప్లాన్‌కు అనుగుణంగా ఉందా? సెట్‌బ్యాక్, పార్కింగ్, అదనపు నిర్మాణాలు, గదులు, షెడ్లు తదితర నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను టౌన్ ప్లానింగ్ అధికారులు స్థల పరిశీలన ద్వారా నిర్ధారించాలని కోరారు. రికార్డులు పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలి. హాస్పిటల్ నిర్వహణపై ముందస్తుగా ఎలాంటి ఆరోపణలు చేయడం తమ ఉద్దేశం కాదని, మున్సిపల్ రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవ పరిస్థితిని అధికారులు వెల్లడించాలని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. భవన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు లేదా వినియోగం ఉన్నట్లు అధికారుల తనిఖీలో తేలితే, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు ఈ అంశంపై పారదర్శకంగా విచారణ నిర్వహించి, తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# రంపచోడవరం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష గారి కృషితో సీతాపురం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయానికి ఐదు విద్యుత్ స్తంభాలతో నూతన లైన్ మంజూరు ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపిన సీతాపురం గ్రామస్తులు 9వ వార్డు ప్రజలు





**ప్రజావాణి ప్రతినిధి ఎటపాక మండలం సెప్టెంబర్ 9** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ ఎటపాక మండలం త్రిపురపెంటవీడు పంచాయితీ సీతాపురం గ్రామంలో ఎంతో మహిమ కలిగిన ముత్యాలమ్మ తల్లి ఆలయానికి కొన్ని సంవత్సరాలు నుండి ఆలయానికి విద్యుత్తు సదుపాయం లేకపోవడం తో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలు ఈ విషయాన్ని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు కి తెలుపగా వెంటనే ఎమ్మెల్యే గారి దృష్టి కి తీసుకు వెళ్ళగానే ఎమ్మెల్యే గారు స్పందించి విద్యుత్ అధికారుల ను ఆదేశించడంతో నెల్లిపాక ఏఈ సూరిబాబు గారు ఈరోజు తమ విద్యుత్ సిబ్బందితో ఐదు నూతన స్తంభాలు ఏర్పాటు చేసి కొత్త లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా భక్తుల మనోభావాలతో కూడిన ఈ సమస్య ఈరోజు పరిష్కారం అవగానే గ్రామస్తులు ఎమ్మెల్యే శిరీషాదేవి గారికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. వల్లభనేని చందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఏ సమస్య అయినా రంపచోడవరం నియోజవర్గ ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లగానే ప్రతి సమస్యని తన సమస్యగా తీసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు ఎమ్మెల్యే గారి కీ చందు కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో జనసేన ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ , గ్రామ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి సతీష్, 9 వ వార్డు మెంబర్ నాచు శ్రీను, స్థానిక నాయకులు మర్లపాటి రాజు,లింగాల వెంకన్న,పునుగుపాటి అప్పారావు, చల్లగురుగుల శ్రీను, చంటి,ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు ,గ్రామస్తులు ,విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి



**అనంత పురం సెప్టెంబర్ 9 09 ప్రజా వాణి** రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా, పామిడి మండలం, పాల్యం తండాలో గిరిజన ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని గిరిజన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ తో పాటు ఎస్టి కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, కె మల్లేశ్వరరావు లు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భం గా పాల్యం తాండ గిరిజన ప్రజలు ఎస్టి కమిషన్ చైర్మన్ కు పలులి సమస్యలు వివరిస్తూ వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తప్పక పరిష్కరిస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి తండా ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ షర్మిల, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్, ఎస్టీ నాయకులు, గిరిజన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేయరు మాయాజాలం..

## సామాన్యుడికి అన్యాయం? భూమి హద్దుల కొలతల్లో వ్యత్యాసాలపై రైతు ఆవేదన.. 17 గుంటలు తక్కువ అన్న అధికారులు, 36 గుంటల మేర మార్కింగ్‌పై అభ్యంతరం కలెక్టర్ జోక్యం చేసుకుని రీ-సర్వే చేయాలని బాధిత రైతు విజ్ఞప్తి






**సిద్దిపేట, సెప్టెంబర్ 9:** భూమి కొలతలు, హద్దుల నిర్ధారణలో చోటుచేసుకున్న వ్యత్యాసాల కారణంగా తనకు అన్యాయం జరుగుతోందని ఓ రైతు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం అంక్షీపూర్ గ్రామానికి చెందిన భూసిరెడ్డి రుక్మమ్మ భర్త కీర్తిశేషులు భూసిరెడ్డి మల్లారెడ్డి తమ భూమికి సంబంధించి సమగ్ర రీ-సర్వే నిర్వహించి న్యాయం చేయాలని కోరుతూ సెప్టెంబర్ 8న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. అంక్షీపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 40లో తమకు, తన కుమార్తెకు కలిపి 10 ఎకరాల 11 గుంటల భూమి ఉన్నట్లు రుక్మమ్మ తెలిపారు. గతంలో నంగునూర్ మండల సర్వేయర్ ద్వారా భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసుకున్నామని, అయితే తాను కొంతకాలం కుమార్తె వద్దకు వెళ్లిన సమయంలో పక్క భూముల యజమానులు హద్దు రాళ్లను తొలగించారని ఆమె ఆరోపించారు. ఈ విషయంపై 13-01-2026న సిద్దిపేట ాణ (ాబటీజవఏ ఢ ఘఋఅ =వఏశీటీఏం)కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం తమకు, సంబంధిత వ్యక్తులకు 23-04-2026 నుంచి 28-08-2026 వరకు మొత్తం తొమ్మిది సార్లు నోటీసులు జారీ అయినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

అయితే నోటీసులు జారీ చేసినప్పటికీ సంబంధిత పక్క భూముల యజమానులు అన్ని సందర్భాల్లో హాజరు కాలేదని, ఫీల్డ్‌కు వచ్చిన సర్వేయర్‌ను అడ్డుకున్న ఘటన కూడా జరిగిందని రుక్మమ్మ ఆరోపించారు. దీంతో ాణ అధికారులు ఇద్దరు సర్వేయర్లను ఫీల్డ్‌కు పంపినట్లు తెలిపారు.



07-09-2026న సర్వేయర్లు భూమి హద్దులు నిర్ణయించే సమయంలో సర్వే నంబర్ 40లో సుమారు 17 గుంటల భూమి తక్కువగా వస్తోందని చెప్పారని, అయితే వారు చూపించిన హద్దుల ఆధారంగా ప్రైవేట్ సర్వేయర్‌తో పరిశీలించగా 36 గుంటల మేర భూమి తక్కువగా చూపుతున్నట్లు తనకు అనిపించిందని రుక్మమ్మ పేర్కొన్నారు. దీంతో అధికారుల కొలతలు, చూపించిన హద్దులు, వాస్తవ భూమి విస్తీర్ణంపై స్పష్టత లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు.

**రీ-సర్వే చేసి న్యాయం చేయాలి**

సర్వేయర్లు సమర్పించిన నివేదికలో స్పష్టత లేకపోవడం, భూమి హద్దుల్లో వ్యత్యాసాలు ఉండటంతో తనకు నష్టం జరుగుతోందని రుక్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల రికార్డులు, పాత సర్వే వివరాలు, పట్టా పాస్‌బుక్ తదితర ఆధారాలను సమగ్రంగా పరిశీలించి, మరోసారి నిష్పక్షపాతంగా రీ-సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

భూమి విషయంలో చిన్నపాటి కొలతల వ్యత్యాసం కూడా రైతు కుటుంబానికి పెద్ద నష్టంగా మారే అవకాశం ఉన్నందున, సంబంధిత అధికారులు పారదర్శకంగా వ్యవహరించి వాస్తవ హద్దులను నిర్ధారించాలని స్థానికంగా కూడా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్ 40లో భూమి విస్తీర్ణం, హద్దులపై తలెత్తిన వివాదానికి అధికారిక రీ-సర్వే ద్వారా తెరదించి, బాధిత రైతుకు న్యాయం చేయాలని రుక్మమ్మ కోరుతున్నారు.

"సర్వేయరు మాయాజాలం.. సామాన్యుడికి అన్యాయం?" కొలతల్లో స్పష్టత లేకపోతే.. రైతుకు న్యాయం ఎలా?




# ఫిల్మోగ్రఫీలో అందమైన చిత్రంగా 'ఎపిక్'

బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్‌తో సంచలనం సృష్టించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "90ం సిరీస్ చూసినప్పుడే, దర్శకుడు ఆదిత్యతో సినిమా చేయాలనిపించింది. తరుణ్ భాస్కర్ మొదటి సినిమా కోసం ఎలా ఎదురుచూశానో, ఆదిత్య డెబ్యూ కోసం కూడా అలాగే ఎదురుచూశాను. అలాంటి దర్శకుడి మొదటి సినిమాలో నటించే అవకాశం ఆనంద్‌కు రావడం అదృష్టం. తన సినిమాల ఎంపిక చూస్తే గర్వంగా ఉంటుంది. 'ఎపిక్' చిత్రం ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఒక అందమైన సినిమాగా నిలుస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. తెలుగు సినిమా ఈ ఏడాది అద్భుతంగా రాణిస్తోందని, 'ఎపిక్' తో మొదలుపెట్టి వరుస బ్లాక్‌బస్టర్లు చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, "ఆనంద్ ఐటీ జాబ్ చేసే రోజుల్లోనే సినిమాలపై తనకున్న పిచ్చి చూసి ఆశ్చర్యపోయాను. ఏ పాత్రలోనైనా సహజంగా ఒదిగిపోతాడు. దర్శకుడు ఆదిత్య రచనలో ఎంతో అనుభవం కనిపిస్తుంది. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని నెగెటివ్ కామెంట్స్‌పై నిర్మాత నాగవంశీ, దర్శకుడు ఆదిత్య హాసన్ స్పందించారు. "నిజ జీవితంలో ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో అదే స్వచ్ఛంగా చూపించాం. ఇది కుటుంబంతో కలిసి హాయిగా చూసే సినిమా. ఇందులో అశ్లీలతకు తావులేదు" అని నాగవంశీ స్పష్టం చేశారు. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్య హాసన్ భరోసా ఇచ్చారు.

హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, "ఇది మనందరి కథ. ట్విస్టులు, రక్తపాతాలు లేకుండా సహజంగా సాగే ప్రేమకథ. అన్నయ్య విజయ్, సందీప్ రెడ్డి గారు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య తన 'కదలి' పాత్ర ద్వారా ఎంతో నేర్చుకున్నానని, సందీప్ రెడ్డి సినిమాలో ఉండే హీరోయిన్ లాంటి బలమైన పాత్ర ఇదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. 'ఎపిక్' సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుండగా, సెప్టెంబర్ 10న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# "ఒక్క మెతుకు పొలిమేర దాటదు"..

## 'రణబాలి'గా గర్జించిన విజయ్ దేవరకొండ..



రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది. టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో 'అన్నపూర్ణ దేశం' ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా" అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి. 1854-1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876-78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. "సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు" వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో 'రణబాలి' ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# నాల్గవ హీరోను పరిచయం చేయనున్న శ్రీలీల..!



శ్రీలీల గత ఏడాది మూడు సినిమాలతో వచ్చింది. అందులో జూనియర్ కాస్త పర్వాలేదు అనిపించినా మిగిలిన సినిమాలు ఆమెకు తీవ్రంగా నిరాశను మిగిల్చాయి. దాంతో శ్రీలీల పని అయిపోయిందని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేశారు. ఈ ఏడాది ఆరంభంలో పరాశక్తితోనూ ఫ్లాప్‌ను చవిచూసిన శ్రీలీలకి ఉస్తాద్ భగత్ సింగ్‌తో కాస్త ఊరట దక్కిందని చెప్పాలి. ప్రస్తుతం టాలీవుడ్‌లో శ్రీలీల చేస్తున్న సినిమాలు ఏంటి అంటే ఠక్కున చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆమె ఒకటి రెండు సినిమాలకు పరిశీలిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఆమె సినిమాను కన్ఫర్మ్ చేయలేదు. మరో వైపు బాలీవుడ్‌లో అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాలో హీరోగా కార్తీక్ ఆర్యన్ నటిస్తున్నాడు. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఈ సమయంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా వశిష్ట దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు తాజాగా ఆమెతో చర్చలు జరిపారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బాలకృష్ణ సూచన మేరకు మోక్షజ్ఞకు జోడీగా శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మోక్షజ్ఞ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయిన విషయం తెల్సిందే. దాంతో హీరోయిన్ ను సైతం అదే స్థాయిలో బాలీవుడ్ నుంచి దించుతారని అంతా భావించారు. కానీ బాలకృష్ణ ఈ సినిమా కోసం శ్రీలీల అయితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో దర్శకుడు వశిష్ట లుక్ టెస్ట్‌కి రెడీ అయ్యాడని తెలుస్తోంది. మోక్షజ్ఞ, శ్రీలీలపై లుక్ టెస్ట్ చేయడంతో పాటు, కొన్ని సీన్స్ సైతం షూట్ చేసి పరిశీలించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. మోక్షజ్ఞ మొదటి సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తే అరుదైన రికార్డ్ ఆమె సొంతం అవుతుంది. ఇప్పటి వరకు ముగ్గురు హీరోలను శ్రీలీల ఇండస్ట్రీకి పరిచయం చేసింది. కన్నడ హీరో విరాట్ మొదటి సినిమా 'కిస్'. ఆ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల నటించింది. కిస్ హీరో విరాట్ కి, శ్రీలీలకు మొదటి సినిమా కావడం విశేషం. ఆ తర్వాత రోషన్ మేకా హీరోగా పరిచయం అయిన 'పెళ్లి సందడి' సినిమాలోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. టాలీవుడ్‌లో శ్రీలీలకు అదే మొదటి సినిమా. రోషన్ మేకా మొదటి సినిమాకు శ్రీలీల సరైన జోడీ అనే అభిప్రాయంతో రాఘవేంద్ర రావు ఆమెను ఏరికోరి ఎంపిక చేశాడని అంటారు. ఆ తర్వాత కన్నడం నుంచి వచ్చిన కిరీటి రెడ్డి మొదటి సినిమా 'జూనియర్' లోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఈ ముగ్గురు హీరోల మొదటి సినిమాల్లో శ్రీలీల హీరోగా నటించడం జరిగింది.

# మహేంద్రగిరి వారాహిని మురారితో పోల్చొద్దు: సుమంత్

డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన మహేంద్రగిరి వారాహి మూవీపై హీరో సుమంత్ ఫుల్ నమ్మకంతో ఉన్నారు. సినిమా ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇస్తుందని తెలిపారు. సుమంత్, ఐశ్వర్య రాజేష్ లీడ్ రోల్స్ నటించిన ఆ సినిమాకు సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ నిర్మించగా, సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే తాజాగా ప్రమోషన్స్ లో భాగంగా సుమంత్ మీడియాతో మాట్లాడారు. మహేంద్రగిరి వారాహి తన కెరీర్ లో ఇటీవల వచ్చిన పెద్ద బడ్జెట్ సినిమాల్లో ఒకటని చెప్పారు. నిర్మాతలు మూవీని భారీ స్థాయిలో నిర్మించారని తెలిపారు. తెలుగు మాత్రమే కాకుండా హిందీ, తమిళ భాషల్లో కూడా రిలీజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చిందని, ప్రేక్షకుల రెస్పాన్స్ చూసి సినిమాపై నమ్మకం మరింత పెరిగిందని అన్నారు దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కథను సింగిల్ సిట్టింగ్ లో చెప్పారని సుమంత్ తెలిపారు.



కథ మొత్తం తనకు నచ్చిందన్న ఆయన.. ముఖ్యంగా ఇంటర్వెల్, ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు ఓ రేంజ్ లో నచ్చుతాయని అంచనా వేశారు. పురాణాలపై దర్శకుడికి మంచి అవగాహన ఉందని, అందుకే కథను ఆయన అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసించారు. వీఎఫ్ఎక్స్, క్యాస్టింగ్, యాక్షన్, థియేట్రికల్ ఎక్స్పీరియన్స్.. ఇలా అన్నీ సినిమాకు కలిసొచ్చాయని చెప్పారు. సినిమాలో తాను యూట్యూబ్ లో మూఢ నమ్మకాలను ప్రశ్నించే వ్యక్తి పాత్రలో కనిపిస్తానని సుమంత్ వెల్లడించారు. అయితే తన రోల్ కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే చెప్పలేనన్న ఆయన.య డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండటంతో పాటు మంచి ఫ్యామిలీ డ్రామా, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా సినిమాలో ఉన్నాయని చెప్పారు. సిద్దు జొన్నలగడ్డ సినిమాలో సీరియస్ రోల్ లో కనిపిస్తారని రివీల్ చేశారు. తమ మధ్య వచ్చే ఓ సీన్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందని చెప్పారు. ఆ సీన్ చూసిన వారంతా చాలా బాగా వచ్చిందని చెప్పారని, సినిమాలో సిద్దు రోల్ బాగుంటుందని అన్నారు. ఆ రోల్ కు ఓకే చెప్పినందుకు సిద్ధుకు థ్యాంక్స్ చెప్పారు. ట్రైలర్ లో 33 ఏళ్లు దాటిన తర్వాత ఓ వంశానికి చెందిన వ్యక్తులు చనిపోతున్నట్లు చూపించడంతో మురారి సినిమా గుర్తుకొస్తుందని సుమంత్ చెప్పారు. అయితే రెండు సినిమాల స్టోరీ, స్క్రీన్ ప్లే పూర్తిగా వేర్వేరుగా ఉంటాయని క్లారిటీ ఇచ్చారు. మహేంద్రగిరి వారాహి స్పెషల్ స్టోరీతో రూపొందిందన్న సుమంత్.. అనూప్ రూబెన్స్ మ్యూజిక్ సినిమాకు మెయిన్ స్ట్రెంత్ గా నిలుస్తుందని సుమంత్ చెప్పారు. కచ్చితంగా గూస్ బంప్స్ ఎక్స్పీరియన్స్ వస్తుందని అన్నారు. సినిమాలో మూడు మెయిన్ యాక్షన్ ఎపిసోడ్స్ తోపాటు మరికొన్ని యాక్షన్ బ్లాక్స్ ఉంటాయని తెలిపారు. వారాహి టైటిల్ స్టోరీ అనుకున్న సమయంలోనే రిజిస్టర్ చేశామని చెప్పిన ఆయన, పవన్ కల్యాణ్ వారాహి యాత్రతో ఆ పేరు పాపులర్ అయిందని చెప్పుకొచ్చారు.

# 'లస్ట్ స్టోరీస్ 3' ట్రైలర్ వచ్చేసింది.. ఈసారి మరింత బోల్డ్‌గా..




ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బోల్డ్ అంథాలజీ సిరీస్ 'లస్ట్ స్టోరీస్ 3' అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది. ఆధునిక కాలంలో ప్రేమ, కోరికలు, మానవ సంబంధాల్లోని సంక్లిష్టమైన భావోద్వేగాల చుట్టూ అల్లుకున్న ఈ కథలు గత భాగాల కన్నా మరింత బోల్డ్‌గా ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ సిరీస్ సెప్టెంబర్ 18 నుంచి హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు.

ఈ అంథాలజీలో నలుగురు ప్రముఖ దర్శకులు నాలుగు విభిన్నమైన లఘు చిత్రాలను తెరకెక్కించారు. విక్రమాదిత్య మోత్వానే, కిరణ్ రావ్, శకున్ బాత్రా, విశాల్ భరద్వాజ్ వంటి దిగ్గజ దర్శకులు తమదైన శైలిలో ఒక్కో కథను రూపొందించారు. దీంతో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక, ఇందులో కొంకణా సేన్ శర్మ, రాధికా ఆప్టే, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్, రాధికా మదన్, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ వంటి ప్రముఖ నటీనటులు ప్రధాన పాత్రల్లో నటించారు. రియల్ లైఫ్ కపుల్ నటుడు సిద్ధార్థ్, అదితి రావు హైదరీ కొన్ని రొమాంటిక్ సీన్స్‌లో నటించారు. విభిన్నమైన కథనాలతో రాబోతున్న ఈ అంథాలజీ సిరీస్ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com